
92

జూన్ 1979

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక



ఈ సంచికలో....

చలం సంస్మరణ :

చలం – వరవరరావు 2
రెబెల్ – శివసాగర్ 3
జడసమాజానికి షాక్ ట్రీట్‌మెంట్ – శ్రీశ్రీ 47
ఒంటరివాడుగా జీవించిన చలం – కొడవటిగంటి కుటుంబరావు 40
చలం భావజాలం – కె. వి. రమణారెడ్డి 51
చలంతో ఇంటర్వ్యూ – చలసాని ప్రసాద్ 58
దశాబ్దం క్రితం చలం - సృజన – చలంతో నవీన్ ఇంటర్వ్యూ 63
చలానికి విరసం వరంగల్ జోహార్లు 69

కవితలు : పదును దేరిన పాట – హెచ్చార్కె 5
ఇంతకూ నువ్వెవరివి? – ఎ. ఎన్. 30
ఇది సత్యం – వెంకన్న 31

పాటలు : జీతగాడు – బొల్లిముంత నాగేశ్వరరావు 5
పాల్తెం రైతన్నకు – సత్యం 33

నవల-సీరియల్: కొలిమంటుకున్నది – అల్లం రాజయ్య 6

వీరగాథలు : మృతవీరుల కథలు – వంగపండు ప్రసాదరావు 22

జ్ఞాన సిద్ధాంతం: మనిషి-ప్రకృతి – జార్జి థామ్సన్ మూలం
త్రిపురనేని మధుసూదనరావు అనువాదం 34

నడుస్తున్న చరిత్ర: జంషెడ్‌పూర్ - ఈ రహదారి ఎక్కడికి? – సురా - వేణు 43

చర్చ: రచన - భాష – ఒక పాఠకుడు 71

కవర్‌పై చలం ఫోటో : వజీర్ రహ్మాన్

సవరణ : మే సృజనలో "మందమర్రి సంఘటనలు" (పేజి 33 - 35) గురించి ప్రచురించిన వ్యాసంలో కింది అంశాలు సవరించి చదువుకోగలరు.

1. శ్రీపతిరావు మాధవరావు ఏకైక పుత్రుడు కాడు.
2. కాగజ్‌నగర్‌లో బొగ్గు గనులు లేవు.

– సురా

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

92

జూన్ 1979

ఆర్‌వైఎల్‌కు రెడ్ శాల్యూట్

గ్రామాలకు తరలి వెళ్ళండి కార్యక్రమంతో గ్రామీణ పీడిత ప్రజానీకంతో మమేకమై వారిలో వర్గపోరాట చైతన్యానికి పదను పెట్టి ఆదిలాబాదు, కరీంనగర్, పండితాపురం రైతాంగ పోరాటాలు ప్రజ్వరిల్లడానికి ప్రబల కారణమైన ఆంధ్రప్రదేశ్ రాడికల్ యువజన సంఘం తన ద్వితీయ మహాసభలు ఖమ్మంలో జరుపుకుంటున్న సందర్భంలో సృజన తన విప్లవాభినందన లందజేస్తున్నది.

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు   ఈ సంచిక రు. 1-50 పైసలు

చలం

తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవిచేసే అంతర్, బహిర్ యుద్ధరావమే కవిత్వ మంటాడు చెలం.

తనలోనే ఈ ప్రపంచ ముందని, ఈ ప్రపంచంలో తానున్నానని, ప్రపంచ మంతా ఒక ముద్ద కాదని ఇందులో రెండు ప్రపంచాలున్నాయనీ, అంతిమ పరిశీలనలో ప్రజలదైన రెండో ప్రపంచం జయిస్తుందని అటువేపుగా ప్రపంచం నడుస్తుందని చలానికి చెప్తే అభిమానం చూపుతాడు.

నూతన యుగ దూతల భావాల వేగంతో ప్రపంచపు పాత దుమారమంతా వూడ్చుకపోతోవుంటే, హృదయాల మీద పెంకులు పగిలిపోతూ, నిజమైన హృదయాలు స్వచ్ఛ రక్తంతో ఆవిష్కార మవుతూవుంటే బైట రోడ్డుమీదకి రమ్మంటే ప్రపంచా న్నంతా ఒకే గాటన కట్టిన తన అసహనం, అనుమానంతో ఓ మూల స్త్రీల కోసం అట్లా మూలుగుతూనే వుంటాడు.

దిక్కుల్ని, దేవుల్ని, అధికారుల్ని పూగించి ప్రశ్నించే ఆలోచనలు చలానికి అభిమానం. ఈ ప్రపంచానికి నెత్తురూ, కన్నీళ్ళూ తడిపిన కొత్త టానిక్ తయారు చేసిన వాళ్ళకి నిష్కల్మషంగా యోగ్యతా పత్రాలిస్తాడు.

ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, రక్షకభటవర్గాలు, చెరసాలలు, ఉరికొయ్యలు– వీటిని వరించి ఆవేశించిన కుళ్ళు కాలువలు సారస్వత సభాపతులు– ఇవన్నీ చలానికి అసహ్యం.

కాని ఇపుడు వ్రాస్తున్న కొత్తదనాలకే ప్రజలు ఇంకా అలవాటు కాలేదే.... ప్రజలు గాబరాపడి చదవడం మానేస్తారని, అనుమాన పడతాడు చెలం man of little faith.

తన అనుభవాన్ని ప్రపంచానుభవంలో భాగంగా, తన యుద్ధరావాన్ని సమా జంలో తనలాగే సామరస్యం కుదరక సమరం చేస్తున్న ప్రజల పోరాటంలో భాగంగా, తన స్త్రీని స్త్రీ విమోచనోద్యమంలో, అది కూడ భాగమైన ప్రజా విమోచనోద్యమంలో అంశంగా చలం గుర్తించి, ఆ కఠినమైన సత్యాన్ని స్వీకరించి వుంటే ఈశ్వరునితో రాజీపడేవాడుకాడు– సాహిత్య సామాజిక సంచలనాన్ని సృష్టించిన నిజాయితీపరుడు చలం ఈశ్వరాశీర్వాదాలతో అచలంగా ఆగిపోయేవాడు కాదు.

31–5–79

– వరవరరావు

రెబెల్

శివసాగర్

చలం స్వేచ్ఛను కోరినవాడు.

చలం కోరిన స్వేచ్ఛ వాస్తవిక సామాజిక అభివృద్ధి సూత్రాలను గుర్తించింది కాదు- కనుకనే ఆయన పాత్రలు నిజంగా విముక్తి చెందవు- వికసించవు.

చలం రెబెల్.

రాజకీయాల్లో లాగానే సాహిత్యంలో కూడ రెబెల్ జీవితాంతమూ రెబెల్‌గానే వుండ జాలడు. రెవల్యూషనరీగా నయినా మారాలి- (దిగంబర కవుల్లో కొందరిలాగా) లేదా అరవిందుడు ఆశ్రమానికి, సావర్కార్ మతంలోకి, చలం రమణాస్థాన్‌కి, వెళ్ళినట్ల యినా వెళ్ళాలి.

రాజకీయాల్లోని టెర్రరిస్టుల్లాగా సాహిత్యంలో కూడ టెర్రరిస్టు లుంటారు. వీళ్ళు ప్రజలమీద ఆధారపడరు- వ్యక్తిగత నిర్ణయాలు, ఆలోచనలు చేస్తారు. భవిష్యత్తు గురించి స్పష్టత వుండదు. చారిత్రిక అవగాహన వుండదు- సమస్యల మూలంలోకి వెళ్ళరు.

రాజకీయాల్లో టెర్రరిస్టు అరవిందుడు ఆశ్రమానికి చేరాడు- సాహిత్యంలో టెర్రరిస్టు చలం కూడ ఆశ్రమానికే చేరాడు.

చలం భూస్వామ్య వ్యవస్థలోని కొన్ని సామాజిక విలువలపై సాహిత్య బాంబులు విసిరాడు.

మనం టెర్రరిస్టులతో ఏకీభవించకపోవచ్చు- వాళ్ళకు సమస్యపట్ల వున్న వ్యగ్రతను, తపనను గుర్తిస్తాం- అందుకే వాళ్ళను గౌరవిస్తాం. అలాగే చలాన్నీ.

స్త్రీకి కూడ ఒక మెదడుంది- దానిని ఆలోచించనివ్వండి. స్త్రీకి కూడ ఒక హృదయ మున్నది- దానిని స్పందించనివ్వండి. స్త్రీకి కూడ ఒక వ్యక్తిత్వమున్నది- దానిని ఎదగనివ్వండి.

అని చెప్పిన చలం తన తొలి రచనల్లో స్త్రీపట్ల తన దృక్పథానికివి గీటురాళ్ళుగా పెట్టు కున్నా రానురాను స్త్రీలో 'సెక్సే జీవిత మూలసూత్రంగా' ఎంచుకున్నాడు.

సమస్యలన్నిటికీ పరిష్కారం కమ్యూనిజం. అయితే అది ఒక సుదూరపు కల అని ఒక చోట అన్నప్పటికీ, దూరపు కలను నిజంచేసేవైపు ప్రయాణం చేయకుండా సెక్స్ సూత్రానికే తనను తాను ముడివేసుకున్నాడు.

మొట్టమొదటి లక్ష్యాన్ని (motto) వదిలేసి బిహేవియరల్ సైకాలజీలోకి పోయాడు.

తన ముందున్న స్త్రీ సమాజంలో ఏ చారిత్రిక పరిణామ దశలు గడచి అలా వుందో గుర్తించలేదు. అలాగే ఏ సామాజిక పరిణామ క్రమంలో ఆమె విముక్తి సాధ్యమో గుర్తించలేదు. ఈ పరిణామక్రమానికి ఏవి చోదకశక్తులో ఆయన గుర్తించలేదు.

స్త్రీ సమాజంలో తన స్థానాన్ని ఎలా కోల్పోయిందో, కోల్పోయిన స్థానాన్ని తిరిగి ఎట్లా పోరాడి సాధించుకో గలుగుతుందో శాస్త్రీయ అవగాహనతో అర్థం చేసుకోక చలం.

ఒక వ్యక్తివాదిగానే స్త్రీ గురించి తపన చెందాడు గనుక ఆయన స్త్రీకి స్వేచ్ఛ లభించలేదు.

ఆయనకూ స్వేచ్ఛ లభించలేదు.

చలం స్త్రీ సమస్యలను సామాజిక సమస్యల్లో భాగంగా కాకుండా విడిగా చూసాడు. స్త్రీ విమోచనోద్యమం ఆయన ఊహకందలేదు.

మార్క్సిస్టులు కొన్ని సామాజిక నియమాలకు వ్యతిరేకంగా పోరాడుతారు. కొన్ని సామాజిక నియమాలను ఆహ్వానిస్తారు. చలం అన్ని సామాజిక నియమాలనూ వ్యతిరేకించాడు.

విమానం నడుపదలుచుకున్నవాడు విమాన చోదక సూత్రాలను పాటించి తీరాలి. ఆ పాటించడంలోనే అతడు విమానాన్ని ఆకాశపుటంచులకు తీసుకపోగలడు. ఆకాశంలో విహరించే స్వేచ్ఛ ననుభవించగలడు. ఆ సూత్రాలను పాటించని 'స్వేచ్ఛా జీవి' విమానంతోపాటు కూలిపోతాడు. అందుకే ఎంగెల్స freedom is recognition of necessity (అవసరాన్ని గుర్తించడమే స్వేచ్ఛ) అన్నాడు. ఇక్కడ necessity (అవసరం) అంటే objective laws (వాస్తవ నియమాలు) అని గుర్తించుకోవాలి.

చలం స్త్రీని ఉరితాళ్ళతో బిగించిన సమాజానికి షాక్ ట్రీట్‌మెంట్ యిచ్చాడు. ఆనాడు అది అవసరమే. కదిలించకుండా ఆలోచనలు కదలవు. ఆనాటి చారిత్రిక పరిస్థితుల్లో ఆ షాక్ లేకపోతే ఈనాడు ఆలోచనలు ఇంత ముందుకు పోయివుండేవి కావేమో.

సాహిత్యంలో చలం ఆలోచనలూ, కళాసృష్టి గీటురాళ్ళు కాకపోయినా నిస్సందేహంగా మైలురాళ్ళు.

పదును దేరిన పాట

హెచ్చార్కె

గుండె మండి రాసిన గీతం
మళ్ళీ గుండెను మండిస్తుంది.
మండే పొయ్యిలోంచి తీసిన కట్టె
మంచు గడ్డలా ఎందుకుంటుంది ?

ఆకలికి అన్నం అడిగిన నేరానికి
మనుషుల్లా బతుకుదామన్న పాపానికి
భర్తల కళ్ళెదుట చెరచబడిన స్త్రీల నుండి
చెట్లకు కట్టేసి కాల్చబడ్డ వీరుల నుండి
రాస్తున్నానీ పాట

మరి యీ పాట నీకు
హృదయ రంజనమెట్లా కలిగిస్తుంది?
హృదయ మంటూ వుంటే-నడిపిస్తుంది.

జీవితమనే గరుకురాయి మీద
పదును దేరిందీ పాట
ఇది అలీనం ఎట్లా అవుతుంది?
అందరికీ ఆనందం ఎట్లా యిస్తుంది?

నువ్వు నావాడివైనా కావాలి
నాకు పగవాడివైనా కావాలి
సమరంలో నాకు
పాట కూడా ఆయుధమే.

జీతగాడు

బొల్లిముంత నాగేశ్వరరావు

రేవొచ్చె, కాల్వొచ్చె, చేలన్ని తడిపి
తడిసినా బట్టల్లో తడబడత వుంటే,
దొరవచ్చి కసిరిండు సెయ్యన్నడమ్మా!

నేలంత తిరగేసి, నాటేసి నేను
వణుకుతా ఒకదరిని వొదిగి నిలబడితే,
దొరవచ్చి కసిరిండు సెయ్యన్నడమ్మా!

కోసేసి, పోగేసి. కుప్పేసి నేను
ఒంగొంగి ఒకవార వొదిగి నిలబడితే,
దొరవచ్చి కసిరిండు సెయ్యన్నడమ్మా!

నూర్చేసి, ఆరోసి, రాసోసి నేను
అలుపొచ్చి, సొలుపొచ్చి అడ్డైనిలబడితే,
దొరవచ్చి కసిరిండు సెయ్యన్నడమ్మా!

కొట్టల్లో, గాదెల్లో పాతర్ల బోసి
పాణ మందక నేను పడిపోయి వుంటే,
దొరవచ్చి కసిరిండు సెయ్యన్నడమ్మా!

సెయ్యన్న దొరమీన సీపుర్లు కొట్టి
ఇంటి కొచ్చేశాను! ఇకసేయలేకా!
అందారూ ఒకటానే అన్నాల జేరి
సంగమై దొరకెదురు 'సై' అంటనమ్మా!
సింగమై దొరకెదురు 'జై' అంటనమ్మా!

నవల - సీరియల్;

కొలిమంటుకున్నది

ఆల్లం రాజయ్య

(గత సంచిక తరువాయి)

18

మక్కజొన్న పెరడు గాలికి ఊగుతంది. సిమ్మెట్లు పలుకుతన్నయ్.

నాత్రి అదేందో రొద తోని సందడిగ ఉన్నది.

రాయపోశాలు మంచెల నిదుర రాక అటిటు బొర్లిండు. కడుపుల పేగులు కిర కిర లాడ్తన్నయ్. లేసి కూకున్నడు- ఒంట్లె నీర్సంగ, నిస్సత్తువగ ఉన్నది. మూడు దినాల సుంచి కడుపుల ముద్దపడలే- జరమచ్చి ఒళ్లంత పేలాల పెంకోలె మండుతంది. ఏదన్న తినకపోతే పాణమెల్లిపోయేటట్టు గున్నది. జెరమచ్చి ఇంట్ల పన్నందుకు పున్నం జీతం ఇయ్యలేదొర- అంతు కయికిల్లు బెట్టిన్నని మొండిసెయి సూపిండు- తిక్కతిక్కగ గుడిసెకుపోతే పోరగండ్లు ఆకలికి గుడిసెగిరి పోయేటట్టు ఏడుత్తండ్రు. ఎటుసాతకాక పెండ్లాం ఊరుపేరు లేకుంట తిడుతంది- జెరం తగ్గేదిగాదు- ఆకలి తగ్గేదికాదు- గసొంటి జెరంతోనె పనికి బోయిండు- పొద్దయితె గడిసిపోయింది.

నాత్రి ఇంటికి పోదామంతే బుగులు- ఎవలకేమి సెప్పగలడు? తిట్టే పెండ్లాం నోటిని- ఏడ్సే పొల్లగండ్ల ఏడుపును ఎట్లాపగలడు? గందుకనే మంచెల్నె బొత్తలకు కాళ్లిగ్గుకొని పండుకొన్నడు.

ఆకలి మండిపోతంది- గ మంట సల్లారేదెట్లా!

కడుమ పాలేరోల్లు తెలివి తోటున్నరేమొనని ఒక్కొక్కన్ని పేరుబెట్టి పిలిసిండు పాలేరోల్లు ఎవడు సుత ఉలుకలే పలుకలే.

మంచెకింద సుట్టూ పండిన మక్క పెరడున్నది. తన కడుపుల ఆకలున్నది- మక్కకంకులు నీయిగాదు, నాయిన్నది దొర మొఖం. సచ్చేదనుక నిన్ను గిట్లనేపీక్క తింటనన్నది ఆకలి. కడుపుల పేగులు సొన్నాయిలు పాడ్తన్నయ్.

"గి అపనాత్రెల్ల- ఊరులుకు మగ్గినేల్ల- దొరసూడచ్చిండా! ఏపట్టై మంచమ్మీన కడుపుల్ల తాగి గుర్రు కొడుతండో? పాలేరోల్లు సప్పుడు లేదు- అలిసి సొలిసి నోర్లు తెరుసుకొని పన్నరాండాలె- నాలుగంటే నాలుగే కంకులు-" రాయపోశాలు గునాంచుకొని మంచెదిగిండు.

ఆకసంల సుక్కలు ఎక్కిరిత్తన్నయ్- ఎక్కన్నో నక్క మొత్తుకున్నది రాయపోశాలు కాల్లు అనుకుతన్నయ్- కండ్లకు సెక్కరత్తంది- గుండెల దప్పులు గొట్టి నట్టు సప్పుడు- అనికే సేతులతోని నాలుగు మక్క కర్రెలు పీకిండు. పీకిన జాగల ఎప్పటి తీర్గ మన్ను గప్పిండు- పిల్లి తీర్గ అడుగులడుగేసుకుంట పెరడిదాటి కంచెల దూరంగున్న తునికిసెట్టు కిందికి నడిసిండు. తంగెడు పుల్లలేరి కుప్ప బెట్టిండు- జేక మొకకొట్టి కడుపుల పేగులు ఊతలికి రాంగ ఊదూది మంట రాజేసిండు. మొదట కంకి సిటపటలాడింది- కంకిసగం కాలికాలకుంటనే సేతుల్లకు తీసుకున్నడు- పదిగింజ లొలుసుకొని నోట్లేసుకొని నములుకుంట అంచిన తల మీనికెత్తిండు.

నోట్లె గింజలు కింద పడిపోయినయ్. సేతులకంకి కిందబడి పోయింది- మంట కొడల తీర్గ నిలుసున్నదొర- దొరకండ్లల్ల మంట.

"లంజెకొడుకా! ఆరువంకాడికినమ్మి పండదొర్తె గిదాపని-" సేతునున్న పొన్న గర్రెతోని రాయపోశాలు డొక్కల పొడిసిండు.

రాయపోశాలు కిందబడి కొట్టుకున్నడు- విలవిల కొట్టుకుంటన్న రాయపోశాలును దొర కసికొద్ది ఏడబడితె ఆడ గుబెల్లు గుబెల్లున తన్నిండు-

రాయపోశాలు గ కుక్కమూతి రాల్లల్ల మెడగోసిన గొర్రె తీర్గ తన్నుకొని తన్నుకొని పాణమిడిసిండు-

మంట మండుతనే ఉన్నది. సిటపట కంకులు గాల్తనే ఉన్నయ్. దొర మంటెలుగుల కండ్లు తెరిసి నాలికెల్లబెట్టి కొట్టుకోకుంట పడున్న రాయపోశన్ని అంగి సూసిండు- ముక్కుకాడ సెయిబెట్టి సూసిండు.

"లంజకొడుకు సావనే సచ్చిండు-"

కుడిసేపు తునికి సెట్టుకింద గుండు మీన కూకుండి సికిలేటు తాక్కుంట ఇసారిచ్చిండు-

ఎన్నడు ముట్టుకోని దొర రాయపోశని రెండు జబ్బలు పట్టుకొని ఈడ్చుకపోయి నూతిలకు జారిడిసిండు- నొసలుకు పట్టిన సెమట తుడుసుకోకుంటనే- ఎప్పటి తీర్గ పెరటిసుట్టు తిరుక్కుంటనే పిల్లి తీర్గ దొరెల్లి పోయిండు-

19

"రాయపోశడు నూతిలబడి సచ్చిపోయిండు." గీఅర్త మాపటేల్ల కాకముందే ఊరంత సుట్టుకపోయింది- ఏడి పనులాడిడిసిపెట్టి జనం నూతికాడికురికిండ్రు- నూతిల నుంచి శవాన్ని తీసి బాయిగడ్డమీన పండబెట్టిండ్రు- అదోల్లు ముక్కులు సీదిండ్రు.

"మమ్ముల్నెంత పనిజేత్తివిరో దేవుడ! మమ్ముల ముందుగాల నూతిల సూకి నువ్వు పోకపోతివా దేవుడా!" రాయపోశాలు పెండ్లాం మదును శవం మీన పడి గోడు గోడున ఏడుత్తంది.

గుడ్డిగట్టయ్య దూరంగా గుదుప కట్టెకొస గద్దువకింద బెట్టుకొని ఒంటికాలి మీన నిలుసున్నడు. కండ్ల నుంచి జలజల నీల్లుకార్తున్నయ్.

అంకలి మల్లడు గట్టయ్యతోటి గుసగుస బెట్టిండు.

"గట్టన్నా! రాయపోశడు నూతిలబడే సచ్చిండంటవ-పెయ్యిమీన దెబ్బలున్నయ్. పడంగ దాకిన యనుకుంటె పొత్తికడుపుల గుబ్బలేసున్నది-"

తునికి సెట్టుకింద నుంచి బొత్తయ్య అంకరి మల్లయ్యకు సెయ్యూపిండు.

తునికి సెట్టుకింద- బూడిదల మూడంటె మూడెకాలిన మక్క కున్నెలున్నయ్. రెండంటే రెండే సాల్లు ఒలిసిన సగంకాలిన మక్క కంకి బూడిద పక్కకు పడున్నది.

ఇద్దరు అంగగి చూసిండ్లు. సగం నమిలిన గింజలు కనిపిచ్చినయ్. ఆడరాల్ల రప్పలు, సెదరి-పెరిగిన గడ్డి అంగడంగడయి మనిషి గింగిల తన్నుకున్నట్టుగ ఏర్పడు తంది. ఇంకొంచెం దూరంల గుండుకాడ సగం కాలిన సికిలేటున్నది. ఉసికె దిబ్బ మీన మనిషిని ఈడ్చుకపోయిన జాడలు, సెప్పుల అచ్చులున్నయ్. అంకరి మల్లయ్య తలూపిండు-దొరికినయన్ని పంచెకొంగుల గట్టుకున్నడు.

బాయిగడ్డ మీన బాలమల్లు నిలుసుండి సెముటలు కారంగ అందరిని తిడ్తుండు-జనం లోపట గుసగుసలు తొక్కిసలాట-

అంకరి మల్లయ్య నొసలుకు సెయ్యడ్డం బెట్టుకొని బాలమల్లు మొఖం సూసిండు-బాలమల్లు మొఖంల బుగులు- ఎనుకకుబొయి సెప్పుల అచ్చులు సూసిండు-

అంకరి మల్లయ్య పండ్లు పట పట గొరికిండు. దేవుడచ్చినోని తీర్గ ఊగి పోయిండు- గెంటుకుంట గెంటుకుంట బాయిపక్కకున్న మొరం గడ్డమీని కెక్కిండు. సేతులున్న సికిలెటు ముక్క, మక్కకున్నెలు అందరికి సూపెట్టిండు-

"ఇగో మీరంత రాయపోశడు నూతిలపడి సచ్చిండని నమ్మతండ్లా" గట్టిగ అరిసిండు-

బాలమల్లు కండ్లు పులపొడిసి ఏందో సెప్పబోయిండు-

"నువ్వాగు-మల్లిగాన్ని సెప్పనీయ్"గుడిగట్టయ్య

"లంజకొడుక- నీయవ్వను కుక్కల్...." బాలమల్లు-

"తన్నం(డెహెఁ లంజకొడుకును- లావుమాట్లాడుతండు-" జనం మక్క-పెరట్ల ఊగుతం(డు

"సనుండ్లి-సనుండ్లి" బద్దిలింగయ్య సేతులార్చుకుంటచెప్పి "మల్లన్న సెప్పే" అన్నడు.

"రాయిపోశడు నూతిల బడిసావలే-" అంకరిమల్లయ్య

"దయ్యం బట్టి నాదిరో!" గుంపుల నుంచి ఏవలో-

"రాయపోశన్ని సంపిండ్లు"

"ఎవలు సంపుతరు?"

అంకరి మల్లయ్య అందరి మొఖాలు సూసిండు- అందరిమొఖాలల్లో నిప్పు రవ్వలు కుంటంది- పడమటికెల్లి మాపటెండ లగాంచి కొడుతంది.

"ఇంకెవలు సంపుతరు. గీ ఊళ్లెగంత దమ్మెవలకున్నయ్."

"పిస్సగిన లేసిందా? కలువరిత్తన్నవా?" రాజెల్లి

"మనందరికి సిస్సలేవాల్ననే-సంపిండ్లు-నూతిల పారేసిండ్లు"

"దెహెఁ అయిందానికి కానిదానికి ఉలికిపడ్తన్నవ్-" ఎవడో మందిల నుంచి కొట్టి పారేసిండు.

అంకరి మల్లయ్య సేతుల్లసికిలేటు ముక్కను ఎత్తిపట్టు కున్నడు.

"నమ్మకంలేదుర్రి- ఇగోగీసికిలేటెవ్వల్ది- ఫునికిసెట్టుకింద్దికిబోయి సూడుండ్లి నాత్రి పెట్టిన మంట బూడిదున్నది. అడుమూడు దినాల నుంచి జెరంతోటి కూడు లేక సత్తండు. ఇయ్యాల్ల పొద్దుగాల అని పెండ్లాం మదిని నాయింటికచ్చి సేబదులు సోడు గడుక్కియ్యమన్నది. "అడు కూడు కుమ్మలేకుంట నిన్ననంగ పనికి బోయినోడు మల్ల దిరిగి రాలేదన్నది." నిన్న సీకటయేదనుక సాకల్దారు తిరిగి పొద్మేదనుక కొండకెదిరి సూసినట్టు సూసింది. అడు నాత్రి ఇంటికిరాలే- నాత్రి ఆకటి కాగలేక నాలుగుకంకులు కాల్చుకున్నడండాలె- ఇగో గీ కంకి కాల్చి కాలకముంటే ఇత్తులొలిసి నోట్లేసుకున్న దండాలె- అని కర్మం మూడింది. ఇగో గీ మూడుకంకులు మంటల మాడిపొయినయ్- సెట్టుకింద నాలంత అంగడంగడై ఉన్నది. ఏందన్నమాట- ఎవడో కొడుతంటెనె ఈడుకిందబడి తన్నుకున్నడన్నమాట- తన్నుకున్నా ఇడువకుంట ఆనిబొత్తల దేనితోనో

పొడిసిండు- అడు సచ్చిండు. కొట్టినోనికి బుగులు సొచ్చింది- గొరగొర ఈడ్చుకచ్చి బాయిల జారిడిసిండు. ఉసికె మీన సెప్పులచ్చులున్నయి- గ సెప్పులచ్చులు సూడు పోండ్లి- ఎవనియో సమఝయితది. ఎరికయ్యిందారా ఎడ్డి ముండ కొడుకుల్లాలా-" అంకరి మల్లయ్య

అందరి సూపు బాలమల్లుమీన పడ్డది. బాలమల్లు ఎట్ల తప్పిచ్చు కున్నడో- పెద్దారిపొంట ఉరుకుతండు.

"లంజకొడుకు ఉరుకుతండు-"

"బాలమల్లుకు గంత దమ్ములేదు- సంపినోడు బుగులుపడి ఇంట్ల కూకుంటడుగని ఈడికి రాడు- రాయపోశాలును సంపినోడు దొరకాక మరెవ్వలు" అంకరి మల్లయ్య

"ఉరుకుండ్లి, తన్నుండ్లి, పట్టుకరాండ్లి-" జనం తొక్కుతుండ్లు మక్క కర్రలు పటపట ఇరుగుతున్నయ్.

బాయిగడ్డమీది రాయపోశాలు శవాన్ని బొర్లిచ్చిసూసిండ్లు- పెయ్యిమీన దెబ్బలు- పొత్తికడుపుల గుబ్బ- నోట్లెనుంచి నెత్తురు కారి గలుసు కట్టింది. తెరిసిన కనిగుడ్లు తెరిసినట్టే ఉన్నయ్.

బొత్తయ్య మొరం గడ్డమీని కురికి "నిచ్చమే నిచ్చమే- అంకరి మల్లన్న సెప్పింది నిచ్చమే" అన్నడు.

"ఒరి లంజకొడుకు- మిలమిల సూడంగ పానం దీసిండు"

"కండ్లు ముయ్యుండ్లి"

ఎవలో రాయపోశాలు కండ్లు మూసిండ్లు.

నర్సింహం పేగులు తెగిపోయేటట్టు ఏడుత్తుండు.

ఏడుపులు మిన్ను ముట్టినయ్.

రాజెల్లి పెద్దమ్మ అవుతార మెత్తింది. సీరెపేగు బొడ్లెసెక్కుకున్నది- నెత్తి సిక ఊసిపోంగ మొరంగడ్డ మీని కురికింది.

"వాని కాడుగాల వానిల్లు కాముని పెంటకాను. ఓరన్నలాలా! నాయన్నలారా! మీకు పబ్బతి పట్టి దండాలు బెడ్తున్న! నాకాళ్ల అనుకుతన్న . మీరంత సెత్తల్ల పానమున్నోళ్లే- వారీ! సెత్తల్ల సీమునెత్తురున్నోళ్లే- మదును సెల్లె నొట్టబొట్టు తుడిసిండు దొరోడు. మీకండ్లు కాకులు గద్దలు బొడువ- మీసేతులకు పట్టలు సరుప్పలు బుట్ట- ఇంకా మిడిగుడ్లేసుకొని సూత్తరేందిరా! ఓరయ్యలాలా! దొరోని అంశం

నిర్వంశమయ్యేదనుక నిదుర బోకుండ్లి- వాని బంగులిట్ల పీనెల్ల కూలగొట్టుండ్లి- పాండ్లి, శవానెత్తుకొని నడువుండ్లి- అదేమంటడో! ఆడు తిన్నదంత ఎల్ల గక్కయ్యండ్లి- ఆడు తీసుకున్న దండుగులు లెక్కలు గట్టుండ్లి- ఆడు గుంజుకున్న భూములు అడుగండ్లి- ఆడు తీసిన పానాలు లెక్కలు గట్టుండ్లి- ఎంత కాలం గీ బాదలు బడేది-పాటలు పాడితిరి. ఒక్కటయిన మంటిరి. వాని తాడుదెంప- వాని సావు నిర్వావుగాను ఆడింక ఒక్కొక్కన్ని సంపుక తింటనే ఉన్నడు గాదుర్రో! ఎందుకుర్రా గుంజాటన-తెగిన బొక్కెన నూతిల దనుక. మన సుట్టు పక్క ఊళ్లల్ల పని పాటలోల్లు పనులు బందుసేసిండ్లు- తీసుకున్న దండుగలు జకుమాంచి అడుగుతండ్లు, పరం పోగులు, శిఖాలు, కారస్ కిత్తాలు దున్నుతండ్లు- కట్టంచే గదుర్రా కండ్లు మూసుకు పోతన్నయా? మీ సెవుల్ల సెట్లు మొలిసినయా? పిరికెడు పిరికెడు మీసాలు బెట్టుకొని మొగపుటకలు బుట్టెందుకు- పాతకాకుంటె పాతసీరలు గట్టుకొని ఇండ్లల్ల కూకోండ్లి మేమే ఆనింటి మీనికి బోతం- తుపాకినేసి సంపుతడో? అదే మార్నమైపోతదో సూత్తం-" రాజెల్లి రెండుసేతులు ఎత్తి కొట్టుకున్నది. మట్టిగాజులు పలపల పగిలి రాలినయ్. దాని నుదట సూరీడు మెరుత్తండు దానికండ్లు కమ్మరి కొలుములోలె మండుతన్నయ్.

బొత్తయ్య మదునమ్మను మొరం గడ్డమీనికి తీసుకచ్చిండు.
మదునమ్మను సూసి అందరు కండ్ల నీల్లు దీసిండ్లు-
నర్సింహం మొరం గడ్డెక్కిండు-

"మదును సెల్లె బతుకు తెల్లారి పోయింది. దాని పోరగండ్ల బతుకేం గావాలె- అరుగాలం సాలుసాలుకు, కర్రికర్రికు సెముట కాల్వలై పారంగ, పెల్లపెల్లకు నెత్తురు గారంగ- గుద్దేలుగులగొట్టి, సిలుకలగొట్టి, నక్కలగొట్టి సాదుకచ్చిన గీ పెరట్ల నాలుగు కంకులు ఆకలికాగ లేక తిన్నందుకు- దొరోడు పానాలే తీసిండు" నర్సింహం ఆరెకురాల పెరడంత సేతుల తిప్పి సూపెట్టిండు.

"ఆకలి కాదుకోలేని గీ పెరడు ఉండెందుకు లేకెందుకు-" ఎవలో కేకేసిండు-

"ఏంజేత్తడో సూత్తాం నాలుగు కంకులు గాదు- పెరడంత ఇరుసక తిందాము- కాల్సుక, మాడ్సుక తిందాం. మనం బెంచిన పెరడి ఇత్తుకు లేకుంట తిందాం-" గుద్ది గట్టయ్య కట్టె ఊపుకుంటన్నడు.

ఆకలి మీదున్న జనం- పండిన మక్కపెరడు మీద పడ్డది. ఏపుగ పెరిగిన కర్రిలు పటపట విరిగినయ్- బరబర బూరు పీకిండ్లు- కర్రికర్రికు జనం పెరడంతా తొక్కిండ్లు దల్లు పీకిండ్లు- మోట సిమ్ములు పీకిండ్లు- కేకలు, అరుపులు మొత్తుకోల్లు.

కంజీకటయ్యింది. గుడిమెట్టుమీది నుంచి సీకటి పేరుకత్తంది. జెకమొకలు గొట్టింద్లు- ఎర్రెర్రని మంటలు లేసినయ్- మక్క కంకులు పొటపొట గాలినయ్- తింటాంద్లు- కోపంతోటి, కసితోటి కసపిస నమిలి- పొలగంద్లు, ఎగబడి తింటాంద్లు.

సుక్కలు బొడిసినయ్- రాయపోశాలు సుట్టు చేరింద్లు- అందరి ఒళ్లల్ల కంకులే.

"పొండ్లి అనింటికి పొండ్లి-" ఎవలో మొత్తుకున్నరు.

రాయపోశాలును ఎత్తుకున్నరు-

జనం కదిలింద్లు- బొలబొల, పట్టిని సెట్లను పెకలించుకుంటూపారే కొండవాగు వరద తీర్గ నడుత్తంద్లు.

నడుత్తన్న జనంల మదుమ గుండెలు బాదుకుంట పెద్దగా ఏడుత్తంది- గుండె దిటువు లేని ఆడోల్లు ఏడుత్తంద్లు- పడుసోల్లు ముంగట పాటలు పాడుతంద్లు గుడ్డి గట్టయ్య ఎనక తట్టున కుంటుకుంట నడుసుకుంట అంతుపొంతు లేకుంట ఊరు పేరు లేకుంట తిడుతండు. గొంతిక బొంగురు బోయింది. ఊరు పొలిమేర కచ్చెటాల్లకు నెలపొడిసింది- ఆకసంల సుక్కలు ఇకిలిత్తన్నయి. ఊళ్ళె కరంటు బుగ్గలు ఇకిలిత్తన్నయ్.

వాడవాడలు దద్దరిల్లినయి- దుమ్ము రేగింది.

హనుమంతుని గుడికాడికచ్చి జనం ఆగింద్లు- శవాన్ని హనుమంతుని గద్దెమీన పండబెట్టింద్లు.

మల్ల జనంలో గుంజాటన-

బొత్తయ్య అనుమాంద్ల గద్దెక్కిండు- ఇవ్వార్దనుక సాటుమాటుకు కుప్పకూడిన జనం ఇప్పుడు వేటుకే కుప్పకూడింద్లు- బొత్తయ్య ఆందరిని కలె జూసిండు. అందరి ఒళ్లల్ల మక్క కంకులున్నయి. అందరి మొఖాలు కమ్మరి కొలుములోలె కణకణ మండుతన్నయి. అందరి మనుసులు కుమ్మర్రామోలె కుతకుత ఉడుకుతన్నయి.

"మనందరం దొర గడిమీనికి పోతం- పొయ్యేంజెయ్యాలె-" మళ్ల మొదటి కచ్చింది.

"పొయ్యేంజేత్తం గిట్ల అద్దు పిరాదులేకుంట రాయపోశన్ని ఎందుకు సంపిండో దొంను అడుగుతం-" ఎవడో మొత్తుకున్నడు.

"నేను సంపలేదు ఆడే జాయిలబడి సచ్చిండంటడు" బొత్తయ్య

"అంటె మన మూకుంటమా? ఎందరి కండ్లని మూత్తడు" గుడ్డి గట్టయ్య-

"గదే నేనడుగుతన్న గట్లంటే మనమేం జెయ్యాల్నని–"

సోరోడు సెన్నమల్లు మందిల నుంచి ఉరికచ్చిండు–

"ఇగో ముసలోల్లు మల్లమీరు ఎనుక తీపులు తీత్తండ్లు నేను దొరపాలేరోన్ని ఇవ్వార్దనుక– గనాత్రి నేను సుత పండబొయిన ఎట్లంటడో మనం సుత సూత్తాం– అట్లంటే నీతల్లి గడ్డపారలందు కుందాం– గడి కూలగొడ్తాం–" పిడికిల్లి బిగించి హనుమాండ్ల గద్దెమీన గుద్దుకుంట సెప్పిండు.

నర్సింహం గద్దెమీని కెక్కిండు– అందరికి దండం బెట్టిండు.

"ఇయ్యాల్ల తాడోపేడో తేల్సుకోవాల్సిందే– తేల్సుకుంటం– గీ రాయపోశాలు సావేకాదు– మనబతుకుల గురించి సుత తేల్సుకోవాలె– మల్ల గిసొంటి యేల్లరాదు. మనందరం గిట్ల ఒక్కటిగాము– మనందరం గుట్టు సప్పుడు గాకుంట ఉందామన్న ఉండనియ్యడు– రేపొద్దుగాల అళ్ల బందుగులు రంగంలకు దిగుతరు– అరెకురాల పెరడిని పొరకావోడు పేసినంక దొర అట్టిగ ఊకోడు– పోలీసోల్లపిలుత్తడు ఇంటింటికి తరిమికొట్టిత్తడు– బాగా ఇసారం జెయ్యండ్లి. మొన్న మీరందరు మిలమిల సూడంగ సేసిన కూలికి బోతె అట్టన్నాయెంగ సెప్పుతోని గొట్టిండు. మీరు సుత ఎనుక ముందు ఇసారిచ్చిండ్లు– ఇయ్యాల్ల రాయపోశాలు అరుగాలం కట్టబడి అకలితోటుండి– నాలుగు కంకులు గాల్సుక తింటే కొట్టిసంపిండు. బొత్తయ్యను కల్లం కాడ గొట్టిండు– మీనికెల్లి దండుగేసిండు– గిట్లలెక్కబెట్టుకుంట బోతె మనండ్ల దొరతోని దెబ్బలు దిననోడెవ్వడో సెప్పుండ్లి?"

"అదంతెరికేనయ్యా– పాడిందే పాడరా పాసుపండ్ల దాసరి– నాత్రి మించి పోతంది. ఏంజెయ్యాల్నో ఏగిరంగసెప్పు." అయిలయ్య

"గడికే అత్తన్న ! మన కట్టంతోటే దొర గడీ కట్టుకున్నడు. మన నెత్తురు తోటే పంటలు పండిచ్చు కుంటాండు. మన భూములు ఒడుపుగ, బెదిరిచ్చి, తన్ని, అఖరుకు ఇనకుంటె ఖతంచేసి ఏటిన్నితన భూముల్ల గలుపుకుంటండు. కలుపుకొని దొర ఏటేట పెరిగిపోతండు. దొరెట్ల పెరిగిపోతండో అట్ల మన బతుకులు సత్తె నాశిడమై పోతన్నయి. పుట్లకొద్ది ధాన్నెం పండిచ్చినా మనకు తినబోతె తిండిలేదు. పసిపోరని కాన్నుంచి దుడ్డెలమేపి, గొడ్లగాశి, ముప్పయేండ్ల కొలువు గొలిసినా నాలుగు కంకుల మీన అధికారం లేదు రాయపోశాలుకు. మనకు ఉండటానికి గుడిసెలులేవు కట్టవోతె బట్టలులేవు. మనం అదె అరుగాలం కట్టబడాలేంది? ఆళ్లకు బెట్టాలేంది? రాయపోశాలు

సచ్చిందని పగ దీర్సు కోవటంగాదు— మనగ్గావాలె భూములు— మనలను సంపకుంట, తన్నకుంట దొర బుద్ధిగలిగున్నా మనకట్టం తీరది— మన ఎట్టి తప్పది— మనకట్టాలు తీరాలంటె మనకు భూమిగావాలె— దానికోసరము— మనండ్ల ఎందరం సెల్లిపోయినా పర్వాలేదు— మనం కొండసోంటి దొరతోని కొట్లాట బెట్టుకుంటన్నం— దొరొక్కడు మన మెంతమందిమి?" ఆగి అందరి మొఖాలు పారసూసిండు కొందరు బజాట్ల కూలబడిపోయిండ్లు— కొందరు నిలుసున్నరు.

"బూములాల్లయి— ఎనుకటినుంచి ఆల్లకు బూమున్నది. భూములాల్లయి, ఎడ్లాల్లయి, నాగండ్లాల్లయి. ఒక్కదున్ని పెట్టేది మనం—" గుండయ్య గుంపుల నుంచి అడిగిండు.

"దొర పుట్టంగనే బూములు బుజానేసుకొని పుట్టిండా? అందరి తీర్గ బరిబాతనే పుట్టిండు. బూమి, నీల్లు, గాలి, ఆకసం, నిప్పు, ఒకల్లయని ఏడనన్న రాసున్నదా? ఎవడు కోండ్రి లేసిదుక్కిదున్నితె ఆనిదేభూమి— ఎవడు పాలెబడితె ఆనిది అరుక— ఎవడు మేపి సాది సవరచ్చెన జేత్తె ఆనియి ఎడ్లు— ఇన్నరా? అన్నినిలుసుండి ఎడ్లను పిలువుమను— మీరు నిలాసుండి పిలువుండ్లి— ఎవల దగ్గెరి కత్తయి ఎడ్లు? గవెడ్లు భూమి ఒకప్పుడు మనయే సమజ్ కాలె— నే నేడాదికింద బూమున్నోన్నే— ఇయ్యాల్ల రెండు రెక్కలే మిగిలినయి. ఏడబోయింది నా బూమి?"

"దొర బూమిల కల్సిపోయింది" బద్ది లింగయ్య—

"ఎట్ల బోయింది— ఎన్నొత్తులేసి గుంజుకున్నడో గీ ఊల్లె పాల్లీకె పోరితెరికే— మనం సానారోజులనుంచి కుప్పగూడ్తన్నమ్— ఇడిపోతన్నమ్. బూడిదల పన్న కుక్క తీర్గయితంది. తెల్లారి లేత్తే ఎవల పనుల మీని కాళ్లురుకుతన్నమ్. నాట్ల మీన కుప్ప కూడి కయికిల్లు అరీత్తులే ఇప్పిచ్చుకున్నం. సెపులిల్లు కట్టుకొని సెప్పుతండ్లు సాలోల్లు ఏవూల్లేసూసిన తెలివి మీనికచ్చిండ్లు— మనం ఇంకా తన్నులు గుద్దులు తింటనే ఉన్నం. అద్దుపిరాదు లేకుంట అందరిని సంపుకత్తడు. మల్ల మీ అందరికీ సెప్పుకత్తన్న మన దగ్గెర దొర గుంజుకునేదేమిలేదు— మనమే పోయినయి దక్కిచ్చుకోవాలె—"

"సింగసానమేసుకొని ముచ్చెట్లు రేపొద్దుగాల బెట్టేరు. నడిమంగిల మీనుగున్నది. తికునాలు తీసుకుంట కూకుంటె మురిగిపోద్ది— నడువరాి" రాజెల్లి సేతులాడ్సుకుంట సెప్పింది.

కూకునోల్లు లేసిండ్లు—

"నువన్నది నిచ్చమే పెద్దవ్వా!"

"ఇంకొక్కమాట" బొత్తయ్య–

"మాటల కగ్గితగ్గ రేపు మాట్లాడుకునేరు–"

"దొర తన బంధువులను, పోలీసోల్లను పిలిపిత్తడు– మనకు ఎనకా ముంగట ఎవలన్న ఉన్నరా? ఇసారంసేసుకోవద్దా"

"నిచ్చమే– నిచ్చమే–" జనంలో గుసగుసలు–

సంగతిగిదని ఎంతకు తేలలే– అల్లందాల్లే గుంజాటన పడుతండ్లు.

20

రాయబోశాలు నెత్తుకొని జనం ఊరుతొవ్వ బట్టేదనుక పొట్టి పెద్దులు అందరి మాటలినుకుంట అందరి తోటట్టుగున్నడు. అందరు మాట్లాడంగ ఎవలకు అనుమానం రాకుంట మజ్జెమజ్జెన– "దొర నడుగాలె– గింతన్నాయెమా!" అని పిడికిల్లు బిగిచ్చి మొత్తుకున్నడు. అందరు మక్కపెరడి ఇరుసుకొని కాల్సుక తినంగ – అందరితోటట్టు తనుసుత కాల్సుక తిన్నడు– అందరిల్లాంటి ఆకలి తనకున్నదిగదా! అందరు ఊరుతొవ్వ బట్టేదనుక అందరితోటట్టునడిసిండు– ఊరు సొరుర్దిదలకు మూలమలుపుకాడ తప్పిచ్చిండు ఎనుకకు మర్రి సూడకుంట సందు గొందులు తిరిగి దొరగడి ముంగటి కురికిండు.

దొరగడి పెద్దరువాజ మూసున్నది– తలుపు సందుల్ల నుంచి లోపటికి సూసిండు– లోపట కరంటు బుగ్గలు పట్టపగలోలె ఎలుగుతన్నయ్. పులితోలు కుర్సిల దొర కూకున్నడు. దొరనోట్ల సికిలేటున్నది. దొర కాల్లకాడ షావుకారి, మాలిపటేల్, పట్వారి దీలెపడి కూకున్నరు– మొగురాని ఖానుకొని బాలమల్లు నిలుసుండి ఏందో సెప్పుతండు– అరుక్కింద నలభైయాభయి మంది సేతుల్ల గుతుపలు బట్టుకొని నిలుసున్నరు.

"నీ బాంచెన్ దొరా, పెద్దిగాన్నచ్చిన–" పొట్టిపెద్దులు సందుల్ల నోరు బెట్టి పిలిసి భయం భయంగా ఎనుకకు సూసిండు గుండె లడలడ కొట్టు కొంటంది.

"ఎవనివిరా ?" దొర–

"పెద్దిగాన్ని బాంచెన్–"

"ఎందు కచ్చినవ్‌రా ! లంజకొడుక–"

"నీ బాంచెన్– తమరికి సెప్పాలె– అందరు–" గొంతికె తడారి పోయింది.

లోపట గుసగుసలు– బాలమల్లు బంగులెక్క సూసిండు– అబెన్క చందిని దీస్కొని దరువాజ కాడికచ్చిండు. తలుపులు తీసినంక పెద్దిగాడు గజగజ అనుకుంట లోపల జొచ్చిండు. మల్ల తలుపులు మూసిండ్లు–

"నీ బాంచెన్ దొరా!" పొట్టి పెద్దులు పెయ్యంత సెమట కార్తంది....

"ఏందిర పెద్దిగ యాల్లగానేల్లచ్చినవ్-" దొర కనుబొమ్మలు మడిచి.

"నీ బాంచెన్ దొరా! ఆరెకురాల పెరడి ఇత్తుకు లేకుంట ఇరుసుక తిన్నరు. నీ కాల్లు మొక్కుత దొరా! మందికి మూర్నగాల మచ్చింది. రాయపోశన్ని తమరే సంపిండ్లని ఎత్తుకొని తమరింటి మీనికి దండు గట్టుకొని అత్తండ్లు" పెద్దిగాడు వనికి పోతండు.

దొర పండ్లు గొరికిండు-

"గ నర్సన్న, బొత్తోడు- అందరిని ఉసిగొలిపి తీసుకత్తండ్లు బాంచెన్-"

"లంజకొడుక సరీగజెప్పు గిప్పుడే ఎందుకురికచ్చినవ్- గాయింత ఇని రాక పోయినవా?"

"నీ బాంచెన్ నన్ను ఇగ బతుకనియ్యరు. నేను కన్పిత్తె నే అగ్గిల బడ్తండ్లు- ఇగ నేం బోతబాంచెన్-" పెద్దిగాడు ఎనుకకు దిరిగిండు.

"ఓరి సుంకరిమల్లా! గీ లంజకొడుకును సింతకిరిసి కట్టేయ్. లంజకొడుకు ఈడి ముచ్చట్లు అడు జెప్పుతడు" దొర అట్టట్టిగనే పెద్దగ నవ్విండు.

పెద్దిగాడు భీరిపొయ్యేటాల్లకే సింతకు కట్టేసిండ్లు-

"సీమలు కుట్రలుసేత్తన్నయా!" దొర గడిదద్దరిల్లేటట్టు పల్ల నవ్విండు-

షావుకారికి ఉచ్చబడ్తంది. పట్వారి పానం పానంలలేదు- ఇంటికప్పు కెల్లి సూత్తండు-

దొర కాసేపు మాట్లాడలే- కుర్సీలనుంచి లేసి పిడికిల్లు బిగించి అటీటు దిరిగిండు.

దొర ముఖంలో ఎక్కడ్నో బుగులు- ఎక్కన్నోకోపం-

దొర పచారు సేత్తున్నోడు ఆగిపోయిండు-

"ఇగో బాలమల్లా! నర్సిమ్మడు మొదటి నుంచి ఎదురత్తండు. అదెపాయె పోనియ్యని ఎప్పటి కప్పుడు ఊకుండు కుంటచ్చినా! తొండముదిరి ఊసరెల్లయ్యింది-"

"శతృశేషం రుణశేషం-" పట్వారి నోరు తెరిచిఅని టప్పున నోరు మూసు కున్నడు.

"అడు ఎర్రి లేసిన కుక్కోలె తిరుగుతండు. నాకే సమఝయిత లేదు. అన్ని ఇంత వరదనుక ఎందుకు రానిచ్చిన్నో!" ప్రతాపరెడ్డిదొర అరుక్కింద నిలుసున్నోల్ల

దిక్కు- సూసిండు- అళ్లంత కర్రెగ మెట్లకు మెట్లు తలలు వంచుకోని నిలుసున్నరు. తాగున్నరేమొ అళ్లకండ్లు సాకలి పొయిల తీర్గ మండుతన్నయ్.

"నిచ్చపేదొరా! కయికిలి గాళ్లంతా తెలివి మీరిపోయిండ్లు- మనొక్కూళ్లనె గాదు- మొన్న పెంచికెలపేటల దొర భూములన్ని దున్నుకున్నరట- అవలిమొన్న తాలుకాల ఇరువైవేల మందితోని మీటింగులు- నర్సింగరావుదొర ఇయ్యేడు ఇన్నూ రెకరాల జొన్న కొయ్యకుంటనే నలుసుక పోయిండ్లు- నర్సింగరావు దొరోరి ఎయ్యె కురాల అడివికొట్టుక పోయిండ్లు- సౌదరిపల్లెల బాలసంతోల్లు పోలీసోల్లను అరెట్టు చేసిండ్లట- ఏడసూసినా ఏదో ఓటిజగ్గతనే ఉన్నది. మనూల్లెనే జెర కట్టుమీనున్న దనుకున్న- ఏదున్న మీ ముంగటికి రాదుగని- మొదట్ల మామీన్నే పడుతది. ఏడ సూడు ఒకచే పాటలు- ఎవలన్న కనపడితె బందుసేత్తరు. సాపకింద నీల్ల తీర్గ ఊరుకేదో మూడుతంది- మీటింగుకు బోంగ మనం సూత్తమని సీకట్ల సద్దులు గట్టుకొని పోయిండ్లు- ఎవన్ని సూసినా మునుపటి భయం బకితిలేవు. కాలం మంచిగలేదు. దొరలంతా పట్నాలకెల్లిపోతండ్లు- ఒకన్నిడిసి పెడితే గిదే సందని ఇంకోడు తోకమీద కొడుతడు. ఏమో ఎవలు సెప్పచ్చిండ్లు- సెప్పుకింది తేల్లోలెరాకంగనే గిట్లుంటండ్లు- అజాతు గిడిసి పెడితే ఇంకేమన్న ఉన్నదా! తమరికి సెప్పెటోన్నిగాదు. మాటమాటకు గిట్ల మల్లగుల్లాలు బెడితె సేత నడిపియ్య వశంగాదు. నామనుసుల ఎప్పటినుంచో-" బాలమల్లు సెప్పటమాపి అడకూసున్న పెద్దలకెల్లి అనుమానంగా సూసిండు.

"వారీ! బాలమల్లు పులైన అధాటుగ మీనదునుకది. అధాటుగ తుపాకి పేలిత్తె జినుక తప్పిచ్చుకపోద్ది సప్పుడుకు కడుమ జీవాలు బెదురుతయ్. అటం గావాలె- పొంచి సూడాలె- ఇయ్యాల్ల తాగిన కాడికిసాలు- మల్లింక తాగకుండ్లి- ఇంటండ్లా! ఆ లమ్ది కొడుకులు రానేఅత్తరు. అలిశ్యం జెయ్యకుండ్లి- గుప్పెక్కన అళ్లమీన దునుకాలె- వారీ! బొందిగా నీయెంట నలుగురిని తీస్కపోయి ట్రాన్స్ ఫారమ్ కాడ కరంటు బందుసెయ్యి ఊరంత సిమ్మజీకటి గావాలె- గప్పుడు మీద పడుండ్లి- నర్సిమ్మన్ని, బొత్తోన్ని, ఎవదెవడు నకురాలు సేత్తే ఆళ్లను గడిలకు పట్టుకరాండ్లి- ఊపులు మెదు పుండ్లి- సచ్చినోన్ని పీనుగాడుంచద్దు- రాయపోశని పీనుగగాడుండద్దు- తెల్లారేటాల్లకు అడమిగులద్దు- పోండ్లి" దొర సేతులురాసుకున్నడు.

షావుకారి గజగజవనికిండు.

బాలమల్లు సప్పుడు కాకుండ తలంచుకొని మెట్లుదిగిండు. అతనెనుక అరుక్కిందోల్లు కదిలిండ్లు.

ఆళ్లు పొయినంక సుంకరోల్లు గడితలుపులు మూసిండ్లు-

ప్రతాపరెడ్డి కుర్సిల కూకుండి సికిలేటు ముట్టిచ్చిండు. ముకుందరెడ్డి గప్పుడు లేసిండు-

"లే....లే కిందెందుకు కూకున్నవ్. కుర్సిలకూకో-" అన్నడు ప్రతాపరెడ్డి.

"ఏడకూకుంటె ఏమచ్చె-" ముకుందరెడ్డి పెదవి విరిచి కుర్సిల కూకున్నడు-

"గౌరయ్యా, ముకుందం మీరిద్దరు రెండోకంటికి దెల్వకుంట సవారి బండి గట్టుకొని తాలుకాకు బోవాలె- డి.యస్.పి. పాటుకు నేనుత్తరమిత్త- జరూరుగా పోలీసుల తోలుక రావాలె- మన పని మనంసేసేత్తె రేపు లోకమున్నది- అచ్చె వాటన్నిటికి ఆళ్లే భారం పడుతరు మీరేమి జెనుకకుండ్లి- ఒక్కొక్కని కీలు కీలు ఇరుపిత్త రెండు మూడురోజుల్ల ఇస్పెసెల్ పోలీసుల పిలిపిత్త- ఎవరు నోరు తెరువకుంట గావాలె-"

"ఊరు ఊరంత ఒక్క పట్టయ్యింది- ఏందో అంత అట్లు పెరుగ్గలిపినట్టున్నది. అచ్చేటియి తాసీల్ దినాలు." గౌరయ్య సేతులెల్లెలుక లేసిండు.

"ఊరు గాలొక దేడుత్తె- ఇంకోటిగాలి ఒకదేడిసిండట- నడుపుండ్లి-" దొర లేచి ఇంట్లకు నడిసిండు- కాసేపటికి ఉత్తరం తెచ్చిచ్చిండు.

గౌరయ్య, ముకుందరెడ్డి ఎనుక దరువాజ గుండ ఎల్లిపోయిండ్లు-

ప్రతాపరెడ్డి తన కమ్రల నిలుసున్నడు. నిలువడెత్తు అద్దంల తన బొమ్మ కనపడ్తంది- మొఖమంత పీక్కపోయున్నది. కండ్లు మండుతన్నయ్- ఎందుకో మొఖమంత సెమట బట్టింది. అలుమార తలుపు తెరిసిండు. బ్రాండికీస నోటికాడ బట్టిండు. హుశారచ్చింది. గట్లనే మంచం మీన ఒరిగిపోయిండు-

"ఈపాటికి ఆళ్లు సేరుకొనుంటరు-" అనుకున్నడు- టప్పున లైట్లు బందయినయ్. సిమ్మం సీకటి-

"అరె- దీపాలు ముట్టియ్యమనలేదు. ఎంతపనైపోయింది. ఆలంజకొడుకులు సానా మందున్నరు. తప్పిచ్చుకొని గడిమీని కత్తె-" దొర గుండె ఆగి పోయినట్టని పిచ్చింది-

లేసి గోడలు తడుమ వట్టిండు. గుండెల కచ్చులాలు ఉరికినట్టుగ ఒకపేలొల్లి-

ఇంతట్లకే మెత్తని అడుగుల సప్పుడు.

దొర ఉలిక్కపడి మంచమ్మీద కూకున్నడు-

"ఎవలూ-" దొర

"నేనుండ్లీ-" దొర్సాని- దొర్సాని కందీన తీసుకచ్చి బల్ల మీన పెట్టింది.

"నువ్వు తెచ్చినవ్- పనోల్లేద సచ్చిండ్లు-"

"ఇయ్యాల్ల ఎవలూరాలేదుండ్లీ-" దొర్సాని నేలసూపు సూత్తంది- దొర్సాని మొఖం మీద కందీన ఎలుగుబడ్తంది-

"పండుకపో-" దొర-

దొర్సాని తలెత్తింది. ఆమె కండ్లల్లో బుగులు-

"నాకేందో భయంగున్నదుండ్లీ- పనమెల్లిపోదాం- రోజులు మంచిగరాలే-"

"దుత్తెరి నడువ్- నాకండ్ల ముంగట నుంచిపో- ఏడికి పోతవ్- ఏడికి బొయి బతుకుతవ్- ఏంజేత్తవ్-" దొర అరిచిండు.

దొర్సాని మాట్లాడకుంట కాసేపు నిలబడి గిరుక్కున ఎనుకకు దిర్గి ఎల్లిపొయింది-

దొర కమ్రల నుంచి ఈతలకచ్చి సూసిండు- ఊళ్లె ఎవ్వో కేకలు అరుపులు ఇనబడ్తన్నయ్- చందమామను-మబ్బులు కప్పేసినయ్. మసక వెలుగు ఊరు మీద కప్పింది- గుడిసెలు ముసలి దయ్యాల్లా కూరుకుతన్నయ్-

"తెల్లారడానికి ఇంకెంతసేపో- గౌరయ్యగిన సేరుకున్నరుగావచ్చు-" పెద్దరు వాజ కెల్లి సూసిండు. మూసున్నది.

లోపలికచ్చి తుపాకి లోడు సేసుకున్నడు. తుపాకి కుర్సీ పక్కకు బెట్టుకొని కీసమీన కీస తాగుతనే ఉన్నడు-

21

అక్కడ అంజనేయుని గద్దెకాడ మాటలు ముచ్చట్లయి పోయినయ్. ఇసారాలు, గునాయించు కోవడాలు అయిపోయినయ్. బొత్తయ్య అదే కాల్లమీన సెంద్రయ్య దగ్గెరికి, ఆనందం దగ్గెరికిపోను తయారయ్యిండు. అందరు లేసిండ్లు- రాయపోశాలు శవాన్ని ఎత్తుకున్నరు- ఇంతట్లకే కరంటు బుగ్గలు మలిగిపోయినయ్- గుడ్డిఎన్నీల మీద మబ్బులు కప్పినయ్- సిమ్మం జీకటి- అంతట్లకే ఝుయ్యి ఝుయ్యిన ఈలలు ఇనచ్చినయ్- కుక్కొటిఝుయ్యిన మొరుక్కుంట ఉరుకచ్చింది- దానెనుక కుక్కలు ఒక్కపెట్టున మొరిగినయ్- జనం సెవులు నిక్కబెట్టి ఇన్నరు-

ఎక్కనుంచచ్చిండ్లో! కారుదున్నపోతులసోంటోల్లు జనం మీన బడ్డరు- సేతుల్ల ఏమిలేని జనం మీద ఫెడీ ఫెడీ దెబ్బలు, గుప్కీ గుప్కీన గుద్దులు, కొట్టు కోల్లు మొత్తుకోల్లు- కన్నుమూసి కన్ను తెరిసెటాల్లకు ఎవలనెవలు కొడుతండ్లో, ఎవలురుకుతండ్లో- ఎవలేడుత్తండ్లో తెలువకుంటయ్యింది- ఒకలి నొకలు తొక్కుకుంట ఉరుకుతండ్లు.

"సత్తిరో సీటాంచెన్_"

"మీన పడనే పడ్డర్రో లంజకొడుకులు_"

"తన్నండ్లి లంజకొడుకుల_"

"గుద్దుండ్లి లంజకొడుకుల_"

ఏడ్పులు, మూలుగుడులు తప్ప ఏమి మిగిలిలేదు_ బజారు బజారంత నెత్తురు మరకలయ్యింది_

22

తెల్లారే సుక్క బొడిసింది_ మాదుగులంత పెద్దమ్మ గుడికాడ జేరిండ్లు_ ఊళ్లె కడుమ గరీబోల్లంత సుత అక్కడికే చేరిండ్లు_ ఎవల పెయ్యిజూసిన నెత్తురు ముద్దే_ ఆడోల్ల బట్టలన్ని సినిగున్నయ్_ మల్లికాంబ ఒళ్లంత గీరుకపోయున్నది_ మల్లికాంబ పెద్దమ్మగుడి గోడెక్కింది_

అందట్ల నర్సింహులులేడు, సినెంకటిలేడు_ ఇంకా శానమంది లేరు_

"సూసిండ్లుగదా! నోరు తెరువకముందే దొరోడు_ అని మనుసుల తోలిచ్చి గింతమందిని కొట్టిచ్చిండు. ఎందరు సచ్చిండ్లో_ ఎవలెవలను పట్టుకపోయిండ్లో_" మల్లికాంబ కంఠంలో దుఃఖం పొంగు కచ్చింది.

అంతట్లకే బొత్తయ్యా, సెందర్రియ్యా, ఆనందం అచ్చిండ్లు. అందరి మొఖాలు సూసేటాల్లకు సెప్పకుంటనే అర్థమయ్యింది.

పాలిపోయిన ఎన్నెట్ల సెందర్రియ్య మొఖం నిచ్చెంగనే పాలేపోయింది_ గుబగుబ కండ్లల్లకు నీల్లచ్చినయ్.

ఆనందం గుండెధైర్నం జేసుకొని గోడెక్కిండు.

"వానికి అంతెగాలం దగ్గెరికచ్చింది_"

"అయ్యా! మేమిప్పుడు సభలినేటట్టులేం_ మా పెయ్యంత కమ్మరి కొలుములోలె మండుతన్నయ్_ మాసెత్తంత నెత్తురు గార్తంది_ ఇప్పుడు ఏంజెయ్యి మంటరు_ నానబెట్టి పానాల మీనికి దెచ్చిండ్లు" పొట్టి పీరయ్య గిదగిద ఉరుకచ్చి బొచ్చెకొట్టుకుంట అన్నడు.

"అళ్లను పట్టుకపోయిండ్లు_ మనం బోకుంటె తెల్లారేటాల్లకు సంపి బొంద బెడుతరు. అయింక ఏడుసుకుంట ఆడికీడికి ఉరికినా మనం ఏంజెయ్యలేం_" అంకరి మల్లయ్యా_

"తెల్లారిందంటే ఆడు తుపాకేసుకొని ఊరుమీన బడుతడు– మీరత్తరా రారా! నేనురుకుత–" బద్దిలింగయ్య ఉరుకబోయిండు ఎవలో ఆపిండ్లు.

సెందర్రియ్య కాసేపు మాట్లాడకుంట సూసిండు–

"మనమెంత మంది మున్నం మా అంటె నూరో ఇన్నూరో! అందరు గలిత్తె ఎక్కువేకావచ్చు– అయినా పర్వలేదు. ఏద్దొరికితే అదే పట్టుకొండ్లి– మనండ్ల కొందరురికి సుట్టుపక్క పల్లెలోల్ల కూలి సంఘాలోల్లకు జెప్పాలె–"

నలుగురైదుగురు ఉరికిండ్లు–

సుక్కబొరెదెక్కి తూరుపురేకలు వారేదనుక గయ్యే మాటలు– సుట్టు పక్క ఊళ్లోల్లు అందలేదు– అప్పటివరకు ఎవలెవలు లేరో తెలిసింది– రాయపోశాలు శవం మాయ – మయ్యింది–

నోల్లె మంచినీల్లు బొయ్యకుంట, కంటిమీనికి కునుకు లేకుంట పెద్దమ్మ గుడి కాడ కూసున్నరు–

మల్లికాంబ ఏడుత్తంది– సన్నంగ రాగం తీసుకుంట– తల్లి పక్కకు కూకొని, సత్తెమ్మ ఏడుత్తంది– రాజెల్లి "ఊకోమల్లవ్వా! ఊకో," ఊకుంచుతంది–

కొక్కరో కో అని తొలికోడి కూసింది.

23

ఎటురికెటోల్లు అటురికిండ్లు– పాయె– సుడిగాలికంటె వేగంగా– మెరుపు మెరిసినట్టు– ఇల్లిల్లు– సుట్టు పక్కల పల్లె పల్లె గీ అర్తలు సేరినయ్.

"ప్రతాపరెడ్డిదొర ఊళ్లోల్లందరి మీదికి గుండాగాల్లకు తాగిచ్చి ఉసిగొల్పిండు– పొలగండ్ల, ఆడోల్ల, మొగోల్ల, ముసలోల్ల ముతుకోల్ల నెత్తుర్లు కారంగ కొట్టిచ్చిండు. అయిదారుగురు బీదోల్ల గడిలకు పట్టుకపోయిండు– అళ్ల మనసొంటి కూటికి లేనోల్లే– అళ్ల భగ భగ మండే మంటలున్నరు– మాడిపోతన్నరు– మసైపోతన్నరు– ఊరుల "మే" అన మేక లేకుంట పిలువ పిల్ల లేకుంటయిపోద్ది– ఇయ్యాల్ల ఆడు– రేపు మనూరు దొరోల్లు–"

పల్లెలు భగ్గు మన్నయ్– ఆడలు కదిలినయ్–

"పా అంటే పాంప్లె–" (ఇంకా వున్నది)

మృత వీరుల కథలు (వీరగాథలు)

వంగపండు ప్రసాద్

ఆ రోజు ఆసు దాసుగారు- సైకిలు పంచకట్టు కట్టుకోని- కల్లీ కమీజు తొడుక్కోని -(ఆ చొక్కా- మీద రెండు పైట వాణీలు భుజం మీద నుండి జీరాడు తుంటాయి)- దానిపై నడుం కట్టు కట్టుకోని- కుచ్చుల తలపాగా చుట్టుకోని వస్తుంటాడు-

అతనికి ఇద్దరు వీధి దాసర్లు ఎదురవుతారు- ఆ ఇద్దరూ ఆపు చొక్కాలు తొడు క్కోని- అయిదు మూరల గావంచాలు కట్టుకోని గుడ్డ పాతలు తలకు చుట్టు కోనుంటారు.

1వ దాసరి: దండాలండీ దాసుగారు.

దాసు: దండాలు దండాలు- రండి రండి- బావున్నారా.

1వ దాసరి: ఏం బాగు బాబూ- ఈ అడుక్కున్న బతుకన్నా అడవిలోను ఆకై పుట్టడం నయమనుకుంటున్నాను.

2వ దాసరి: అన్నట్టు దాసుగారు- ఈ మద్ది తవఁరు బిలాయెల్లి పాడినారాట?

దాసు: వెళ్ళేనయ్యా!

1వ దాసరి: మీకేటి, పిలిస్తే డిల్లీ కూడా ఎల్లగలరు- అక్కడకక్కడే పాట కూర్చగలరు- అప్పుడుకప్పుడే ఆడగలరు, పాడగలరు।

2వ దాసరి: ఆఁ। అంతటి గొప్పోలా మన దాసుగారు?

1వ దాసరి; గొప్పోలా మరి గొప్పోలా। అయ్యా దాసుగారూ- మీపాట విని పది సంవత్సరాలయిపోయింది- మల్లీ మీ పాట వినాలని మనసు లాగుతుంది- ఒక పాట పాడండి బాబూ.

దాసు: సరే- ఏపాట పాడమంటారో చెప్పండి.

1వ దాసరి: పాత పాట్లొద్దండీ- మాకు ఆ సూర్యుడు మీద- ఈ భూమ్మీద- ఆసంద్రుని మీద- ఏరు మీద- నీరుమీదా అనుమానాలు కొన్ని కలిగాయి. అవి మేమడగు తుంటాము- మీరెమో ఆసు కవిత్వం చేసి- అప్పుడుకప్పుడే ఆడీ పాడీ చెప్పాల.

దాసు: సరే- అడగండి.

1వ దాసరి: (పాటతో ప్రశ్నిస్తాడు)

ఎండలే ఎక్కుతుంటే
కొండలే మండుతుంటే

ఏటిలో ఎర్రిమట్టి
నీటిలో పుడతందీ
ఆ ఏరుకథా సెపుతావా?
అయ్యయ్యో-
ఆ నీరు కథా సెపుతావా?
అమ్మమ్మో- ॥ఆ ఏరు॥

దాసు: ఆనాడు- ఆ ఏటిలో ఎర్రి మట్టినీరు- ఎలా వచ్చిందంటే- ఎందుకు పుట్టిందంటే అదుగో ఆ తూరుపు తీరాన ఈ రాజ్యంలో ప్రజల్ని దోచుకుతినే దోపిడీ దొంగల మీద తిరగబడే యోధులు పుట్టేరు - ఆ యోధులు-

అరుగరుగో - అరుగరుగో రాజోయిరాజ రాజ
ఆకుల్లో - రేకుల్లో ,, ,,
కొండల్లో - కోనల్లో ,, ,,
సెరువుల్లో - సెలకల్లో ,, ,,
సెట్టుల్లో - పుట్టల్లో ,, ,,
ఏరు గెడ్డలు - దాటి ,, ,,
వూరూలె మరిదాటి ,, ,,
తూరూపు దిక్కూనా ,, ,,
తుంగా దుబ్బులుమీదా ,, ,,
వీరూలె పుట్టేరూ ,, ,,
శూరూలె పుట్టేరూ ,, ,,
పేదోలు తరుపూనా ,, ,,
బీదోలు తరుపూనా ,, ,,
రాజికియ్యాల తోను ,, ,,
రాజీలు పడనోలు ,, ,,
పోరునే జేసేరూ-
నెత్తురే బోసేరూ ॥పోరు॥

ఆ నెత్తురంత ఏరులోను
అయ్యయ్యో
ఆనీరు కొట్టుకొచ్చిందీ
అమ్మమ్మో ॥ఆనెత్తు॥

1వ దాసరి: శెబాష్ మా చక్కగా చెప్పేరు- కాని దాసుగారు- ఇంతకన్నా ఘోరం ఇంకొకటి జరిగింది-

దాసు: ఏమిటో ఆ ఘోరం?

1వ దాసరి:

ఎన్నడూ లేనట్టి
నిండు వెన్నెలలోను
దొర దొరగ ఎర్రెరంగూ
దూరుతున్నది జూసేవా ॥దొర॥

ఆ సెంద్రునిలో ఎర్రమచ్చ-
అయ్యయ్యో!
ఆ ఎందుకలగ వచ్చింది?
అమ్మమ్మో- ॥ఆ సెంద్రుని॥

దాసు: ఆనాడు ఆ తెల్లని చెంద్రుడు ఎర్రెర్రగా ఎందుకు మారేడంటే- ఎందుకలా దూరాడంటే-

ఆ వేగు చుక్క దూరు-
తున్న దొక్కనాడురా- ఓరన్నా నా జీతగాడ
పొద్దు గుంకెరా మాయన్న నా జీతగాడ
ఎద్దు నడిచెరా ఓరన్న నా జీతగాడ

ఆ అడివిలోను అన్నలకీ
వెంపటావురా ఓరన్నా నా జీతగాడ
కొమ్మ కాపురా మా ,, ,,
దన్ను దాపురా ఓ ,, ,,

ఆది భట్ల కైలాసం
తోడు నీడరా ఓరన్నా నా జీతగాడ
చూడు చూడురా మా ,, ,,
కూడి నారురా ఓ ,, ,,

కొండా కోదన్నలతో
ఒక్క నాడురా ఓరన్నా నా జీతగాడ
కొలువు దీర్చిరా మా ,, ,,
వీరు లిద్దరూ ఓ ,, ,,

కలుగుతున్న బాదలకీ
కారణాలురా ఓరన్న నా జీతగాడ
దారుణాలురా మాయన్న నాజీతగాడ
చెప్పుతుండగా ఓరన్న నాజీతగాడ

ఆభూసోములు – పోలీసులు
గుట్టు తెలిసిరా ఓరన్న నాజీతగాడ
చుట్టు ముట్టిరా మా ,, ,,
పట్టుకోనిరా ఓ ,, ,,

కత్తులతో గుచ్చుతుంటే
నెత్తురల్ల కారుతుంటే ॥కత్తు॥
తొంగిసూడగ నెందురూడూ
వంగిసూడగ నెందురూడూ
ఆ రత్తమల్ల తుల్లిందీ
అయ్యయ్యో–
ఆ ఎర్రిమచ్చ వచ్చిందీ
అమ్మమ్మో ॥ఆ రత్త॥

1వ దాసరి: శబాష్ దాసుగారు– వీరుల గురించి ఎన్నో కథలు విన్నాము కాని ఇలాంటి వీరుల గురించి ఇదే వినడం– అందుకే మొన్న జరిగిన విచిత్రం కూడా మీ నోటి నుండే వినాల

దాసు: ఏమిటా చిత్రి విచిత్రిం?

1వ దాసరి: సూర్యుడెమో ఒకనాడు
సూదిపోటు తిన్నట్టు
మంట కన్నుల మద్దిలెల్లీ
నీటి సుక్కలు రాలేయా
ఆ సూపెందుకు నల్లగుంది?
అయ్యయ్యా–
ఆ ఎందుకక్కడ నల్లగుంది?
అమ్మమ్మా? ॥ఆ సూపెందుకు॥

దాసరి: ఆ రోజున ఆ చండ ప్రచండ మార్తాండుడు వెలవెలబోతూ విలవిలలాడుతూ ఎందుకు కన్నీరు కార్చేడంటే, దానికి కారణం లేకపోలేదు-

తన పేరుగలవాడు భాస్కర్రావు
తాను చాగంటి ఇంటోడూ ,,
గుంటూరు సీమలోను భాస్కర్రావు
పరుచూరులో పుట్టేడు ,,
డాబుదూబు లేనోడు ,,
డాకటేరు సదివేడు ,,
పోరాటంలో వుండీ ,,
వూరూరూ ఎల్లోడూ ,, ॥తన పేరు॥
ఇంటింటికి వచ్చేడు భాస్కర్రావు
ఇంజిక్షన లిచ్చేడూ ,,
మంచి చెడ్డ అడిగోడూ ,,
మాత్తర్లే ఇచ్చేడూ ,,
పేదోలు కనబడితే ,,
తన ప్రాణాలే ఇచ్చేడూ ,, ॥తన పేరు॥
ఆకలితో ఒకనాడు భాస్కర్రావు
అడవిలోను ఎల్తుంటే ,,
కామందులు కనిపెట్టి ,,
అదికార్లకు కపురెట్టి ,,
పట్టు కున్నారమ్మ
పాలకొండలలోను ॥పట్టు॥
తుపాకి గురిబెట్టి
గుండి మీద కొడతుంటె ॥తుపాకి॥
కొండ పాటున సూరేడు
వుండలేక జూసేడూ
ఆ తుపాకి పేలింది
అయ్యయ్యో
ఆ రవ్వ తూటి గుచ్చింది
అమ్మమ్మో ॥ఆ తుపాకి॥

1వ దాసరి: శబాష్ దాసుగారు- గొప్పవాళ్ళ గురించి గొప్పవారి నోటితోనే వినాలి- కాని ఈ విచిత్రం జరిగిన మరి కొన్నాళ్ళకు మనుషులు నమ్మడానికి వీలుకాని మహా ఘోరం జరిగింది-

దాసు: ఏమిటో ఆ ఘోరం?

1వ దాసరి: కాలమే మోగానయా
కారి భూములు దున్నుతుంటె
నల్లమట్టి భూమిలోనూ
ఎర్రజీరలు పుడతన్నాయి
ఆ జీరలేమి ఘోరమేమి?
అయ్యయ్యా-
ఆ జరిగి వున్న నేరమేమి
అమ్మమ్మా ॥ఆ జీరలేమి॥

దాసుగారు: నేరాలకూ ఘోరాలకూ గురికాబడుతున్న ఈ మానవ సమాజంలో ఒక మహానుభావుడు పుట్టేడు- అతడెవరయ్యా అంటే-

రాజుల్లే తలదన్నే
రామనారిసింహం ॥రామ॥
కూలిరైతన్నాలు
బతకాలీ అన్నాడు ॥బత॥
రాజ్యమే మారందీ
రాతాలే మారందీ ॥రాతా॥
రావ్రా రావ్రా
భూములు రావానీ ॥భూమి॥
గిరిజనులా అన్నలకీ
నాయకుడూ అయ్యాడూ ॥నాయ॥
నాయకుడూ అయ్యానా
నేరాము కిందేమో ॥నేరా॥
నక్సలైటోడానీ
కమ్యూనిస్టోడానీ ॥కమ్యూ॥
కనిపెట్టి - కనిపెట్టి
పట్టుకున్నారమ్మా ॥పట్టు॥

సేతుల్లే కట్టేసి
సెట్టుకే కట్టేసి ॥సెట్టు॥
వల్లునే కోస్తుంటే
కళ్లనే తీస్తుంటే ॥కళ్ల॥
బిడ్డడానీ భూమాతా
అడ్డలేమో సాపిందీ
ఆ కారుతున్న నెత్తురల్ల
అయ్యయ్యో
తన కడుపులోను దాసిందీ
అమ్మమ్మో ॥ఆకారు॥

దాసరి: శబాష్ దాసుగారు- భూమాత వీరుడ్ని బుజ్జగించడం చాల వింతగా వుంది: ఈ వింతలాంటి వింత ఇంకొకటి జరిగింది. అదేమిటా అని అనుమానం నాలో వుండిపోయింది.

దాసు: ఏమిటో ఆ అనుమానం- అడుగు.

దాసరి: కొండ మీదా కోదోలు
పండుతుంటే జొన్నకూడు ॥కొండ॥
వుడుకుతుంటే ఆ కూడూ
వూరతంది నెత్తురు సూడు ॥వుడుకు॥
ఆ నెత్తురులో బాదేటి?
అయ్యయ్యో!
ఆ జొన్నకూడు గాధేటి?
అమ్మమ్మో- ॥ఆ నెత్తురు॥

దాసుగారు; అయితే విను. ఒకనాటి ఝాన్సీలక్ష్మిబాయి లాగ మరొకనాటి రుద్రమాంబ లాగ- ఇంకొకనాటి మాంచాల లాగ- సత్యబామ లాగ- ఈనాడు కూడ స్త్రీజాతికి వన్నెదెచ్చే వీరవనత పుట్టింది- ఆమె పేరు స్నేహలత- ఆమె ఎలాంటిదంటే-

ఆడదానిగ పుట్టి
ఆయుదాన్ని పట్టి ॥ఆయుదాన్ని॥
ఆడదానిగ నేను
అణిగి మనగాలేను ॥అణిగి॥

అన్నాది నా తల్లీ
స్నేహలతా చెల్లీ ॥స్నేహ॥
కట్నాల కన్నిలికీ
కట్టాబడనన్నాది ॥కట్టా॥
పుస్తేల పురితాడు
కట్టాను అన్నాది ॥కట్టాను॥
ఎం. ఏ. బి. ఏలా మె
సదువూ సదువూకుంది ॥సదువూ॥
డబ్బూ కోసము సదువు
అమ్మకో నన్నాది ॥అమ్మ॥
వుద్యమాలు లేప
వూరూరు ఎల్తుంటే ॥వూరూరు॥
నడిరాతిరి సమయాన
నక్సాలే టన్నారు ॥నక్సాలే॥
గుండూ మీదా గుండు
గురిజూసి కొడుతుంటే ॥గురిజూసి॥
పంటసేలు పద్దిలెల్లీ
పారుతుంటే రక్తాము ॥పంట॥
ఆ నెత్తుర్నీ జొన్నసేలు
అయ్యయ్యో
అవి ఎత్తుకోని ఏడ్సాయీ
అమ్మమ్మో ॥ఆనెత్తుర్నీ॥

దాసరి: అయితే దాసుగారు- ఇలా మరణించిన ఈ వీరులెవరు? ఎలాంటి వారు ఇలాంటి వీరులుగా మరణిస్తారు?

దాసు: సాటి మానవులుగా పుట్టి- ఈ భూమి మీద చోటులేని నిర్భాగ్యులు- ఏనాడో ఒకనాడు తమ హక్కుల కోసం పోరాడి తీరుతారు. అలాంటి పోరాట యోధులే ఇప్పుడు మనం చెప్పుకున్న అమర వీరులు. అలాంటి అమరవీరుల దారిలో ఎలాంటి వారు పయనిస్తారంటే-

ఓరె! కడుపెండిన కూలోలు ॥హయిలాసా॥
కల్లోలం రేపుతారు ,,

ఆకలితో బతికినోలూ ॥హాయిలాసా॥
ఆయుదాలు దీస్తారు ,,
ఉద్యోగం లేనోలు ,,
ఉద్యమాలు తీస్తారు ,,
సంసారం సాగనోలూ ,,
సమ్మెలే జేస్తారు ,,
సదువుల్ని సదివినోలూ ,,
సంగతులే అడుగుతారు ,,
ఉరుముల్లా ఉరుముతారు ,,
ఉప్పెనలా పొంగుతారు ,,
అందరి ఆకల్లు దీరె
ఆ రోజులు దెత్తారు

పాసర్లు: అహహ దాసుగారు.
అయ్యారో!
సత్యాన్ని చెప్పినారు ॥అహహా॥

ఇంతకూ నువ్వెవరివి?

ఎ. ఎస్.

1

నగరంలో,
నియాన్ లైట్ల వెల్తురులో
మేజువాణీగా అలంకరించిన స్టేజీమీద
ఖరీదైన బట్టల ఆమె-
"మహిళా దశాబ్దం" గురించి
ఏదో చెప్తూ గొంతు చించుకుంటుంది
నువ్వు నిశ్శబ్దంగా, ఆశ్చర్యంగా
నోరుతెరిచి చూస్తుంటావు-
ఆమె ఖరీదైన జరీచీర కేసి
మెరుస్తున్న దుద్దుల కేసి.
మైకు తోక తెగ్గోసిన మేకలా
అరుస్తుంటుంది.

కాసేపటికి నీకంతా అవగత మౌతుంది.
చిరాకుగా తుపుక్కున ఉమిసి
ఒంటరిగా నువ్వు రోడ్డుమీద నడుస్తుంటే
పండితాపురం మురికి వీధులు
ఆ వీధుల్లో పగిలిన పాదాలతో,
ఆకలితో, గుక్కెడు నీళ్లకోసం
చెరువు లోతట్టు షికంకోసం
చంటి పిల్లలకు పాలుకుడుపుతూ
నడిమివయసుస్త్రీలు
చిరిగిన గుడ్డల వృద్ధస్త్రీలు
జీరబోయిన గొంతులతో అరుస్తూ,
ఊరేగింపులో కదలడమే నీకుకనిపిస్తుంది.
"శాంతి భద్రతల పరిరక్షకులు"
నిరాయుధులైన స్త్రీలమీద కాల్పులు
జరుపడమే వినిపిస్తుంది.
దొడ్డాసుశీల, సీత
గుర్తుకొస్తారు.

కుదురుపాక రాజవ్వ,
బెల్లంపల్లి రాజేశ్వరి,
ఇంకా చెరచబడ్డ రైతాంగసలు—
ఈ సందర్భంలోనే నిన్ను ప్రశ్నిస్తారు.
నాజూకు మెరుపుతీగ
నీ కసహ్యంగా రూపుకడుతుంది
నగరం సాధువులా నటించే పులిలా
అర్థమౌతుంది—
నీ పిడికిళ్ల బిగుసుకుంటాయి

2

రేడియోలో పిల్లల సంవత్సరం కోసం
ప్రధాని చిలుక పలుకుల ప్రసంగాన్ని
అన్ని భాషల్లోకి అనువదించినపుడు
వద్దనుకున్నా నీ చెవుల్లో పడుతుంది
జంషెడ్‌పూర్ ఉక్కు ఫ్యాక్టరీ ముందు
ఇనుప తుక్కు కోసం తచ్చాడుతున్న
పిల్లలను
సేట్ల గుండాలు తరిమికొట్టి—
పొంగే సువర్ణరేఖ నదిలోకి విసిరి
వేయడమే కనిపిస్తుంది—
మళ్లీ పండితాపురమే నీ మనసులో
మెదులుతుంది.
లంబాడిపిల్లల ఎర్రటి లేత శరీరాలమీద
లాఠీల దెబ్బలు, గాయాలు,
"రోలింగ్ ట్రీట్‌మెంటు."
తుపాకి దెబ్బతిన్న నేరానికి ఇంకో
బాలుణ్ణి నిర్బంధించడం—
నీ మనసులో మెదులుతుంటాయి.

"ఉత్ప్రేరకం" ఎంతచిన్నదైనా
శత్రువు కాలరాచి వేయాలనుకుంటాడని
ఎరుపు మొగ్గ ఎంత చిన్నదైనా
కరుకు బూట్లతో తొక్కేస్తాడని
నీకు అర్థమై కళ్లు ఎరుపెక్కుతాయి.

వాళ్ళు చెలిసొల కంటిన నెత్తురు
తుడిచేసుకొని
నీతి సూత్రాలు వల్లిస్తారు.
వాళ్ల పత్రికలు యాపిల్ పండ్ల బుగ్గల
పిల్లలను,
అర్ధనగ్న స్త్రీలను ప్రచురించి
బుకాయిస్తాయి.
నీ కోపం బద్దలౌతుంది.
నువ్వు ప్రశ్నిస్తావు
అన్నీ మీకొరకేనా?
ఇంకా కోపంగా అరుస్తావు
"ఒరే! సమస్తం మీకొరకేనా ?"
సమాధానం నీకేబోధపడి
"వాళ్ల – వాళ్ల రాక్షసత్వానికి
అన్ని స్వేచ్ఛలు ఉంచుకున్నారు.
మాకు వాళ్లిచ్చే బహుమానాలు
లాఠీలు, జైళ్లు, తుపాకులు"
నీలోనీవే గొణుక్కుంటావు.
నువ్వు తెగించడమే ఏకైక మార్గంగా
లాఠీలను, జైళ్ళను,
బద్దలు కొట్టడం గురించి
తుపాకులను ప్రజా చైతన్యంతో
పడగొట్టడంగురించి
పునరాలోచిస్తావు
పోరాటమే నీకన్నీ నేర్పుతుంది—
ఆయుధాలు తయారు చేయడం
ఆత్మరక్షణ కోసం ఆయుధాలు ధరించడం
ముఖ్యంగా గురిచూడడం

ఇంతకూ! నువ్వెవరివి?
మహిళా దశాబ్దంలో చెరచబడ్డ స్త్రీవా?
బాలల సంవత్సరంలో
పొంగే నదిలోకి విసిరేయబడిన
పసిబాలుడవా?

ఇది సత్యం

వెంకన్న

ఎన్నడైనా మట్టి బెడ్డల్లో నడిచారా
ఎన్నడైనా- పంట కోసిన పిదప
కొయ్యా కాళ్ళల్లోనైనా నడిచారా
ఎన్నడైనా పెయ్యి మీద అంగిలేకున్నరా
ఎర్ర ఎండల్లో కదిలే రక్తపు ముద్దల
బాధల నెరుగుదురా
ఎన్నడైనా కూడు లేక ఉపాసమున్నారా
లేక తిన్నదరగక ఆ పూట మానేసి
దాన్నే ఉపాసమను కున్నారా
ఎండ, చలి, వానల్లో
వాగుల్లో, వంతల్లో
చేలల్లో, వరి పొలాల్లో
రాళ్ళా రప్పల్లో, రాత్రి వేళల్లో
పసులల్లో పశువుల్లా
నా రైతు కూలన్నలు పడే బాధలను
గూర్చి కథలైనా విన్నారా
ఎన్నడైనా ఏఒక్క బాధనైనా కన్నారా?
రక్తపు చుక్కల్ని మొక్క మొక్కకు
పోసి, పసి పిల్లల్లాసాకి
పైరు కోత కొచ్చి
ప్రగతికే బంగారు వన్నె తెచ్చి
గాలికి సోయగాలు పోతుంటె
బ్రతుకు బంగారమై పోతుందని
నా రైతు కూలన్నలు పడ్డ ఆనందం
అమ్మబోయిన కాడ అడవై
కొనబోయిన కాడ కొరవై
ఎన్నో కలలు కలలుగానే మిగిలి
అప్పుల కుప్పల్ని చూసి
పుట్టెడు బాధల్ని తల బోసి
నా రైతు కూలన్నలు
అన్నమో రామచంద్రాయని
కాసులు పెంచండి బాబయ్యా యని
పిటీషన్లు పట్టుకొని
రోడ్డున పడితే
ఓ అధినేతలారా!
ప్రజాస్వామ్యం పేర మీరు
వాళ్ళ రక్తానికి తూటాల ధర కట్టారు
రోడ్లమీద చిమ్మిన రక్తం మరకలు
ఇంకా ఆరనే లేదు
వేల మంది ఖైదీలుగా బంధించబడ్డ
రైతుల గుండెల కుంపటి చల్లారలేదు
తుపాకి గుండ్ల కున్న
రక్తం సాక్షిగా చెప్పుతున్న
కసిగా కత్తులు నూరుతున్న
నా రైతన్నలు
మిమ్మల్ని పట్టి కరిపించక మానరు

(పండిన పంటకు గిట్టుబాటు ధరలేదని, కరెంట్ చార్జీలు పెరిగినవని, అప్పులపై వడ్డీ భారం పెరిగిందని తమ న్యాయమైన కోర్కెలతో శాంతి యుతంగా ప్రదర్శనకు దిగి విజ్ఞాపనా పత్రాలనే సమర్పించు కుంటుంటే, జీవితమంటె సినిమా అనుకునే యం. జీ. ఆర్ తుపాకులు రైతుల రక్తాన్ని చవిచూసాయి. ఏపేరుతో ఉన్న ప్రభుత్వమైతేనేమి, రైతాంగం చైతన్య వంతులై కదిలితే తూటాలనే చవిచూపిస్తుంది. ఇది సత్యం. ఆవార్త చదివిన తరువాత, ఆ పోరాటంలో అసువులు బాసిన రైతు సోదరుల అరుణారుణ స్మృతికి జెయిలుపాలయిన వేలాది రైతుసోదరులతో సంఘీభావానికి ఈకవిత)

*పాల్తెం రైతన్నకు....

సత్యం

పాల్తెం గ్రామంలో-
పోరుబాటల్లో ఓ నా రైతన్నా ॥పోరు॥
పోరుబాటల్లోనా
పోరాడినారా ఓ నా రైతన్నా ॥పోరాడి॥
॥పాల్తెం॥
కూలీ రేట్లు పెరుగ
ఒక్కపైతిరా ఓ నా రైతన్నా ॥ఒక్క॥
పరం పోగులు దున్న
నడుమగడ్తిరా ఓ నా రైతన్నా ॥నడుము॥
ఎట్టి బతుకొద్దని
ఎదురు తిరిగింద్లా ఓ నా రైతన్నా ॥ఎదు॥
ఎర్రి జెండా కిందా
ఏకమయ్యింద్లా ఓ నా రైతన్నా ॥ఏక॥
దున్నే హక్కు మాదే
దుక్కి ముక్కా మాదె అన్నారా
ఓ నా రైతన్నా ॥దుక్కి॥
దొరల దోపిడి పోను
సంఘం బెట్టింద్లా ఓ నా రైతన్నా ॥సంఘం॥
॥పాల్తెం॥
సంఘ బలం జూసి దొరలు
వణికి పోయారా ఓ నా రైతన్నా ॥వణికి॥
తుపాకుల పోలీసుల
మన మీదికి తోలింద్లా ఓ నా రైతన్నా
॥మన॥
ముసలోల్ల, ఆడోల్ల గుంజి
లాఠీలతో కొట్టి ఓ నా రైతన్నా ॥లాఠీ॥
నడిరూము రాత్రిళ్ల
ఇండ్ల మీసపడి ఓ నా రైతన్నా ॥ఇండ్ల॥

ఇండ్లు కాలబెట్టి
పండ్లు గొరికింద్లా ఓ నా రైతన్నా ॥పండ్లు॥
॥పాల్తెం॥
పాలె[1] బట్టె చేతులకు
బేడీలేసింద్లా ఓ నా రైతన్నా ॥బేడీ॥
పంట దీసే సేతుల్ల
బందించినారా ఓ నా రైతన్నా ॥బందిం॥
బందికాన్ల బెట్టి
బొచ్చె[2] సరిసింద్లా ఓ నా రైతన్నా ॥బొచ్చె॥
జైలు గోడల్లోన
లాఠీల నడుమ ఓ నా రైతన్నా ॥లాఠీల॥
కుక్కల బతుకద్దని
కోపగించేవా ఓ నా రైతన్నా ॥కోప॥
॥పాల్తెం॥
కోడె నాగువోలె
బుస కొట్టినావా ఓ నా రైతన్నా ॥బుస॥
జనుప తాడు తీరు
అల్లుక పోదాము ఓ నా రైతన్నా ॥అల్లుక॥
పంట సేండ్ల తీరు
కలిసే ఉందాము ఓ నా రైతన్నా ॥కలిసే॥
అన్నల్లు ఒరిగినా
ఇండ్లు కాలినా ఓ నా రైతన్నా ॥ఇండ్లు॥
మన రాజ్జెమచ్చేదనుక
పోరాడితీరుదాము ఓనా రైతన్నా ॥పోరాడి॥
॥పాల్తెం॥

---

1. దున్నేటప్పుడు చేతితో పట్టుకొనే నాగలి కొయ్య.
2. ఛాతీ

★పెద్దపల్లి తాలూకాలో ఇటీవల పోలీసుల దాడికి గురైన పోరాట గ్రామం.

మనిషి - ప్రకృతి

i) జీవితం - చైతన్యం

మనస్సుకంటే పదార్థం ముందు అని గుర్తించేవాడు భౌతికవాది. మనస్సు, ఆత్మ, ఆలోచన, చైతన్యం అని అనేక విధాలుగా మనం వ్యవహరించేది అంతా పదార్థ వ్యాపారమే. ఆలోచన భౌతిక అంగ నిర్మాణం గల మెదడు వ్యాపారం. ఆలోచన లేకుండా పదార్థం అస్తిత్వంలో వుంటుంది. పదార్థం లేకుండా ఆలోచన అస్తిత్వంలో వుండదు. అందుచేత పదార్థం ఒక్కటే భౌతిక వాస్తవికత.

"పదార్థం మనిషికి ఇంద్రియ జ్ఞానాలద్వారా లభించే బాహ్యవాస్తవికతను నిర్దేశించే తాత్విక తరగతికి చెందింది. ఇంద్రియ జ్ఞానాలతో ఉన్నది వున్నట్టు ఛాయా చిత్రితమై ప్రతిబింబిస్తుంది."[1]

పదార్థం నిరంతర చలనం, నిరంతర మార్పును పొందేస్థితిలో వుంటుంది. ప్రతి చలనంలో మార్పు వుంటుంది.

"చలనం పదార్థ అస్తిత్వధోరణి. చలనం లేకుండా పదార్థం ఇంతవరకూ ఎక్కడాలేదు. ఇకముందు ఎక్కడావుండదు. విశ్వాంతరాళంలో చలనం, నక్షత్ర మండల గ్రహాలమీద చిన్నరాశుల చలనం, ఉష్ణోగ్రత, విద్యుత్తు, సూదంటురాయి ఆకర్షణల వంటి గతిలోని అణువుల చలనం, రసాయనిక విరూపం, సమ్మేళన, సేంద్రియ జీవితచలనం- ప్రతి నిర్దిష్టక్షణంలో ప్రపంచ పదార్థసంబంధమైన ప్రతి ప్రత్యేక పరమాణువు ఈ చలన రూపాల్లో ఏదో ఒకటిగానో, లేదా ఒకేసారి అనేక చలన రూపాల్లోనో వుంటుంది. విశ్రాంతి అంతా, స్థిరత్వం అంతా సాపేక్షంమాత్రమే. అది ఏదో ఒక నిశ్చితచలన రూప సంబంధంలోనే అర్థవంతంగా వుంటుంది."[2]

ఇది ప్రకృతి దృగ్విషయాలలో మాత్రమే కాక మానవ సమాజం, ఆలోచనల విషయంలో కూడా సత్యమే. సామాజిక, మానసికక్రమాలు అన్నీ ఒకే విధమైన చలన, మార్పు ప్రాథమిక సూత్రాలకు లోబడి వుంటాయి. ఈ సూత్రాల అధ్యయనాన్ని మనం గతి తర్కం అంటాం.

"గతి తర్కం ప్రకృతి, మానవ సమాజం, ఆలోచనలకు సంబంధించిన చలన, అభివృద్ధి సాధారణ సూత్రాల శాస్త్రం తప్ప మరేమీకాదు."[3]

"చరిత్రలో ఆకస్మికంగా కనిపించే ఘటనలను పాలించే గతి తార్కిక చలన సూత్రాలే, మానవ ఆలోచన అభివృద్ధి చరిత్ర అంతటా వ్యాపించి బంధంగా రూపొంది

క్రమంగా మనిషి మనస్సులో చైతన్యంగా అభ్యుదయం పొందే గతి తార్కిక చలన సూత్రాలే సంభవించే అసంఖ్యాక మార్పుల సంక్షోభం మధ్య పని చేస్తాయి."[4]

గతితర్క సూత్రాలు వైరుధ్య నియమం మీద ఆధారపడి వుంటాయి. వస్తువులలో సహజంగావుండే అంతరంగిక వైరుధ్యాల అభివృద్ధిలో మొత్తం చలనం, మొత్తం మార్పు వుంటుంది.

"మన వస్తువుల మార్పును. వస్తువుల జీవితాన్ని, వస్తువుల పరస్పర ప్రభావాన్ని వస్తువుల చలనంలో పరిగణించగానే తక్షణం వైరుధ్యాలు ప్రస్తావనలోకి వస్తాయి. చలనమే వైరుధ్యం. కేవల యాంత్రిక స్థలసంబంధ మార్పుకూడా ఒకే క్షణంలో, అదేక్షణంలో, ఒక స్థలంలో, మరొక స్థలంలో రెండింటిలోవుండే, దానిలో కాక ఒకే స్థలంలో, అదే స్థలంలో వుండే వస్తువు నుంచీ సంభవిస్తుంది.

సామాన్య యాంత్రిక స్థల మార్పులోనే వైరుధ్యం వుంటే ఇంద్రియమయ జీవితం, దాని అభివృద్ధి వంటి పదార్థ చలన వున్నత రూపాల విషయంలో వైరుధ్యం ఉండటం ఇంకా సత్యం అందుచేత జీవితం కూడా వస్తువులలో, క్రమాలలో వుండే వైరుధ్యమే. అది నిరంతరం తనంత తాను స్థిరం అవుతూ, కరిగిపోతూ వుంటుంది. ఈ వైరుధ్యం తొలిగి పోయిన క్షణంలోనే జీవితం కూడా అంత్యదశకు వస్తుంది, మృత్యువు అడుగు పెడుతుంది."[5]

"ప్రతి క్షణంలోనూ ప్రతిప్రాణి ఒకటిగా వుంటుంది. ఒకటిగా వుండదు; ప్రాణి ప్రతి క్షణంలోనూ బయటనుంచి గ్రహించిన పదార్థాన్ని జీర్ణంచేసుకుంటుంది, ఇతర పదార్థాన్ని విసర్జిస్తుంది. ప్రతి క్షణంలో దాని శరీర జీవకణాలు చచ్చిపోతాయి, కొత్త జీవకణాలు రూపొందుతాయి; ఎక్కువ కాలంలోగానీ, తక్కువ కాలంలోగానీ ప్రాణి శరీర పదార్థం స్థానంలో ఇతర పదార్థ అణువులు చేరుతాయి, ఇతర పదార్థ అణువులతో పునరారంభించ బడుతుంది. అందుకనే ప్రాణి అన్ని సమయాల్లోనూ తానుగావుంటుంది తనకు ఇతరమైన మరొక విధంగా వుంటుంది."[6]

కాబట్టి గతి తర్కాన్ని పదార్థ స్వ భావంలో అంతర్జాతంగా వుండే వైరుధ్యాల ఘర్షణను అధ్యయనం చేసేదిగా వివరించవచ్చును.

"ప్రకృతి దృగ్విషయాల అన్ని క్రమాలలో (మనస్సు, సమాజంతో సహా) వైరుధ్య స్వభావంగల, పరస్పర ప్రత్యేకమైన విరుద్ధ ధోరణులను గుర్తించడం లేదా ఆవిష్కరించడం వైరుధ్యాల మధ్య ఐక్యత. వాస్తవ జీవితంలో ప్రపంచంలోని అన్ని

క్రమాల జ్ఞానానికి వైరుధ్యాల ఐక్యత వాటి జ్ఞానం ఒక పూర్వషరతు. వైరుధ్యాల 'ఘర్షణ' అభివృద్ధి."7

అంతరంగిక వైరుధ్యాల అభివద్ధి అన్ని పదార్థరూపాలకూ విశ్వవ్యాప్త లక్షణం కాగా, ప్రతిప్రత్యేక చలన రూపానికీ మార్పుకూ ప్రత్యేక వైరుధ్యం వుంటుంది. ఈ ప్రత్యేక వైరుధ్యాలే విభిన్న శాస్త్రశాఖల మధ్య వ్యత్యాసానికి మూలకారణాలు.

"ఒక దృగ్విషయరంగానికి ప్రత్యేకంగా వుండే వైరుధ్యం నిర్దిష్టశాఖ అధ్యయనానికి విషయం అవుతుంది. ఉదాహరణకు, గణితశాస్త్రంలో ధన, రుణ సంఖ్యలు; యంత్రగతి శాస్త్రంలోచర్య, ప్రతిచర్యలు; రసాయినికశాస్త్రంలో సమ్మేళన, విచ్ఛిత్తులు పదార్థవిజ్ఞాన శాస్త్రంలో ధన, రుణ విద్యుత్తులు; సామాజిక శాస్త్రంలో ఉత్పత్తి శక్తులూ వుత్పత్తి సంబంధాలు, వర్గాలు, వర్గపోరాటాలు; మిలటరీ శాస్త్రంలో దెబ్బకాచుకోవటం, దెబ్బతీయటం; తత్వశాస్త్రంలో భావవాదం భౌతికవాదం, అధిభౌతిక దృక్పథం గతి తార్కిక దృక్పథం మొదలైనవి. ప్రతి శాస్త్రశాఖకూ ప్రత్యేక వైరుధ్యం, ప్రత్యేక సారాంశం వుంటాయి కాబట్టి, ఇవన్నీ విభిన్నశాస్త్ర శాఖలకు అధ్యయన విషయాలు."8

కొన్ని మాంసకృత్తు ద్రవ్యాలు స్వయం- పునరారంభం (Self renewal) అనే ఒక చలన రూపాన్ని అభివృద్ధి చేసినప్పుడు నిర్జీవ పదార్థం సజీవ పదార్థంగా మారటం జరుగుతుంది.

"జీవితం మాంసకృత్తు ద్రవ్యాల అస్తిత్వ ధోరణి. ఈఅస్తిత్వ ధోరణిప్రధానంగా ఈద్రవ్య రసాయినిక భాగాల నిరంతర స్వయం పునరారంభాలతో పొసగివుంటుంది."9

ఈ మాంసకృత్తు ద్రవ్యాల శరీరం తన పరిసరాల నుంచీ కొన్ని ద్రవ్యాలను గ్రహిస్తూ, పూర్వం తీసుకున్న వాటిని విసర్జిస్తూ అంటేపోషించుకుంటూ విసర్జిస్తూ తనకు తాను పునరారంభం పొందుతుంది. ప్రాణికీ పరిసరాలకూ మధ్య పదార్థానికి సంబంధించిన ఈ నిరంతర పరస్పర మారకం జీవితం, ఈమారకం పోయినప్పుడు ప్రాణి చచ్చిపోతుంది. సజీవ పదార్థ విశిష్ట లక్షణాలు అన్నీ ఈమూలాధారం నుంచి పుడతాయి.

"మాంసకృత్తు ద్రవ్యాల ప్రధాన వ్యాపారమైన పోషణ, విసర్జన నుంచి సంభవించే పదార్థ మారకం నుంచీ, దాని అసాధారణ రూపకల్పన శక్తినుంచీ, మాంస కృత్తు ద్రవ్యానికీ దాని ఆహారానికీ మధ్య అన్యోన్య సంసర్గంలో ప్రత్యక్షంగా కలిగి వుండే ప్రేరణకు స్పందన, ఆహార స్వీకారంలో అతితక్కువ రూపాల్లో కనిపించే ముకుళిత స్వభావం; ఏది లేకపోతే ఆహార స్వీకారం కానీ, జీర్ణంకానీ సాధ్యం కాదో

ఆ అంతరంగిక చలనంతో వేర్వేరుగా విడిపోవటంతో ప్రచారమయ్యే తక్కువ రూపాల అభివృద్ధికి అవకాశం వంటి అన్ని జీవిత అతి సామాన్య లక్షణాలూ సంభవిస్తాయి."10

నిర్జీవ పదార్థం నుంచి సజీవ పదార్థ పరివర్తన కంటే జంతు ప్రపంచం నుంచి మానవ పరిణామం ఏ మాత్రం తక్కువ ఆకస్మికంకాదు. మనిషికీ పరిసరాలకూ మధ్య పదార్థ మారకాన్ని చైతన్యవంతంగా మనిషి అజమాయిషీ చేయటంతో జంతువుల నుంచి విభిన్నుడయ్యాడు. జంతువులు కూడా పరిసరాలను గూర్చి చైతన్య వంతంగా వుంటాయి. మనిషి పరిసరాలు తనకు వేరుగా వుండే పదార్థంగా, వుత్పత్తి శ్రమలో తన కార్యాచరణకు విషయంగా చైతన్యంతో వుంటాడు. అందుచేత ప్రకృతి ఒక పరాశ్రయ వస్తువు అనే చైతన్యంలోవుండి మనిషి తనను గురించి ఆత్మాశ్రయంగా కూడా చైతన్యంతో వుంటాడు.

"జంతువు తన కార్యాచరణలో తక్షణం అభేదం పొందుతుంది. జంతువు తన కార్యాచరణ నుంచి తనను తాను విభజించు కోలేదు. అది దాని జీవిత కార్యాచరణ. మనిషి తన జీవిత కార్యాచరణనే తన సంకల్పానికి, తన చైతన్యానికి విషయంచేస్తాడు. మనిషికి చైతన్యవంతమైన జీవిత కార్యాచరణ వుంది."11

"ఈ కర్త మనిషికీ, విషయం ప్రకృతికీ" మధ్య వైరుధ్యం శ్రమ -క్రమంలో అంతర్గతంగా వుండి సర్వమానవ కార్యాచరణలకూ ఆధారంగా వుంటుంది.

"శ్రమ మనిషీ ప్రకృతీ ఇద్దరూ పాల్గొనే, మనిషి తానుగా తనకూ ప్రకృతికీ మధ్య భౌతిక ప్రతిచర్యలను ఆరంభించి క్రమబద్ధంచేసి, అజమాయిషీ చేసే క్రమం. ప్రకృతి శక్తులలో ఒక భాగంగా మనిషి ప్రకృతి వుత్పత్తులను తన కోరికలకు అను గుణ్యమైన రూపంలో భుక్తం చేయడం కోసం తన శరీరంలోని ప్రకృతి శక్తులైన ముంజేతులనూ, కాళ్ళనూ, తలనూ బాహువులనూ చలనంలో పెట్టి ప్రకృతిని ఎదుర్కొంటాడు."12

కాబట్టి ప్రకృతిని చైతన్యవంతంగా తన ఆధీనంలోకి తెచ్చుకోవటం అనే క్రియతో మనిషి తక్కిన జంతువుల కంటే భిన్నంగా వుంటాడు.

"జంతువు కేవలం బాహ్య ప్రకృతిని వుపయోగించుకుంటుంది. కేవలం తన వునికితోనే మార్పులను సంభవింప జేస్తుంది. మనిషి తాను సంభవింపచేసే మార్పులతో ప్రకృతిని తన లక్ష్యాలకు విధేయంచేసి అధికారం చెలాయిస్తాడు."13

ఉత్పత్తికోసం చేసేశ్రమ ప్రకృతి మీద మానవుల చర్యకు సంబంధించిన చైతన్యవంతమైన నిర్మాణాన్ని అవశ్యం చేస్తుంది. అందుచేత సహకారంగా వుండటం జరిగి, వుత్పత్తి శ్రమ తన సహచరులతో మనిషి సంబంధాల చైతన్యవంతమైన నిర్మాణాన్ని అవశ్యం చేస్తుంది. ఒక్కమాటలో ఉత్పాదక శ్రమ సామాజికం.

"ఉత్పత్తిలో మనుషులు ప్రకృతితో మాత్రమేగాక ఒకరితో ఒకరు కూడా కలిసి పనిచేస్తారు. ఒక మార్గంలో సహకారం చేసుకుంటూ కార్యాచరణలను పరస్పరం మారకం చేసుకుంటూ వుత్పత్తి చేస్తారు. ఉత్పత్తి చేయటం కోసం మనుషులు తప్పని సరిగా నిశ్చిత కలయికలలో, పరస్పర సంబంధాలలో ప్రవేశించాలి. ఈసామాజిక కలయిక, సంబంధాల లోపల మాత్రమే ప్రకృతిమీద వాళ్ళ చర్య వుత్పత్తిని సంభవింపచేస్తుంది."14

దీనిని బట్టి మానవ చైతన్యం వ్యక్తికీ ప్రకృతి పరిసరాలకూ మధ్య కేవల సంబంధ మాత్రంకాదనీ, అది దాని సులభ రూపాల్లోకూడా వ్యక్తిలో ప్రతిబింబించే సమాజానికీ దాని పరిసరాలకూ మధ్య సంబంధమైన సామాజిక రూపమనీ స్పష్టమవుతుంది. మనిషి తన ఇంద్రియ జ్ఞాన ముద్రలను (Sense impressions) క్రమబద్ధం చేసుకునే భావనాత్మక ఆధారం సామాజిక సంబంధాల నుంచే ఆకృతి పొందుతుంది. మార్క్స్ చెప్పినట్టు "మానవ అస్తిత్వాన్ని నిర్ణయించేది మానవుల చైతన్యం కాదు, మానవుల సామాజిక అస్తిత్వమే మానవ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది."15

ii) ఉత్పత్తి – వినియోగం :

ఉత్పాదక శ్రమలో మనిషి తన పరిసరాలను ఎదుర్కొని చైతన్యవంతమైన తన అజమాయిషీలోకి తెచ్చి జీవితావసర సాధనాలను వుత్పత్తి చేస్తాడు. మనిషి నుంచి ప్రకృతికీ, వ్యక్తి నుంచి వస్తువుకూ ప్రారంభ చలనం వుంటుంది. ఈప్రారంభ చలనాన్ని ప్రకృతి నుంచి మనిషికి, వస్తువు నుంచి వ్యక్తికి ప్రతిబింబ చలనం అనుసరిస్తుంది. తాను వుత్పత్తి చేసిన దానిని వినియోగిస్తూ, ఉత్పత్తిలో తాను వినియోగించే శారీరక శక్తిని పునరుత్పన్నం చేస్తాడు. అదే సమయంలో క్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తూ మనిషి క్రమాన్ని అజమాయిషీ చేయటానికి తన మానసిక శక్తిని విస్తృతం చేసుకుంటాడు.

"బాహ్య ప్రపంచంతో పనిచేస్తూ, బాహ్య ప్రపంచాన్ని మారుస్తూ అదే సమయంలోమనిషి స్వీయ స్వభావాన్ని మార్చుకుంటాడు. తన నిద్రాణ శక్తుల్ని అభివృద్ధి చేసి తన అధికారానికి విధేయంగా పనిచేసేటట్టు వాటిని వొత్తిడి చేస్తాడు."16

ఈ రెండు చలనాల్లో ప్రారంభ చలనం పనిముట్ల వాడకాన్ని అవశ్యం చేస్తుంది. కాబట్టి మొదటి నుంచి చైతన్యవంతమైనది. పనిముట్టును తయారుచేసేముందు, దానిని యే ప్రయోజనం కోసం ఉపయోగించాలో మనిషికి చైతన్యం వుండి తీరాలి. ఆ పని ముట్టును శక్తివంతంగా వుపయోగించే ముందు వుత్పత్తి చేయదలచిన విషయానికి సంబంధించిన భావరూపాన్ని లేదా భావాన్ని తన చైతన్యంలో రూపొందించుకొని తీరాలి. ఇదే ప్రకృతి మీద మనిషి చర్యకు జంతువుల చర్యకు మధ్య ముఖ్యమైన భేధం.

"సాలెపురుగు నేతగాని పనిని స్ఫురింపచేసే పనులను నిర్వహిస్తుంది. తేనె టీగ తన చిన్న గదులను నిర్మించటంలో అనేక మంది వాస్తు శిల్పులను సిగ్గుపడేట్టు చేస్తుంది. వాస్తుశిల్పివాస్తవంలో తాను నిర్మించేదానికి ముందే తన వూహలో తన నిర్మాణాన్ని వూహిస్తాడు. ఇదే తేనెటీగల మంచినైపుణ్యం నుంచి తక్కువస్థాయి నైపుణ్యంగల వాస్తుశిల్పిని విభజిస్తుంది. ప్రతిశ్రమ క్రమం చివరా శ్రమ ఆరంభానికి పూర్వమే శ్రామికుని వూహలో అస్తిత్వంలో వున్న దాని ఫలితాన్ని మనం పొందుతాం. మనిషి ఆతడు పనిచేసే పదార్థంలో రూపాన్ని మార్చటమే గాక, తన కార్యసాధనా పద్ధతికి సూత్రాన్ని ఇచ్చే, తన సంకల్పాన్ని తప్పని సరిగా విధేయంచేసే తన స్వీయ ప్రయోజనాన్ని కూడా గుర్తిస్తాడు."17

శ్రామికుల వూహల్లో రూపొందే ఈ పూర్వస్థిర భావరూపానికి రెండు అంశాలు వుంటాయి. ఉత్పత్తిదారునకు తన ప్రయోజనాన్ని సాధించే మార్గంలో శ్రమ క్రమాన్ని నిర్వహించటానికి శక్తినిఇచ్చే, ఉత్పత్తిలో పూర్వ ఆచరణ నుంచి పొందిన జ్ఞానం ఈపూర్వస్థిర భావరూపానికి వుండే ఒక అంశం. ఇది దాని పరాశ్రయం లేదా అవ గాహనా అంశం. వినియోగంలో పూర్వ అనుభవం నుంచి పుట్టి వుత్పత్తిచేయాలనే సంకల్పాన్ని కలిగించేకోరిక ఈపూర్వస్థిర భావరూపానికి వుండే మరొక అంశం. ఇది దాని ఆత్మాశ్రయలేదా అనుభూతి అంశం. ప్రయోజనం, సంకల్పం - శ్రమక్రమానికి సంబంధించిన ఈ రెండుఅంశాలలో శాస్త్రానికీ కళకూ మధ్య వ్యత్యాస బీజాన్ని మనం గుర్తించవచ్చును.

iii) పంపకం:

పంపకం ఉత్పత్తికీ వినియోగానికీ మధ్య విభజనతో అవశ్యం చేయబడే సామా జిక క్రియ. జంతువులలో వుత్పత్తి లేనట్టుగానే పంపకం కూడావుండదు. వినియోగంతో కలిసివుండే కేవల భుక్తత మాత్రమే వుంటుంది. ఆదిమ సమాజంలో పంపకం

వుత్పత్తిని వినియోగంతో ఐక్యంచేసే గొలుసు. ఆదిమసమాజసభ్యులు తాము సామూహిక శ్రమతో సాధించిన ఉత్పత్తి ఫలితాన్ని సమానభాగాలుగా విభజించిన తరువాత వినియోగిస్తారు. కనీస జీవనాధార స్థాయిలో కొనసాగటానికి మొత్తం సమాజ సామూహిక ఆలోచనతో కూడిన కృషి అవసరం కాబట్టి భాగాలు అవశ్యంగా సమానంగా వుంటాయి ఆదిమ సమాజంలో అదనపు వుత్పత్తి వుండదు.

మంచి పనిముట్ల వాడకంలో అదనపు వుత్పత్తి అభివృద్ధి సంభవిస్తుంది. ఇదే శ్రమ విభజనకు పునాదిని సిద్ధంచేసింది. సమాజంలోని విభిన్న బృందాలు విభిన్న శ్రమ రీతుల్లో నైపుణ్యం పొంది, వ్యక్తిగత వుత్పత్తిదారులకు పంపకంచేసే సామాన్యనిధికి తమ వుత్పత్తి ఫలితాలను ఇచ్చేవాళ్ళు. శ్రమ వుత్పాదకశక్తి అధికం కావటంతో, శ్రమ సామూహిక స్వభావం తగ్గిపోతుంది. ఇప్పుడు శ్రామికుడు తనకోసం అదనంగా వుత్పత్తిచేయగలడు శ్రామికుడు ఇంకా సమాజంకోసంచేసే అవసర శ్రమకూ తన కోసం చేసే అదనపు శ్రమకూ తేడాను చూపి తనఅదనపు వుత్పత్తిని తనఇష్టం వచ్చినట్టు వినియోగించే హక్కును గ్రహిస్తాడు ఈ మార్గంలో శ్రామికుని వుత్పత్తి ఫలితం సరుకుగా పరిణమిస్తుంది. వినియోగం కోసం వుత్పత్తిని మారకం కోసం వుత్పత్తి రద్దుచేస్తుంది.

ఈ అభివృద్ధులు గుణాత్మకంగా నూతన శ్రమ విభజన, మానసిక శ్రమ, శారీరక శ్రమ విభజన వుదయించటంలో వున్నతస్థితిని పొందాయి. సమాజంలో ఒక బృందం వుత్పత్తిని ఇంకా ముందుకు అభివృద్ధి చేయటానికి అవసరమైన సాంకేతిక, నిర్మాణ సంబంధమైన బాధ్యతలకు అంకితం కావటం కోసం శారీరక శ్రమనుంచి పూర్తిగా మినహాయించబడతారు. ఉత్పత్తి సాధనాల మీద తమ అధికారాన్ని ఆసరాగా తీసుకొని యీ నిర్వాహకులు క్రమంగా పాలకవర్గంగా స్థిరం అవుతారు.

ఆదిమ సమాజం ఉపయోగ విలువలను వుత్పత్తిచేయటం మీద ఆధారపడి వున్నట్టే, ఆదిమ సమాజ ఆలోచన నిర్దిష్టంగా, గుణాత్మకంగా, ఆత్మాశ్రియంగా వుండేది. అరూప ఆలోచనాశక్తి ఆటవిక మానవుడి నుంచి నాగరిక మానవుణ్ణి వేరు చేస్తుంది. ఈ అరూప ఆలోచనాశక్తి సరకుల వుత్పత్తి అభివృద్ధికి ప్రతిస్పందనగా అభివృద్ధిపొందింది. వినియోగించే వస్తువుగా సరకుకు వుపయోగ- విలువ వుంటుంది. మారకం చేసే ఒక వస్తువుగా సరకు మారకపు విలువ వుంటుంది. సరకును మారకం చేయటం కోసం వుత్పత్తిదారుల మనస్సులో సరకుకు వుండే నిర్దిష్ట, గుణాత్మక లక్షణాలను లేకుండాచేసి, స్వచ్ఛ పరిమాణాత్మక అరూపీకరణంగా పరిగణించేటట్టు

చేయాలి. ఉపయోగవిలువ, మారకవిలువల మధ్య ఈ వైరుధ్యాన్ని నిర్వహించటానికి మనుషులు నిత్యావసర వస్తువులను మార్కెట్టుకు తీసుకువెళ్ళినప్పటినుంచి, శ్రమానికి సంబంధించిన ఎలాంటి సైద్ధాంతిక అవగాహనా లేక పోయినప్పటికీ, విజయవంతంగా కొనసాగించే మానసిక వ్యాపారం అవశ్యం అవుతుంది. ఈ విధంగా సరకును మారకం చేసే సామాజిక ఆచరణనుంచి మనుషులు నిర్దిష్టానికి- అరూపానికి మధ్య, ప్రత్యేకానికి సామాన్యానికి మధ్య, ప్రత్యక్ష గోచర విషయాలకు- సారాంశాలకు మధ్య, ఆత్మాశ్రయానికి- పరాశ్రయానికి మధ్య తేడాలను చూసే శక్తిని సంపాదిస్తాడు. ఈ శక్తి శాస్త్రీయ ఆలోచన అభివృద్ధికి అవసరమైన పూర్వరంగం.

అదే సమయంలో మారకం అభివృద్ధితో ఉత్పత్తిదారుడు తన ఉత్పత్తి ఫలితం మీద అధికారాన్ని కోల్పోతాడు. అది ఏమవుతుందో ఇక అతనికి ఏమాత్రం తెలీదు. ఉత్పత్తికీ వినియోగానికీ మధ్యలంకె మార్కెట్టులో కన్పించకుండా పోతుంది. అతడు ఏ ప్రయోజనం కోసం ఉత్పత్తిచేస్తాడో ఆప్రయోజనం నిరంతరం ఫలితంలో ఖండించబడుతుంది. అందుచేత సరకులను ఉత్పత్తిచేసే సమాజానికి అనుగుణ్యమైన 'తప్పుడు చైతన్యం' ఉదయిస్తుంది. ఈ 'తప్పుడు చైతన్యం' కార్య కారణాలమధ్య సంబంధాన్ని తలకిందుచేసి తాత్విక భావవాదం, అధిభౌతక వాదం మొదలైన అశాస్త్రీయ ఆలోచనా రూపాలకు కారణం అవుతుంది. పదార్థాన్ని ప్రాథమికంగా మనస్సును ద్వితీయంగా పరిగణించవలసిన స్థానంలో భావవాది మనస్సు ప్రాథమికం, పదార్థం ద్వితీయం అని స్థిరంగా చెపుతాడు. అధిభౌతికవాది నిత్యమైన చలనాన్ని సాపేక్షమైనదిగానూ, సాపేక్షమైన విశ్రాంతిని నిత్యమైనదిగానూ చెపుతాడు. సత్యం తలకిందులుగా వివరించటం జరుగుతుంది.

మనిషి తన అవగాహనా అనుభవాన్ని నిర్మించుకునే రూపం శాస్త్రం. అనుభూతిని కలిగించే, అనుభవాన్ని నిర్మించుకునే రూపం కళ. 'అవగాహన' 'అనుభూతి' అనేపదాలు ఆలోచనకూ సంవేదనకూ మధ్య వ్యత్యాసాన్ని నిరూపిస్తాయి. ఆదిమ సమాజంలో శాస్త్రంవుండదు- కళవుండదు- 'మాయ' మాత్రం వుంటుంది. మనకు తెలిసిన శాస్త్రం, కళలకు సరకులఉత్పత్తి అభివృద్ధి, మానసిక శారీరక శ్రమల మధ్య వైరుధ్యం. సమాజం వర్గాలుగా విభజింపబడటం పూర్వరంగంగా వుంటాయి.

[జార్జితామ్సన్ రాసిన మానవసారం (దిహ్యూమన్ ఎసెన్స్) అనే పుస్తకంలోని మొదటి అధ్యాయానికి త్రిపురనేని మధుసూదనరావు అనువాదం.]

ఉపయుక్త గ్రంధాలు :

1. లెనిన్ 'కలెక్టడ్‌వర్క్స్' వాల్యూం 14, పేజి 130
2. ఎంగిల్స్ 'అంటీ డురింగ్' పేజి 70
3. ,, ,, పేజి 158
4. ,, ,, పేజి 15
5. ,, ,, పేజి 135-36
6. ,, ,, పేజి 28
7. లెనిన్ 'కలెక్టడ్ వర్క్స్' వాల్యూం 38 పేజి 359.
8. మావోసేటుంగ్ 'సెలెక్టడ్ వర్క్స్' వాల్యూం 1 పేజి 320
9. ఎంగిల్స్ 'అంటీ డురింగ్' పేజి 93.
10. ,, పేజి 95.
11. మార్క్స్ 'ఎకనిమిక్ అండ్ ఫిలసాఫికల్ మానుస్క్రిప్ట్స్'.
12. మార్క్స్ 'ఎకనిమిక్ అండ్ ఫిలసాఫికల్ మానుస్క్రిప్ట్స్'.
13. మార్క్స్ అండ్ ఎంగిల్స్ 'సెలెక్టడ్ వర్క్స్' వాల్యూం 3 పేజి 74.
14. ,, ,, వాల్యూం 1 పేజి 159
15. ,, ,, ,, పేజి 503
16. మార్క్స్ 'కాపిటల్' వాల్యూం 1. పేజి 177
17. ,, పే. 178.

మన దేశం బల సంపన్నం
మన దేశం యవ్వనవంతం
మనదేశ మహాగానాలు
ఇంకా మూగ నిద్రలోనే ఉన్నాయి.
వంచన నుంచీ, కేకల నుంచీ
హత్యల నుంచీ, చట్టవ్యతిరేక తీర్పుల నుంచీ
తుక్కు ప్రలాపాల నుంచీ, దేశభక్తి గోల నుంచీ
సందిగ్ధత నుంచీ, అనుమానం నుంచీ
పాట తిరిగి పుడుతుంది
మన యుద్ధ గీతి తిరిగి పుడుతుంది
ప్రజల రాగంలా సున్నితంగా
మన లోయల్లా లోతుగా
మన పర్వతాల్లా వున్నతంగా
పాట పూదిన ప్రజల్లా బలంగా
పాట తిరిగి పుడుతుంది
ప్రజా యుద్ధగీతి తిరిగి పుడుతుంది.

(అమెరికన్ల కోసం జానపద గానం)

నడుస్తున్న చరిత్ర పుటల్లోంచి....

జంషెడ్‌పూర్ - ఈ రహదారి ఎక్కడికి?

టిస్కో (TISCO) - :- బిహెచ్‌యిఎల్ (BHEL), జంషెడ్‌పూర్ - రాంచి, ప్రైవేట్ రంగంలో అత్యధిక లాభాలతో నడుస్తున్న ఉక్కు కర్మాగారం- ప్రభుత్వ రంగంలో ప్రపంచమంతా పేరు ప్రఖ్యాతలు పొందిన ఇంజనీరింగ్ పరికరాల సంస్థ- 32 సంవత్సరాల 'స్వతంత్ర' భారత పారిశ్రామిక అభివృద్ధికి ప్రతీకలు జంషెడ్‌పూర్ - రాంచి.

జంషెడ్‌పూర్‌లో రాంచి రహదారి మీద ఉంది ఒక ముస్లిమ్ ప్రాంతం ఆజాద్ నగర్ (ఎవరి నుండి ఈ స్వేచ్ఛ?). అక్కడ మాంగోలో మసీదు ప్రాంతంలో ఏప్రిల్ 11న మొదటిరాయి గాలిలోకి లేచింది. మూడు రోజులపాటు హిందూ మతోన్మాదులకు, ముస్లిమ్ ప్రజలకి, బీహార్ మిలటరీ పోలీసులకి ముస్లిమ్ ప్రజలకి ఏకపక్ష యుద్ధం. మన ఆజాదీ వయస్సు 32 సంవత్సరాలు, నగరం వయస్సు 75 సంవత్సరాలు, మతం వయస్సు మూడువేల మౌఢ్య సంవత్సరాలు, యుద్ధాల వయస్సు?

మరోసారి ఈ నగరాన్ని ఎముకలగూడుగా మార్చిన ఈ మత కలహాలు ఎలా మొదలయ్యాయి? మార్చి 30న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్వసంచాలక్ గురూజీ బాలాసాహెబ్ దేవరస్ ఉపన్యాసం, "మన మతానికి విజయం! నమ్మనివారిని నాశనం చెయ్యండి"- శ్రీరామనవమి అఖరా సమితి కరపత్రం, ఊరేగింపుకి అనుమతి ఇవ్వాలా లేదా అని రాజకీయ నాయకుల ఒత్తిడిల మధ్య పోలీసు అధికార్ల కోరికలు, గాంధీ మైదానంలో కథకుడు జాకీ అన్వర్, ప్రొఫెసర్ గిరీష్‌ప్రసాద్ శాంతి కోసం నిరాహారదీక్ష, వ్యర్థంగా, బలహీనంగా, ఏప్రిల్ 11న మసీదు దగ్గర ఊరేగింపుని ఆపి జనసంఘ్-జనతాశాసన సభ్యుడు దీనానాథ పాండే ఉపన్యాసం. ఇలా రక్తమాంసాలు లేకుండా మరోసారి కూలిపోయింది ఈ ఉక్కునగరం.

1904లో అది కేవలం బిష్టుపూర్. ఖిరాకామ్, సువర్ణరేఖ నదులు కలిసి ప్రవహించే ప్రాంతం. పెద్ద పరిశ్రమలతో అప్పుడే చిగిరిస్తున్న భారత ధనస్వామ్య పితామహుడు జంషెడ్జీ టాటా కలల ఫలితం జంషెడ్‌పూర్ వెలిసింది. 1908కి ఉక్కు కర్మాగారంలో మొదటి యంత్రం కదిలింది. ఇవ్వాళ ప్రపంచ పరిశ్రమలలో 12వ స్థానం ఆక్రమిస్తున్న భారతదేశపు పారిశ్రామికులకు ముందు దారి జంషెడ్‌పూర్. 1935- ఇండియన్ ఆక్సిజన్ లిమిటెడ్, 1945- టిస్కో, 1953- ఇండియన్‌టూల్స్ 1904లో జనాభా ఐదువేలు. ఇప్పుడు ఏడులక్షలు.

1964. అప్పటి మత కలహాల్లో శవాల్ని, శ్మశానాల్ని వదలి వందలాది ముస్లిమ్‌లు పాకిస్తాన్‌కి తరలి వెళ్ళిపోయారు. (వాళ్ళయినా సుఖపడ్డారా?) మత ఊరేగింపులు. ఉన్మాద నినాదాలు, రాష్ట్రీయస్వయం సేవక్ సంఘ్, జమాయిత్-ఏ-ఇస్లామ్, కాల్పులు, దహనాలు, శవాలు శరణార్థి శిబిరాలు, అపేకారణాలు, అపేదృశ్యాలు.

1964 - 1970 ఆరుసంవత్సరాలు. జంషెడ్‌పూర్ 64, 79 మాత్రమే కాదు, 73 - 70 కూడా. అప్పుడిది మరో కలకత్తా గాంధీపీస్ ఫౌండేషన్ భవనంపైదాడి, పన్నెండు అడుగుల జంషెడ్జీటాటా విగ్రహధ్వంసం, టిస్కోహయ్యర్ సెంకడరీ స్కూలు విద్యార్థుల తిరుగుబాటు, సబ్‌జైలు కప్పుమీద కూచుని 13రోజులపాటు నక్సలైటుఖైదీల నిరాహారదీక్ష, హైస్కూల్ విద్యార్థులపై, టీచర్లపై పోలీసులు పాశవికదాడి, నిరసనగా నగరమంతా బంద్, ఒక్కరాత్రిలో 200 మంది విద్యార్థులు కుట్రకేసుఖైదీలయ్యారు. (అప్పటి ముఖ్యమంత్రి శ్రీకర్పూరీఠాకూర్!) నగరం గోడలపై తేరానామ్, మేరానామ్ వియత్నామ్, సబ్‌కాబరీ నక్సల్‌బరీ, అప్నాబరీ నక్సల్‌బరీ. అది 70 - 73

1973 - 79, మరో ఆరు సంవత్సరాలు (వెనక్కా? ముందుకా?) కసిధిలో అంబులెన్స్ వాన్‌నాపి పెట్రోల్ వెలిగించిన మంటలు, 20మంది పిల్లల, స్త్రీల, శరీరాల సగం కాలిన అవయవాలు, సబ్జీ మార్కెట్ బూడిదయిన కూరగాయలు, దుకాణాలు, మనుషులు, క్రైమ్‌కాలనీ నేలరాలిన భవనాలు, చితికిపోయిన కుటుంబాలు.

మాఫియా, ఎప్పుడో 47లో తూర్పు బెంగాల్ నుండి "శరణార్థులు"గా వచ్చిన వ్యాపార కుటుంబాలు, మారణాయుధాల గృహపరిశ్రమలు, సారావ్యాపారి దుకు ఖాతిక్, మార్వాడి బిశ్వనాథ్, జనతాపార్టీ నాయకుడు చౌధేసింగ్, నేరప్రపంచ చక్రవర్తి ధూరేంద్రసింగ్, అప్పట్లో వారిని కాంగ్రెస్‌పార్టీ రక్షించింది. ఇప్పుడు జనతాపార్టీ సంరక్షిస్తోంది. ఈ వ్యాపారంలో హిందూ ముస్లిమ్ విబేధాలు లేవు, మారణాయుధాలకి మతంలేదు.

బీహార్ మిలటరీ పోలీస్, ఉత్తరప్రదేశ్ పి ఎ సి కి సహోదరులు. పుట్టుకతో ముస్లిమ్‌లయిని నేరానికి ప్రజల్ని పిట్టల్లా కాల్చేవాళ్ళు, విరూపారోడ్‌లో హిందువుల ఇంట్లో ఆశ్రయం తీసుకుంటున్న పద్దెనిమిది మందిని తుపాకీ మడమలతో కొట్టేవాళ్ళు, అగ్రికోలో ఇద్దరు బాలికలను సజీవదహనం చేసినవాళ్ళు, ఇంటి వరండాలో నిలుచున్న మహమ్మద్ అన్సారీ, ఉస్మాన్ ఖాన్‌లను గుండెమీద తుపాకీపెట్టి చంపినవాళ్ళు, టిన్‌ప్లేట్ ఫాక్టరీలో బరాకత్, నిజాంలను కాల్చినవాళ్ళు, బీహార్ మిలటరీ పోలీసుల తుపాకులు "మతాతీత" రాజ్యానివి. అవి ధరించే పోలీసులు మాత్రం మతాతీతులుకారు.

నగరంలో 10 శరణార్థి శిబిరాలు, వాటిలో భయం భయంగా బతికే 40 వేల మంది ముస్లిమ్‌లు, చాలా శిబిరాలకు కప్పు కూడా లేదు. ఏప్రిల్ 11న శిబిరాలలోకి వచ్చిన వాళ్ళకి ఏప్రిల్ 15దాక భోజనం సరఫరా కూడాలేదు. మతం మౌఢ్యం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోగలిగితే ఆకలితో చావండి. కిక్కిరిసిన శిబిరాలలో (500 మందికి సరిపడే కరిమియాసిటీ కాలేజీ శిబిరంలో మూడువేల మంది!) నెత్తురుబంక విరేచనాలు, మశూచికం, న్యూమోనియా వ్యాధులు. అయితే దొరికినా దొరక్కపోయినా ఈ వ్యాధులకు కనీసం మందుఉంది. మతోన్మాద వ్యాధినోకితే....

నగరం మంటల్లో బూడిదవుతున్నా టిస్కోలో యంత్రాలు ఆగలేదు. నాలుగు రోజుల కర్ఫ్యూలో కూడా ఉత్పత్తికి దెబ్బలేదు. లక్షల రూపాయలతో టిస్కో శిబిరాలను నిర్వహిస్తోందని టాటా సగర్వంగా ప్రకటించాడు. ఛోటా నాగపూర్ దారిద్ర్యం తరిమి తరిమి టిస్కో కార్మికులను తయారుచేసింది. అయినా వాళ్ళ గ్రామీణ భారత మతం గతంలో సాంస్కృతిక సంబంధాలను తెంచుకోలేకపోయిన వాళ్ళు. అప్పుడప్పుడు చుట్టుముట్టే ఈ మంటల నుండి టిస్కో వాళ్ళను రక్షింపలేకపోయింది. అది కేవలం బతికి మిగిలిన జీవచ్ఛవాలకు సదుపాయాలు లేని శిబిరాలను మాత్రం నిర్వహించగలదు. గర్వపడటానికి 70 ఏళ్ళ కర్మాగారం ఏంచేయగల్గిందని.

పార్లమెంటులో రెండు గంటల పాటు జరిగిన చర్చ కోరంలేకుండా మొదలవుతుంది. ఆర్.ఎస్.ఎస్‌ను కాంగ్రెస్ వాళ్ళు, కాంగ్రెస్ వాళ్ళని ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు జనతాని సి.పి.ఐ. వాళ్ళు, సి.పి.ఐ.ని జనతా వాళ్ళు, 120 శవాల మీద నిలబడి, మరోసారి పాత ఆరోపణలని చిమ్ముకుంటారు. ధన్‌బాద్ గనికార్మిక నాయకుడు ఎ.కె.రాయ్ వర్ణించినట్టు "ప్రజలు పిట్టల్లా చచ్చిపోతుంటే సంతాపం ప్రకటించే స్థలం ఈ పార్లమెంటు. ప్రతిసారీ అవే ఆరోపణలను పరస్పరం విసురుకునే బజారు."

అంతా జరిగి పోయిన తర్వాత మొక్కుబడి న్యాయవిచారణ. గత ముప్పై సంవత్సరాలలో మత కలహాలపై విచారణ చేసిన ఏసంఘం నివేదికను ప్రభుత్వం ప్రచురించింది? ఏ జడ్జి తీర్పును ప్రభుత్వం గౌరవించింది? అయినా మత సామరస్యం కోసం నిరాహారదీక్ష చేస్తూనే "నేను హిందువుని" అని ప్రకటించుకున్న మహాత్మ గాంధీకి అధి భౌతిక వారసులు బెదిరిస్తే గోవధను నిషేధించే దేశంలో మొక్కుబడి లేకుండా జీవితం గడవదు. కలహాలకి ముస్లిమ్‌లే కారణమని హోం మంత్రి పటేల్ ప్రకటిస్తాడు. ఆయన ఆ గాంధీకి రాజకీయ వారసుడు. ఇక ఈ మొక్కుబడి విచారణ ఏ నిజాన్ని విచారిస్తుంది? ఎవరి కోసం విచారిస్తుంది?

విద్యార్థుల విప్లవ కాల్పనిక స్వప్నాలకి "ఆచరణ పాఠాలు" నేర్పిన పరో కలకత్తా నగరంలో మళ్ళీకర్పూరి ఠాకూర్ మంత్రి వర్గం పోలీసు రాజ్యం చేస్తుంది. ఈ సారి బాధితులు ముస్లిమ్‌లు. ఇవ్వాళ బహుశ ఎవ్వరూ గోడల మీద రాయడం లేదు. జంషెడ్జీ టాటా పన్నెండు అడుగుల విగ్రహం కర్ఫ్యూలో ఫాక్టరీ నడిచిందని ఆనందిస్తూవుంటుంది. టిస్కో హయ్యర్ సెకండరీ స్కూల్ శరణార్థి శిబిరంగా మారుతుంది. సబ్ జైల్లో మారణాయుధ మాఫియా వ్యాపారులు ప్రవేశించనైనా ప్రవేశించరు. సమాజపు 'శాంతి భద్రతల' చర్మం కింద తెగిపోయే నరాల నగరం చరిత్ర వేధించే తన ప్రశ్నలకు సమాధానం కోసం మళ్ళీ ఎదురు చూస్తుంది. ఎందుకు?

ఎందుకు? ఈ అరణ్య జ్వాలలు ఎందుకు రగిలాయి? పారిశ్రామిక అభివృద్ధి మత మౌఢ్యాన్ని ఛేదిస్తుందని మనం నేర్చుకున్న చరిత్ర పాఠాలు ఈ దేశంలో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి? దేశంలో మొట్ట మొదటి నగరాలలో ఒకటయిన జంషెడ్‌పూర్‌లో "నాగరికత" తన ప్రభావం ఎందుకు చూపలేకపోయింది? టిస్కో, బి.హెచ్.యి.ఎల్.ల మధ్య భవిష్యత్తులోకి వేసుకున్న దారి గతంలోకి ఎందుకు జారి పోయింది? పరిశ్రమలు ప్రజల్ని కార్మికీకరణ ఎందుకు చేయలేకపోయాయి? వామ పక్ష ఉద్యమాలు (గత నెలలోనే సిపిఐ, సిపియమ్, సిపిఐయంయల్ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది) గ్రామ ఫ్యూడల్ సంస్కృతి వేళ్ళని ఎందుకు నాశనం చేయలేకపోయాయి? ఈ అరణ్య జ్వాలలు ఎందుకు రగిలాయి?.... బహుశ ఈ ప్రశ్నలకి మాత్రం తక్షణ సమాధానాలు లేవు.

ఇవ్వాళ నెమ్మదిగా నగరం ఊపిరి పోసుకుంటోంది. కరిగిన ఉక్కులావాలు గడ్డకట్టి నగరానికి రూపాన్నిస్తున్నాయి. శరణార్థులు శిబిరాలను వదిలి ఇళ్ళకు చేరుకుంటున్నారు, జంషెడ్‌పూర్ రాంచీ రహదారిమీద కాలనీలో మళ్ళీ జనసంచారం. ఈసారి ఈ రహదారి ఎక్కడికి ?

(సురా - వేణు)

నిజానికి జంషెడ్‌పూర్ హత్యల గురించి ప్రత్యేకించి ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. జాతీయ అల్ప సంఖ్యాక వర్గాలకు (మైనారిటీలకు) వ్యతిరేకంగా గత ప్రస్తుత ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యవస్థీకృత దాడిలో భాగమే ఇది. జనతాపార్టీ ఉభయ కాంగ్రెస్ పార్టీలు కూడ హిందూ మతోన్మాదం రెచ్చగొడుతున్న అత్యంత అభివృద్ధి నిరోధకమైన విచక్షణలేని సంపూర్ణ గోవధ నిషేధాన్ని (వయస్సు, ఆరోగ్యాలతో కూడ సంబంధం లేకుండా) బలపరుస్తూ తమ అవకాశవాదాన్నే బయట పెట్టుకుంటున్నాయి. — (ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 14-4-79)

జడ సమాజానికి చలం షాక్ ట్రీట్‌మెంట్

"కృష్ణ శాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అన్నారు చలం, శ్రీశ్రీ మహాప్రస్థానానికి ఇచ్చిన యోగ్యతా పత్రంలో, బహుశా శ్రీశ్రీకి ఇంతకంటె ఘనమైన కితాబు మరొకటి ఉండదేమో.

ఇద్దరి స్వభావాలలో కొన్ని పోలికలూ ఉన్నాయి, కొన్ని వైరుధ్యాలూ ఉన్నాయి. శ్రీశ్రీ ప్రజల మధ్య, ప్రజల మనిషిగా వుంటూ, ప్రజాకవిగా పరిగణింపబడుతూ ప్రజలను ప్రభావితులను చేసినవాడు. చలం సమాజంలో వున్న రోజుల్లో కూడా ప్రజలకు దూరంగానే ఉన్నాడు. అయినా తన రచనలతో ప్రజలను ప్రభావితులను చేశాడు. శ్రీశ్రీలాగానే ఆయన కూడా ప్రజల బాధలన్నింటినీ తన బాధలు చేసుకున్నాడు. గాథలు వేరైనా ఇద్దరి బాధలొక్కటే.

కాకతీయ విశ్వ విద్యాలయంలో ఒక సమావేశంలో పాల్గొనడానికి వరంగల్ వచ్చిన శ్రీశ్రీతో 'ఆంధ్రప్రభ' ప్రతినిధి జరిపిన ఇంటర్వ్యూ ఇది. ఒకనాడు తనకు యోగ్యతా పత్రం ఇచ్చిన చలంగారికి శ్రీశ్రీ అర్పించిన నివాళి ఇది.

చలం గురించి శ్రీ శ్రీ

ప్ర: చలం గారిని మీరెంతకాలంగా ఎరుగుదురు?

జ: దాదాపు 30 ఏళ్లగా నేను ఆయన్ని ఎరుగుదును. మేమిద్దరం మొట్ట మొదట కలుసుకున్నది విశాఖపట్నంలో. ఆయన అప్పుడు డ్యూటీమీద వచ్చారక్కడికి. అప్పట్లో ఆయన స్కూళ్ల ఇన్‌స్పెక్టరుగా ఉండేవారనుకుంటా. తేదీ సరిగ్గా గుర్తులేదు.

ప్ర: చలంగారిని మీరు ఎన్నిసార్లు కలుసుకున్నారు? ఆ అనుభవాలనుంచి ఆసక్తికరమైన విశేషాలు ఏమైన చెప్పగలరా?

జ: దాదాపు అరడజను సార్లు ఆయన్ని కలుసుకొని ఉంటాను. నలుగురితోనూ కూర్చొని మాట్లాడాలని చలంగారు మహా ఉబలాట పడేవారు. ఎవరన్నా కథలు చెబితే ఆయన శ్రద్ధగా వినేవారు.

ఓసారి ఆయన కొంత మంది కుర్రాళ్లని దగ్గర కూర్చోపెట్టుకుని, సెక్సు కథల మీద మీ అభిప్రాయ మేమిటని సూటిగా అడిగేశారు. నోరు విప్పడానికి ఒక్కరికి కూడా

ధైర్యం లేకపోయింది. అంత పెద్ద మనిషి ఎదుట మరీ అంత చొరవ తీసుకోకూడదనుకున్నారేమో.

ప్ర: మీతో సహా చలం పుస్తకాలు చదివిన వారంతా లెఫ్టిస్టులుగా మారారని ఒక అభిప్రాయముంది. ఏకీభవిస్తారా?

జ, కావచ్చు కాని నేనొక్కణ్ణే కాదు. కొందరు రచయిత్రులు కూడా ఉన్నారు ఉదాహరణకు రంగనాయకమ్మగారు.

ప్ర: చలంగారి రచనలు సామాజిక సమస్యలపై మార్క్సిస్టు సిద్ధాంతాలకు దగ్గరగా ఉంటాయని మీరు భావిస్తున్నారా?

జ: నేనలా అనుకోవడం లేదు. చలం తన రచనల్లో వ్యక్తిగత సమస్యల్ని, సామాజిక సమస్యల్ని మాత్రమే ప్రతిబింబించాడు. తన రచనల ద్వారా సామాజిక దురాచారాన్ని ఎత్తి చూపడం వరకే చేశాడు. అంతే తప్ప తన రచనల ద్వారా ఏ సమస్యకీ పరిష్కారం చూపించలేదు. కొంత వరకు గురజాడ కలం మార్క్సిస్టు ఆలోచనా విధానానికి దగ్గరగా ప్రయాణించిందని చెప్పవచ్చు.

ప్ర: చలం నవలల్లో కథానాయికలు సుఖమయ జీవితం కోసం ఇళ్లు వదిలిపెట్టి వచ్చేస్తారు. అలావచ్చిన వారి కథలన్నీ విషాదాంతాలయ్యాయి. 'మైదానం' లో రాజేశ్వరి పాత్ర యిటువంటిదే. చలంగారు తన కథా నాయికలకు అంతకంటే మంచి దారి చూపించలేక పోయారని మీరెందుకు అనుకోరు?

జ: మన సామాజిక వ్యవస్థ ప్రజల జీవితాలతో ఎలా చెలగాట మాడుతుందో ప్రజలకు తెలియ జెప్పటానికి అదొక్కటే మార్గం.

ప్ర: చలంగారు వివాదగ్రస్తమైన వ్యక్తిగా మీరు పరిగణిస్తారా?

జ: సాహిత్య వ్యాసంగంలో తీవ్రమైన, కఠినమైన ప్రయోగాలు చేసిన రచయిత చలం. ఆయన ఒక చోటు నుంచి బయల్దేరాడు. కొంత దూరం ప్రయాణం చేశారు. ఆ తర్వాత తాను ఎటుపోతున్నదీ అంతుపట్టక, చివరికి రమణమహర్షి ఆశ్రమంలో తేలాడు. అది కూడా అసాధారణమే మరి.

నేను ఆయన ఆశ్రమం చిరునామాకి ఉత్తరాలు రాసేవాణ్ణి, 'చలం మహర్షికి' అని సంబోధిస్తూ. 'ఈశ్వర ఆశీస్సు'లతో అని ఆయన సమాధానం రాసేవారు.

ప్ర: చలంగారి నవలల ధోరణి ఎటువంటిదో మీరు కచ్చితంగా చెప్పగలరా?

జ: చలం తన రచనల్లో స్వేచ్ఛాజీవిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కృత్రిమ నాగరికత పొరల్ని ఛేదించుకొని అతి స్వాభావికంగా అత్యంత సహజంగా పశు పక్ష్యాదుల్లా విహరించాలని ఆయన సిద్ధాంతం. వ్యక్తి స్వేచ్ఛ విషయంలోనూ, స్త్రీల విషయంలోనూ, ఆఖరికి బిడ్డల పెంపకంలో కూడా ఆయన ఇదే చెప్పాడు. గాంధీ కూడా ఇంచుమించు అలాగే చెప్పారు. మీ బట్టలు మీరే రాట్నం వడికి నేసుకోమని ఆయన ప్రజలకు ఉపదేశించాడు. 1940 లో తనమహా ప్రస్థానానికి చలం యోగ్యతా పత్రం ఇచ్చారని శ్రీశ్రీ చెప్పారు.

"చలం దగ్గరికి వెళ్ళి ఆ యోగ్యతా పత్రం రాయించుకు వచ్చింది మా జరుక్ శాస్త్రి. ఆయన నాకు జీతం బత్తెం లేని పబ్లిసిటీ మేనేజర్ లెండి." అన్నారు శ్రీశ్రీ నవ్వుతూ.

ఆ రోజుల్లో సమాజానికి ఇవ్వవలసిన 'షాక్ ట్రీట్'మెంటు' చలం రచనలు ఇచ్చాయని శ్రీశ్రీ అన్నారు.

కొంత మంది చలం రచనల్ని ఇష్టం వచ్చినట్టు విమర్శించడం పట్ల శ్రీశ్రీ విచారం వ్యక్తం చేశారు. "ముఖ్యంగా చలం రచనల్లో స్త్రీ పాత్రల్ని విమర్శి స్తుంటారు; అర్థం పర్థం లేకుండా"

"ఇప్పుడు ఎన్నో దేశాల్లో ప్రారంభమైన మహిళా విమోచనోద్యమం మాటేమిటి ఆనాడు చలం కోరుకున్నదే ఇప్పుడు జరుగుతోంది" అన్నారు శ్రీశ్రీ.

చలం ఒక గొప్ప సాహితీ కళావేత్త అనీ, ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయనకు తప్పకుండా స్థానం ఉందని శ్రీశ్రీ కొనియాడారు.

"తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన దానికి మా అందరి ఆరాధనలు పొందిన రచయిత చలం. అందుకే నాకు ఆయన ఆరాధ్యుడు" అన్నారు శ్రీ శ్రీ.

('ఆంధ్రప్రభ దినపత్రిక 7.5.79 సౌజన్యంతో)

ఒంటరివాడుగా జీవించిన చలం

కొడవటిగంటి కుటుంబరావు

కళాకారులు ఒకంతట మరణించరు, అందులోనూ రచయిత తన రచనలు బతి కున్నంత కాలమూ బతికుంటాడు. చలం తన రచనా జీవితాన్ని కొంతకాలంగా సంక్షే పించుకున్న కారణంచేత, ఆయన భౌతిక మరణానికి ప్రత్యేకమైన విలువ ఏమీలేదు, ఆయన మృతికి ఇవాళ సంతాపం వెలిబుచ్చే వారందరూ భౌతికంగా ఆయనకు చాలా దూరంగా వుంటున్న వాళ్ళే.

చలం రచనలు బతికున్నాయి. చలంతోపాటే, చలాన్ని చూసి, రచనలు ప్రారంభించినవారి రచనలు ఏనాడో కాలగర్భంలో కలసిపోయాయి. కాని చలం రచనలు ఒకటికి రెండుసార్లు సమగ్రంగా ప్రచురింప బడటమేగాక పాఠకులు వాటిని చదువుతున్నారు.

ఆ రచనలను ఆకాశానికి ఎత్తినవారున్నారు: చలం సాహిత్యాన్ని "శ్మశానసాహిత్యం" అన్నవారున్నారు. రెండు అభిప్రాయాలకూ ఆధారాలు చలం రచనల్లో వున్నాయనుకోవాలి.

ఆ రచనల్లో జీవితంమీద రోతపుట్టి ఏకాంతవాసం చేసేవాడి లక్షణాలు కొన్ని ఉన్నాయి. అవి సమాజం మీద శాపాలు. అందులో దీవనలు లేవు తన వ్యక్తిగత సంస్కృతిని అవమానించిన మేరకు చలం సమాజాన్ని దుమ్మెత్తిపోశాడు. సమాజంలోని కుసంస్కారానికి కూడా ఏవో భౌతికా ధారాలుంటాయన్నది చలం పట్టించుకోలేదు. "ఏంచేస్తే ఈ సమాజం నాకు నచ్చుతుంది?" అని ఆయన తనను తాను ప్రశ్నించుకోలేదు. సమాజం బురదలో పొర్లివచ్చిన గొడ్డుఅని, తాను దగ్గరికి పోతే తన మీద బురద విసురుతుందనీ భయపడ్డాడు, చలం లాంటి సంస్కారం గల వారందరికీ చలం సమాజానికి పెట్టిన శాపనార్థాలు బ్రహ్మాండమైన సంతృప్తి నిచ్చాయి.

మారని సంఘం

సమాజాన్ని నిజంగా సంస్కరించే ఉద్దేశం చలానికి లేకపోయినా ఆయనది ఆ కాలపు సంస్కర్తల బాణీయే: సంస్కర్తల ప్రచారాలలోఉండే లోపాలు చలం రచనలలోనూ వున్నాయి. ఆయనచేత తిట్లుతిన్న సామాజిక మాయరోగాలన్నీ సుఖంగా ఉన్నాయి. కొన్ని చిలవలూ పలవలూకూడా వేశాయి.

ఇంకోదృష్టి నుంచి కూడా చలం రచనలు, చాలా ఉదాత్తంగా ఉన్నట్టుకనిపిస్తాయి. ఈనాడు రాజకీయ నాయకులను సైతం తమ వ్యూహంలోకి దింపేసిన సినిమా సంస్కృతితో పోల్చితే చలం రచనలలోని సంస్కృతి ఆకాశం ఎత్తు. ఇంకో పక్కగాంధీభక్తులు ప్రచారంచేసే నీతి నియమాలతో పోల్చితే చలం రచనలలో కనిపించే విశృంఖలత చాలా ఆరోగ్యమైన దనిపిస్తుంది.

సినిమా సంస్కృతికి చలం రచనలలోని సంస్కృతికి ఏదన్నా పోలిక చూపాలంటే అది సెక్స్ విషయంలోనే. కాని చలం రచనలలోని సెక్స్ సినిమాలో దానికన్న ఉదాత్తం అనిపిస్తుంది జంతువుల మైథునంలాటిది సినిమాలలోఉంది కాని చలంరచనల్లో లేదు. అచ్చంగా సెక్స్‌కోసమే బతికినట్టు కనపడే జంటకూడా 'మైదానం'లో మనుషులకు

దూరంగా చేరిందిగాని, ప్రఖ్యాత తమిళ దర్శకుడు సేతుమాధవన్ తీసిన 'కన్యాకుమారి' లో ఒకడు ఒక ఆడదాన్ని ఇంకో మగవాడు చూస్తుండగానే "రేప్" చెయ్యటానికై యత్నించడం లాంటి అసభ్యత చలం రచనల్లో లేదు. చలం పాత్రలు "రేప్" చెయ్యవు జంతువులు కూడా చెయ్యవు- కాని చెయ్యటానికి ప్రయత్నిస్తాయి. మనకు నచ్చినా, నచ్చకపోయినా చలం తన రచనల్లో సమర్థించే పాత్రలు జంతువులుమటుకు కావు.

కవితా హృదయం

వ్యక్తిగా చలం కవి. కవిత్వం కోసం బతికినంతగా కవిత్వాన్ని ప్రేమించాడు. కవిత్వం చలం కంట నీరు తెప్పించడం నేనెరుగుదును. ఇతర మనుషుల్లో ఉండే దౌర్బల్యాలు చలంలో ఉండి ఉండవచ్చు కాని అనేక విషయాలలో ఆయన విశిష్టవ్యక్తి ఆయన కీర్తికోసం తానై పాటుపడలేదు. ఏ సాహిత్య ఉద్యమంలోనూ చేరలేదు. సాహితీసమితిని "మ్యూచువల్ అడ్మిరేషన్ సొసైటీ" అన్నాడు! కాని కీర్తి తనను వెతుక్కుంటూ వస్తే దాన్ని పరీక్షించకుండా కావలించుకున్నాడు. అప్పుడప్పుడు కనువిప్పూ కలిగేది.

"నన్ను మెచ్చుకొనే వాళ్లంతా నా రచనలు అర్థంచేసుకున్నారని భ్రమపడ్డాను!" అన్నాడాయన ఒకసారి.

ఒంటరితనం, బహుకొద్దిమంది స్నేహితులు, బంధువులతోనైనా గాఢమైన సంబంధాలు లేవు. ఒంటరితనం ఆయన చుట్టూఉన్న వారికి కూడా సోకిందేమో నను కుంటాను, అదే ఆయనను రమణాశ్రమం చేర్చింది. చివరకు ఒంటరితనం పరా కాష్ఠకువచ్చి, ఆయన రజనితో ఇంటర్వ్యూలో, "ఈ చలం నన్ను వదలకుండా ఉన్నాడు!" అని విసుక్కున్నాడు.

చలం ఎంత ఒంటరివాడో, చలం రచనలు అంతగా జనాదరం పొందాయి! చిత్రం.

(13-5-79 "ఆంధ్రజ్యోతి" దినపత్రిక సౌజన్యంతో)

చలం భావజాలం

కె.వి. రమణారెడ్డి

"యవ్వనవ్యసనం" అనేది చలం చెలామణీ చేసిన ఒకమాట- ఇంగ్లీషులో (Adoloscence). ఇది వయస్సుకే గాక మనస్థితికి గూడా వర్తించేది. నూనూగు మీసాలు, ఆశా ఆకాశ పుష్పాలు, అసాధ్య ఆదర్శాలు, వెర్రిమోజులు, ఆశనిరాశల

పుణ్యాలతోపులు, ఇలాంటి వెన్నో యీ దశకు సూచనలు. మొత్తానికి, మనస్సును చిలికి 'సహజాతాలను' (Instincts) అట్టడుగు నుంచి పైకీ బయటికీ తోసే పరిస్థితి ప్రతి మనిషి అనుభవంలోనిదే. అయితే దీన్ని దాటుకుని అనేకులు యవ్వనానికీ పరిణతికీ చేరుకుంటారు. నూటికి ఒకరో ఇద్దరో అక్కడే ఆగి, దాన్నే శాశ్వతం చేసుకుంటారు. చలం అలాంటి వ్యక్తి.

'మహానుభావుడు' అని చలం గురించి రా.రా. సారాంశంగా తేల్చారు గాని మహానుభావుడో వివిధానుభవుడో (వ్యాకరణం ఒప్పినా దెప్పినా) అనవచ్చు. అనుభవాలెన్నో చలం బాల్యదశవి అనుభూతులుగా మారి- అంటే, ఆ లేత మనస్సుకు పట్టిపోయి- రచనలలో రూపం దాల్చాయి. 'ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల'కు తాను రాసి పంపాలనుకున్న తొలి రచన స్వానుభవంలో అక్రమమనిపించిన ఒక బాల్యానుభవం మాత్రమే. చలం కథలూ యిలాంటి స్వానుభవ శకలాలో లేక, అనుభవం తొడిమపట్టు వీడని వూహలో! నాటకాలలోనే తన ఆదర్శాలూ సిద్ధాంతాలూ బలంగా వున్నట్టు చలం స్వయంగా రాయడం అందుకే.

కాల్పనికవాద యుగంలో పుట్టి పెరిగిన చలం సమకాలిక సామాజిక వాస్తవంతో తీవ్రంగా స్పర్ధించడం ఆశ్చర్యకరంకాదు. కాల్పనిక చిత్తవృత్తి ఎలాంటిదో కృష్ణశాస్త్రి ఒక వ్యాసంలో కళ్లకు కట్టించారు. ఉన్నదేదీ ఉండగూడనిది. లేనిదే ఉండవలసినది. ఆ అందని దానికోసం తపన. ఉన్నదాన్ని ఉన్నట్టుగానే కొనసాగించదలచిన వారితో ఘర్షణ, ఈ మథనం నుంచిస్వానుభవ దాహంలో వుప్పొంగి, విపరీత ప్రవృత్తితో ఒక్కొకప్పుడు వున్మత్త మనిపించేంతగా కూడా రచననీ బతుకునీ పెడగా తిప్పుకునే పట్టుదల, వీటన్నిటికితోడు లోకాన్ని అద్భుతపూర్ణమైనదన్నట్టుగా చూడాలనే సంకల్పం యిలాంటి లక్షణాలు మరెన్నో.

'స్వ'తోనే కొత్త సామాజిక వ్యవస్థ పురుడు పోసుకుంటున్నప్పుడు అంతవరకూ అలిఖిత చండశాసనాలుగా అమలు జరుగుతూన్న 'నీతినియమాల'కు చావుదెబ్బే. సామాజిక నీతి మతాన్ని ఆశ్రయించి అతిక్రమించ వీల్లేనిదని, పాపపుణ్యాలతో స్వర్గ నరకాలతో చిక్కుముడిబడి వున్నప్పుడు, మత వ్యవస్థమీద తిరుగుబాటు. విగ్రహారాధన, కులాల హెచ్చుతగ్గులు, ఆచార సంప్రదాయాలు. యివన్నీ సవాలందుకోక తప్పదు. బ్రహ్మ సమాజం బెంగాలునుంచి తెలుగుదేశానికి దిగిరాకముందే, హైందవంతో ఉపనిషత్తుల రూపేణా రాజీపడి, అభినవ హైందవ రూపం ధరించింది. కాకుంటే, పండిత శివనాథశాస్త్రి వంటి కొందరు 'సాధారణ బ్రహ్మసమాజం' స్థాపించగా ఇతరులు ఆతర్వాత అనుష్ఠానానికి ప్రాముఖ్యం యిచ్చారు. పూజారితో

నిమిత్తంలేని దైవతారాధనం, భక్తుడికీ దేవుడికీ మధ్యవర్తి అవసరాన్ని తోసిపేసింది. వ్యక్తి 'ఆత్మస్వాతంత్ర్యం' యూరపులోనైతే 'బూర్జువా' సామాజిక వ్యవస్థ ఆర్థిక ఆవిష్కారానికి ప్రాణమూలాన్ని సమకూర్చింది. ఇక్కడ మాత్రం ఈ వ్యవస్థ భూస్వామ్యం గర్భచెరనుంచి నేటికీ పూర్తిగా బయటపడలేదు. కాకుంటే, బ్రహ్మ సమాజం మంత్రాలను ఒప్పదు. క్రైస్తవ ప్రభావం మూలాన సామూహిక ప్రార్థనలూ కీర్తనలూ వచ్చిచేరాయి. అనుష్ఠానికుడు యజ్ఞోపవీతం, అపర కర్మకాండ వగైరా వదిలెయ్యాలి. మొదటిది, వర్ణవ్యత్యాసాలకు చిహ్నం. రెండోది, స్వర్గ నరకాల విషయంలో విశ్వాసానికి చిహ్నం. అంతేకాదు, 'ఏకమ్‌సత్' అనే సూక్తి 'ఏకమేవాఽద్వితీయమ్ బ్రహ్మ' అయింది. ఈ భావానికి ఇస్లాంకూడా దోహదం చేసి వుంటుందంటున్నారు పరిశీలకులు. మొత్తానికి, విగ్రహారాధన పనికిరాదు. దైవం ఒకభావం. దాన్ని ఈశ్వరుడను, ప్రభువను, మరేదైనాఅను, దానికి రూపం, గుణంలేవు. అది అప్రమేయం. అయినా, దయామయం. ప్రేమపూర్ణం.

ఈ మతంగాని మతం సైతం చలానికి ఎంతో కాలం సరిపడలేదు. 'సాంప్రదాయిక' కుటుంబంలో, అక్షరాలా పితృశిక్షణకింద పుట్టి పెరిగి ఉపనయనం తర్వాత పిలక పిల్లాడై పిచ్చిగా గాయత్రి జపం సాగిస్తూ వచ్చినవాడు, కాకినాడలో 'బ్రహ్మర్షి' కటాక్షానికి గురై 'బ్రాహ్మ'గా మారి అంతే తీవ్రవాదంతో కొత్తమతాన్ని గుండెలకు పట్టించుకున్నాడు గాని, బ్రాహ్మమతం చలం సహజాతానికి అడ్డు వచ్చింది. దాన్ని తాను 'రక్తం' అన్నాడు- స్వభావమన్నా తప్పులేదు. బ్రాహ్మల నిష్ఠ తనకు దుర్భరమైందంటే, తన సహజాభిలాషలకు అడ్డువచ్చి, కృత్రిమతకూ కపటత్వానికీ ఎగదోస్తున్నదని అనిపించినందుచేతనే. భ్రష్టుడూ పాపీ అననీ, తాను తనకే నిబద్ధుడు. సంస్థాగతమైనదాన్ని దేన్నీ తాను తలదాల్చేది లేదు- అందులో 'పెళ్లి' ఒకటి. ఒకానొకటి కాదు, చాలా ముఖ్యమైన సామాజిక సంస్థ. తన కప్పటికే పెళ్లి అయింది- భార్య మంచి మనిషే- అయితే మాత్రం వివాహేతరమైన స్త్రీ-పురుష సంపర్కానికి అభ్యంతరాలెందుకు? నిజానికి, పెళ్లి మగవాడి కిచ్చినంత స్వేచ్ఛని ఆడదాని కివ్వనప్పుడు, స్త్రీ దాన్య సాధనమే గదా! రామెుక్కపాటి మమూర్తి మరదలు పిల్ల రత్నమ్మతో తానేంచేస్తే బ్రహ్మ సమాజానికేం, అసలు సమాజానికేం?

రత్నమ్మతో మొదలుకాలేదు చలం జరిపబూనిన "స్త్రీ స్వేచ్ఛా యజ్ఞం". కన్న తల్లి తనని ముద్దుజెయ్యక పోయినా ఆవిడ దురవస్థకు వల్లమాలిన జాలిపడుతుంచి, పెత్తండ్రి కుమార్తె రమణతో తన వివాహానికి అనుమతించ వలసిందిగా శృంగేరీ

పీఠాధిపతిని ప్రార్థిద్దా మనుకోవటంతో మొదలైంది చలం "శృంగారం." శ్రీనాథ యుగంలో 'రసికత' అని వుండేవారేమోగాని, భావకవులు 'ప్రణయం' అంటే చలం "శృంగారం" అన్నాడు. దానికి అనువుగానే తనదైన దైవభావం సాకారం, సగుణం, సౌందర్యమయం అయింది. 'స్త్రీ బలహీనతే లేకుంటే నువ్వు సన్యాసివై వుండేవాడివి' అని లీలగారు వుత్తినే అనలేదు. స్త్రీనే దేవుడిగా చూడ సాగాడని ఆవిడకు తెలిసినట్లు లేదు. అప్పుడిక శరీరమే గుడి, అనుభవమే పూజ. అయితే భార్యనిగాని డాక్టరు రంగనాయకమ్మగారినిగానీ లీలగారినిగానీ మరెవరినైనాగానీ చలం భక్తుడై పూజించనూ లేదు, తృప్తిచెంది తృప్తిపరచనూలేదు. దీనికి కారణం చలం అత్యాశ. ఆశ తీరనప్పుడు అసంతృప్తి. "స్వప్న చారిణి" యైన ఆదర్శ స్త్రీభావం కొలతలకు సరిపడా యీ వాస్తవ వ్యక్తులెవ్వరూ ఎదిగినట్టు అనిపించలేదు గనక "నాబుద్ధి చంచలం" అని మాత్రం సరిపెట్టుకున్నారు. అట్లని, తన "యజ్ఞం" ఆపలేదు. రవి (కుమారుడు) వ్యాధితో మరణంతో, దయామయుడైన దేవుడంటే కూడా నమ్మకం సడలి, దేవుడు ఖాళీ చేసిన స్థానాన్ని 'స్త్రీ' నింపివేసింది.

కోరి వచ్చిన ఏ స్త్రీనైనా యింటిలో నిలవనీక వూరి బయట పొలాలకూ వాగులకూ లాక్కుని పోవడం యెందుచేత? అకృత్రిమ ప్రకృతికి లోనా బయటా చలం వశ్యుడు. ప్రకృతి బిడ్డ అనదగినవాడు. 'హరిజన' వాడల్లోనేగాదు, వలుకుల్లో కూడా జీవించగలిగిన చలం, అవసరాన్ని బట్టి మాత్రమే గాక మచ్చికపడని 'సహజ' బంధం వల్ల కూడా యీ ఆదిమ ప్రకృతిని పూరా అనుభవించగోరాడు. 'రక్తం', 'సహజాతం' విషయాల్లో డి.హెచ్.లారెన్సు గుర్తుకొస్తే యిక్కడ రూసో గుర్తుకొస్తాడు. 'నోబుల్ శావేజ్'లా జీవించగోరిన చలం, భావపరంగా, పారిశ్రామిక విప్లవానికంటె ఎంతో కిందటి సరళ, సుందర జీవితాన్ని వరించాడనాలి. అందుకే గాంధీ ఆర్థికతత్వం చలానికి బాగా నచ్చింది. సొంతానికంటూ తనకు కనీసం సాటి ప్రాథమికావసరాలు చాలు. డాక్టరు రంగనాయకమ్మ గారి మెడికల్ ప్రాక్టీసు అందుకొన్న దశలో తప్ప తాను డాబులకూ డబ్బులకూ పోనేలేదు. పేదరికమైనా సంతోషం సంతృప్తి వుంటే స్వర్గ భాగ్యమేనని చలం తత్వం. ఇది సామాజిక పురోగతికి తీవ్రమైన హాని కలిగించిన సనాతన 'సంతృప్తి' దృక్పథం. వ్యక్తి ఉన్నదానితో సరిపెట్టుకోవచ్చు, ఋషిలా సన్యాసిలా బతకవచ్చు, అతని యిష్టం, ఉన్నది చాలక. ప్రాణపోషణ దుర్ఘటమైనప్పుడు, సమాజంలో ఆస్తిహీనులకు అసూయ. ద్వేషం వంటి భావాలు కూడా తాము బాగుపడేందుకు పనికి వచ్చేవే. అయినా, వ్యక్తిగా ఆడంబరాలకు పోలేదనేగాని, చలానికి తిండికీ

బట్టకీ తిరుబడికీ కొదవేమిటి? చేపలో మాంసమో లేకుంటే గొంతు దిగదు. కొంపెల్ల జనార్దనరావు లాంటి శ్రోత్రియుల్ని వాళ్ల 'ఖర్మ'కు వదిలాడు కూడా- మజ్జిగన్నం పెట్టి.

ఎవడికివాడే. ఎవడి బతుకువాడిదే. ఒకడితో ఇంకొకడికి నిమిత్తం లేదు. బలహీనులు అట్టడుక్కి పోయి అంతరిస్తే అంతరించనీ, అది సృష్టిధర్మం- Each one for himself and Devil take the hindmost అనేది వ్యక్తి విశిష్టతావాదం అంతిమ పర్యవసానం. చలం అంతదాకా పోలేదుగాని పోయినంతమేరకు అదే తెన్ను. కాల్పనిక వాదం బూర్జువా వ్యవస్థ అవతరణకు పట్టి నిరసనం మాత్రమే కాదు. ఆదిమకాలానికి, ప్రకృతి ఒడిలోకి, పారిపోదామనే వైఖరి ఒకవంక, వ్యక్తి విశిష్టతను విపరీత స్థాయికి పెంచి సామాజిక బాధ్యతారాహిత్యంగా ముదిరించే వైఖరి మరొకవంక- యిలా ఎన్నో పాయలు.

చలం పెళ్లినే నిరసించాడు- స్త్రీ దాస్యవిమోచన కోరినంతమేరకు యిది మేలే, సందేహం లేదు- పురుషాధిక్యత మానవజాతి చరిత్రలో ఎన్నడో మొదలై భూస్వామిక యుగంలో వికృతంగా పశుత్వంగా పరిణమించింది. మతంతో ముడిబడి, యావజ్జీవం బలవంతపూర్వకమైన దాంపత్యంగా, స్త్రీ జాతిని పురుషజాతికి లోబరచివేసిన 'మొనోగమీ' లోపాలతో లుకలుకలాడుతున్న మాట నిజం. తెలుగులో గురజాడతో మొదలైన వివాహసంస్థావిమర్శ చలం చేతిలో పరమ విధ్వంసాత్మకంగా తయారైంది. పోనీ, దీనికి ఆయన చూపిన ప్రత్యామ్నాయం ఏమిటి? 'ఫ్రీ లవ్'ను బోధించడమే కాదు, తాను ఆచరించి మరి కొందరిచేత ఆచరింపజేశాడు. సామాజికంగా ఇది చాలా సాహస కార్యం. ఫలితం మాటో? భర్తల నిరంకుశత్వానికి సొంత ఆస్తి హక్కు మూలమైనప్పుడు, ఆర్థికంగా స్త్రీకి ఆస్తిహక్కు కలగనంత వరకు తన కాలిమీద తాను నిలవడం అసంభవం. విద్య, హోదా, అధికారం, స్త్రీని ముందుకీ పైకీ తీసుకు రావచ్చు గాని స్త్రీజాతి పరాధీనతను అంత మొందించడానికి ఆర్థిక పునాదిని పూర్తిగా మార్చే విప్లవ మొక్కటే ప్రాతిపదిక. విప్లవానంతర కాలంలో, అంటే ఆర్థిక పునాది మారిన తర్వాత గూడా, వెనకటి వ్యవస్థ తాలూకు భావజాలం కొనసాగేంత కాలం స్త్రీకి సమానత రాదు. ఇంకా చాలాకాలం తర్వాతనే ఈ 'మొనొగమీ' క్రమేపీ కృశించి, యువతీ యువకులు తమ హృదయాభిలాషలను బట్టి కూడి వుండగలిగినంత కాలం కూడి వుండి, విడిపోవలసినప్పుడు విడిపోయే స్వేచ్ఛ సాధ్యమౌతుంది. ఇంతటి సుదూర విషయం మార్క్సిస్టు మహోపాధ్యాయుల విషయంలోనైనా ఊహాచిత్రమే

గాని దృశ్యం కాదు. కాబట్టి ఈ అంశంలో చలాన్ని అతిగా లోపమెన్నడం సబబు కాదు. జీవితం ద్వారా సాహిత్యంద్వారా స్త్రీ విషయంలో చలం కలిగించిన సంచలనం, భావ విప్లవ ప్రారంభంలో తప్పని అనిబద్ధమైన, అదుపు తప్పిన మహాందోళనే.

క్లారా జెట్కిన్‌తో లెనిన్ చేసిన సంభాషణ ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది: ప్రేమ పేరునగాని 'శృంగారం' పేరునగాని స్త్రీని అనుభవించి, అక్కర తీరాక విడిచి వెయ్యడం తగదు. అలాంటి పద్ధతిని Glass of water theory అన్నాడు లెనిన్. దాహమైనప్పుడు గ్లాసెడు నీళ్లు గటగటా తాగి, దాహం తీరాక ఆగ్లాసుని గిరాటుకొట్టవద్దు. ఉద్దేశం ఏదైనా, చలం చేసింది యిలాంటిదే. ఒక అక్రమాన్ని తొలగించబోయి అంత కంటె పెద్ద అక్రమానికి తావివ్వడం సమర్థనీయం కాదు. వీరేశలింగం సంస్కరణలు గమనించాడు గాని, విధవా పునర్వివాహ ఉద్యమ తీవ్రతలో వితంతువుల కోరికలకు ఏ మాత్రం ప్రాధాన్యమివ్వక, "పురుష స్వయంవరం" వంటి పద్ధతికి వాళ్లను లోబరచి వేశాడని వీరేశలింగంను విమర్శించడం బాగానే వుందిగాని, అప్పట్లో వీరేశలింగం మరోలా అన్ని పెళ్లిళ్లు చేయించగలిగేవాడు కాదు. రఘుపతి వేంకటరత్నం నాయుడు స్త్రీని చాలా సమున్నతంగా భావించినట్టు చలం సంతృప్తి ప్రకటించాడుగాని, సంతాన వతులైన వితంతువుల పునర్వివాహ విషయంలో నాయుడుగారి సందేహాలను పరిగణన లోకి తీసుకోలేదనిపిస్తుంది.

చదువు విషయంలో కూడా చలం తిరుగుబాటు చేశాడు. ముఖ్యంగా బడి చదువు లక్కర్లేదు పొమ్మనడమే గాక, ఒక నిబంధనావళికీ చట్రానికీ లోబడి సంస్థా రూపం ధరించిన విద్య వ్యక్తి వికాసాన్ని అడ్డుకొంటుందని గట్టి నమ్మకం చలానికి. తన బిడ్డల్లో ఒకరిద్దరికి తప్ప బడి చదువులు చెప్పించలేదు. బిడ్డల్ని కొట్టకూడదు, తిట్టగూడదు, సరేగాని ఒక తరం తన అనుభవ సంచితాన్ని యింకో తరానికి యేదో ఒక పద్ధతిలో అందించకపోతే, మానవజాతి యిలాగుండేదా? వైజ్ఞానికంగా అనుభూతి పరంగా కూడా మనిషి నైజం క్రమ సంస్కారం పొందడానికి విద్య కూడా తోడ్పడుతూ రావడం లేదా? గాలికీ ధూళికీ, పూర్తిగా స్వానుభవం ద్వారా సమకూరగల విజ్ఞాన సంపాదనకు, బిడ్డల్ని వదిలేస్తే వారిలో కలిగేవి చివరకు సహజత్వమా ఆదిమత్వమా? ఇదికూడా అరాజకవాద భావమే. వ్యవస్థే స్వతహాగా చెడ్డది కాదు- దుష్ట వ్యవస్థే నాశనం కాదగింది.

భూస్వామ్య వ్యవస్థ చావకా బతక్కా రొంపిలో కూలబడ్డ గొడ్డులా ఇంకా మన తలల్లో తన భావజాలాన్ని కొనసాగిస్తూనే వుంది. మత విశ్వాసమైనా ఆ వ్యవస్థ

దుర్గంధమే. నిర్గుణుడైనా సగుణుడైనా పరమాత్మ మనిషి మనస్సును లోబరచుకుని పెత్తనం చేస్తున్న భయంకర ప్రభువే. వైరాగ్యంతో పోలిస్తే ఇహలోకాన్ని కొంత మేరకైనా గుర్తించే తత్వం, శరీరాన్ని దాని ప్రాముఖ్యాన్నీ గుర్తించే తత్వం, గుడ్డిలో మెల్ల అనుకోవచ్చు- అయినా ఈ మాత్రం 'కన్సెషన్' అయినా యిప్పుడు, హేతువాదం, భౌతికవాదం బలపడిన యీ రోజుల్లో, దీనికివ్వడం తగదు. చలం పుట్టుకతోనే భక్తుడు. బ్రహ్మ సమాజ ప్రభావంవల్ల, భక్తినీ రక్తినీ రంగరించుకున్నాడు. మధ్యలో కొంతకాలం అస్తినాస్తి విచికిత్స చేశాడు. దేవుడు చండశాసనుడా కరుణామయుడా అని తర్కించాడు. రవి మరణంతో నిరీశ్వరవాదంవైపు మొగ్గినట్టనిపించాడు. అయితే తనకు జన్మతః వచ్చిన తలనొప్పులు పోగొట్టుకునేందుకు యోగ సాధన చెయ్యడమే కాదు, ఆసనాలు వెయ్యటమే కాదు, సూర్య నమస్కారాలకు తానూ, తనతోబాటు షౌను దించడమే కాదు, ఇంకెన్నో చేశాడు. దీక్షితుల ప్రోద్బలంతో మొదట అయిష్టంగా, తర్వాత విధిలేక, రమణాశ్రమం చేరాడు. తన మనస్సులో మన్మధుడికీ ఈశ్వరుడికీ మధ్య సాగుతూ వచ్చిన పోరాటంలో చివరికి గెలిచిందెవరు? కాబట్టి భూస్వామిక భావజాలం నుంచి చలం పూర్తిగా స్వతంత్రించాడనడం నిజం కాదు.

రచయితగా చలం తన కథల కిచ్చిన ప్రాముఖ్యాన్ని మించి తన నాటకాల కిచ్చాడు. చలం రచనలూ జీవితానుభవాలూ వేర్వేరు కావు. నమ్మిందాన్ని గుండెనిబ్బరంతో రాశాడు కాబట్టి చలం సాహిత్యం సమాజశక్తి కాగలిగింది. 'అప్రాప్త మనోహరి', 'హృదయేశ్వరి', 'ఊర్వశి' వంటి అరూప సౌందర్య స్థానాలనుగాక, రక్తమాంసాలూ, కోరికలూ కామనాలూ గల వ్యక్తులను పాత్రలుగా తీసుకొని, మధ్య తరగతి గబ్బిలాలన్నీ ఎగిరి పోయేట్టు 'షాక్' తినిపించాడు, ఈ రచనలు చదివి చలం జ్యోతిని చేరుకున్నది యువతులేకాదు, యువకులుకూడా. అయితే బెంగాల్ నుంచి త్వరలో శరచ్చంద్ర ఛటర్జీ, అనువాద సాహిత్యం వచ్చి మళ్లీ సాంప్రదాయికతకు పునరుజ్జీవం కలిగించే లోపలనే, సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు వగైరా సంస్థల పీఠాధిపతులు చలాన్ని కోపగించుకున్నారు, కంటగించుకున్నారు, వెలిబెట్టారు, 'నీలి' వార్తలూ పుకార్లూ రేపారు. దాంతో తెలుగుదేశం అంటేనే ద్వేషం కలిగింది చలానికి. ఆ రోజుల్లో ముద్దుకృష్ణ లాంటి ఒకరిద్దరు తప్ప చలంను నిర్భయంగా నిస్సంకోచంగా అనుసరించ జూచినవాళ్లు లేనే లేరనాలి. ఈ ప్రబుద్ధులే గిడుగు వ్యావహారికాన్ని బాగా యెదగనీయక, అభినవ గ్రాంధిక శైలి నొకదాన్ని చేబట్టారు. చలం దీనిమీద కూడా తిరగబడి, విదేశీ వాసనలు (exotic) గుబాళించే మాటల్ని వాడడమే గాక,

శైలికి గల సంకెళ్లు తెగగొట్టి దానికి బలాన్నీ ఆకర్షణనీ అనన్యంగా కలిగించాడు. ఎన్ని రంగులు చూపగలదో మరెన్ని విరుపులు చూపగలదో, అన్నిటినీ అక్షరాల ఇంద్రజాలం చేసి చూపాడు చలం. అతని వచనం కవిత్వమయమైనట్టే, అతని కవిత్వం వచనమయం కాగలిగింది. సాదాతనం దానికి వెలి. ఉదాత్తమైన శైలి చలానిది. అది చాలా కొత్తది గనకనే అంతటి వింత గొలిపింది. అయితే ఇది ఆధునిక వచనశైలి అనిపించుకోదు. గురజాడ వచనశైలిని కుటుంబరావు స్వీకరించినంతగా చలం స్వీకరించలేదు. కథకుడు కుటుంబరావుకీ పేనున్నకీ పోలిక తెచ్చింది చలమే.

చలం యుగం చలం జీవితకాలంలోనే ముగిసినా, దాని రశ్మిమాత్రం నేటికీ నిలిచివుందంటే, చలం భావజాలంలోని మేలిమి యిప్పుడు కూడా మన సామాజిక జీవితంలోకి పూర్తిగా ప్రవేశించకపోవడమే కారణం. చలం వైతాళికుడు, తాను గాఢంగా అభిమానించి ఆదర్శంగా భావించిన దాన్ని చాలా తీక్షణంగా అక్షర బద్ధం చేశాడు. ఇది మొత్తంగానే సమాజ పురోగమనానికి పనికిరాక పోవచ్చు గాని, చాలా భాగం తోసిపేయ దగిందేమీకాదు. భావపరంగా చలం సాహసి. సహజ ఉద్రేకాల అడివి నుంచి. ఉన్మత్తమైన మనస్థితినుంచి, అరాజకతనుంచి తప్పించి చూస్తే, చలం చలమేకాడు, చలం విపరీత ఆకర్షణ ఎక్కువగా వాటిదే. చలం భావజాలంలోని అభ్యుదయాంశను వేరుజెయ్యడం చలానికి అపచారం కావచ్చుగాని, సమాజం పరివర్తనకు తప్పనిసరి.

చలంతో ఇంటర్వ్యూ

చలసాని ప్రసాద్

[కొంతకాలం క్రితం అరుణాచలంలో గుడిపాటి వెంకట చలంతో చలసాని ప్రసాద్ చేసిన ఇంటర్వ్యూలో కొన్ని భాగాలు]

ప్రశ్న: చలంగారు, మీరు యెప్పుడైనా కవిత్వం రాశారా?

చలం: చిన్నప్పుడు మల్లెచెట్టు మీద పద్యం రాద్దామని చూశా. రాయలేక పోయా. ఉత్పలమాల, చంపకమాల నా ఒంటికి సరిపడలా. వచనం రాయలేని వాడే పద్యం రాస్తాడు.

ప్రశ్న: 'మ్యూజింగ్స్'లో మల్లెల గురించి రాసి ముచ్చట తీర్చుకున్నారుగా? 'గద్యం కవీనాం నికషం వదంతి' పద్యం ఎడాపెడా రాసినవాళ్ళు హరీన్ లాగా కొందరేనేమో?

చలం: అవును సరస్వతి హుగీస్ చేతిలో చిక్కింది. అతను అన్నీనూ. ఏ ఒక్కటో కాదు. లైఫ్ఆఫ్ మైసెల్ఫ్ మాత్రం ఫెయిల్యూర్.

ప్రశ్న: బ్రహ్మ సమాజం నుండి ఎందుకు బయటపడ్డారు?

చలం: బ్రహ్మ సమాజం సర్వస్వం అనుకున్నా. సర్ రఘుపతి మా గురువుగారు. దాన్ని జస్టిస్ పార్టీలో కలపాలని చూస్తే తిరగబడ్డా.

ప్రశ్న: మీ కెవరయినా స్నేహితులు ఉన్నారా?

చలం: యెప్పుడూ నాలో నేనే నాకుతోడెవరూ లేరు. వొక వేళ యెవరన్నా దగ్గర కొచ్చినా యితరులు స్కాండల్స్ చెప్పి దూరం చేసేవారు.

దీక్షితులు గారొక్కరే తెలుసు. కృష్ణశాస్త్రి, నండూరి, శ్రీశ్రీ అంటే నాకెప్పుడూ ప్రేమే. శ్రీశ్రీ ఈజ్‌నాటోన్లీ ఎ పొయిట్, యెనీతింగ్ మోర్ దేన్ దట్ అతన్ని చూస్తే యిన్నోసెంట్ బేబి అనిపిస్తాడు. శ్రీశ్రీలో అధ్యాత్మిక పోకడల గురించి వ్యాసం రాద్దామనుకున్నా.

ప్రశ్న: కట్టమంచి "అర్థశాస్త్రం" చదివారా? అందులో మన అధ్యాత్మికతను మనసార తిట్టారు.

చలం- చదవలా "కవిత్వతత్వ విచారం చూశా. అందుకే భారతం, భాగవతం, భాస్కర రామాయణం చదివా. చాటువులంటే నాకిష్టం. ప్రబంధాలు నాకు కొరుకుడు పడలా "కళాపూర్ణోదయం" తప్ప మిగిలిన వన్నీ చెత్త అన్నాడు కట్టమంచి.

ప్రశ్న: యిన్ని చదివినవారు మొదట "శశిరేఖ" యెందుకు రాశారు?

చలం: కొంత బుక్స్ నుండి, కొంత లైఫ్ నుంచి యేర్చి కూర్చిన ఎమెచూరిష్ నవల "శశిరేఖ" యెలా రాయాలో ఏమీ తెలీదు. అందుకే అంత చప్పగావుంది.

ప్రశ్న: "శశిరేఖ" రాసేటప్పటికి ఉద్యోగంచేస్తూ వుండేవారా? అన్నిట్లోకీ యే ఉద్యోగం హాయి?

చలం: ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ ఉద్యోగం చాలా హాయి. ఒకచోట వుండకుండా తిరగొచ్చు. బందర్లో వుండగా "జయంతి"లో వేస్తానని విశ్వనాథ నాకథ ఒకటి తీసుకున్నారు. వేయలేదు. ఇవ్వలేదు.

ప్రశ్న: విశ్వనాథవి మీరేవన్నా చదివారా?

చలం: యేమీ చదవలా. ఒక పద్యం యెవరో చదివి వినిపిస్తే బాగుందని కార్డు రాశా. ఆ సాయంత్రమే బెజవాడ సినిమాహాల్లో కలిశారు.. అప్పుడు నేనుబాగా

డబ్బున్నవాణ్ణి. ఆయన కిందక్లాసులో వుంటే వెళ్ళి కంగ్రాచులేట్ చేశా. మనిషి మంచివాడే తనకన్నా తక్కువ వాళ్ళని బాగానే చేసేవాడు. ఈక్వల్స్ అంటే మాత్రం ద్వేషం, అసూయ.

తెలుగులో నేను చదివినవి చాలా తక్కువ. చదివి, బాగుంటె, వెంటనే మెచ్చుకుంటూ రాసేవాణ్ణి. కానీ నాకలా యెవ్వరూ రాయలా.

ప్రశ్న: టాగూరంటే మీకు మొదటి నుండీ యిష్టమేనా?

చలం: అప్పను వ్యూస్‌నచ్చకపోయినా ఎక్స్‌ప్రెషన్‌కి కట్టుబడిపోయా. మిస్టిసిజం నాకు పట్టక పోయినా ఎక్స్‌ప్రెషన్‌లో వున్న సింప్లిసిటీ నన్ను పట్టేసింది.

ప్రశ్న: అయితే గురజాడ మీద మీ అభిప్రాయం?

చలం: గురజాడ 'కన్యాశుల్కం' కన్నా గొప్పవాడు. అతని 'విజన్' వున్నతమయింది. 'హిందూ' పేపర్లో పడిన అతని ఉత్తరం అనువాదం చేశా. హ్యూమన్ అండ్ సోషల్ రిలేషన్స్ అంత లోతుగా పరిశీలించిన రచయితలు ప్రపంచంలోనే అరుదు. ఆ అనువాదనికి 'మానవుడి ప్రేమ' అని పేరుపెట్టి 'ఆనందం'లో వేశా.

ప్రశ్న: 'స్త్రీ' రాయకముందే రస్సెల్స్ మేరేజ్ అండ్ మోరల్సు చదివారా?

చలం; లేదు. చాలాకాలం తర్వాత చదివా. రస్సెల్సులో రేషనాలిటీ నచ్చింది అతనివి యెక్కువే చదివా, సైన్సు పుస్తకాలు నాకు అర్థంగాలా.

ప్రశ్న: చదివినా అర్థం గానివి యితర పుస్తకాలేమైనా వున్నాయా?

చలం: జేమ్స్‌జాయిస్ "యులిసిస్" చాలా వోపిగ్గా చదివా, కానీ నాకు ఫ్రెంచిలాగా వుంది.

ప్రశ్న: డి.హెచ్.లారెన్సు ప్రభావం మీ మీదుందా?

చలం: అంతా అలగే అనుకుంటారు కానీ, నేను రాశాక చదివా అయన్ని ఇటీవల వజీర్ రెహ్మాన్ మా యిద్దరి వాక్యాల యెత్తుబడి, ముగింపు కూడా వొక్కటేనని కొన్ని పేజీలు వినిపించాడు అవి అనుకోకుండా దొర్లిన సామ్యాలు. నిజమైన సౌందర్యం, కళాత్మక రచనలు అనుకరణ వల్ల రావు. హృదయంలోంచే రావాలి.

ప్రశ్న: టాల్‌స్టాయ్ చదివారా?

చలం: 'వార్ అండ్ పీస్' లెబోరియస్ అనిపించింది. యుద్ధ వర్ణనలు వదిలేశా. ది వోన్లీ థింగ్ ఐ రిమంబర్ ఈస్ దట్ ఐ ఫినిష్డ్ ఇట్. వార్ అండ్ పీస్ కన్నా 'అన్నా కెరినినా' మెరుగు.

ప్రశ్న: గోర్కీ, చెకోవ్ చదివారా?

చలం: ఆశ్రమం కొచ్చాక గోర్కీ ఆటోబయోగ్రఫీ, చాలా కథలూ చదివా. నన్ను బాగా పట్టేశాయి. యింతకుముందే యెందుకు చదవలేదా అనుకున్నా. 'అమ్మ' నాకు నచ్చలా. నాలో లోపమేనేమో గోర్కీ ముందు చెకోవ్ చాలా లైట్ అనిపిస్తాడు. ఐ ప్రిఫర్ గోర్కీ.

ప్రశ్న: మొత్తం రష్యన్ సాహిత్యం మీద మీ అభిప్రాయం?

చలం: రష్యన్ నవల యేది చదువుతున్నా అసలు సాహిత్యమంటే యిదేనాని పిస్తుంది. మిగతావి చప్పగా, పిప్పిగా వుంటాయి.

ప్రశ్న: మీరెక్కువగా యేం చదివేవారు?

చలం: సాహిత్యం, స్త్రీ కోసం చదివేవాడిని.

ప్రశ్న: బిడ్డల, శిక్షణలో మీరు రాసిందంతా ప్రాక్టికబుల్ అనుకుంటున్నారా?

చలం: అవును ప్రాక్టికబుల్ కాకపోతే ఆ లోపం మనదే. పిల్లలది మాత్రం కాదు.

ప్రశ్న: మర్యాదస్తుల పత్రికలేవీ కూడా మీ రచనలు అచ్చువేసేవి కావని శ్రీశ్రీ అన్నారు. నిజమేనా?

చలం: అవును అందాకా యెందుకు? 'ఆంధ్రపత్రిక' ఉగాది సంచికలో వేస్తా నంటే 'రెడ్డిరంగమ్మ' రాసి కాశీనాధుని నాగేశ్వరరావుగారికిచ్చా. వెయ్యలా ఆ కథ ఆ తర్వాత "సమదర్శిని"లో వచ్చింది.

ప్రశ్న: మీ రచన లేవైనా మిస్ అయినాయా?

చలం: "చిత్రగుప్త"లో పడిన నాకథలు "పేదరాసి పెద్దమ్మ," "అట్లపిండి" నాకు దొరకలేదు. తర్వాత జావళీ మీద 4,5 పేజీలు రాశా నెందులోనో గాని అదీ దొరకలా.

ప్రశ్న: అన్వేషణ ప్రారంభిద్దాం. మీరు రాసిన మృత్యువు "ఉదయిని"లో పండిందిగదా. కొంపెల్ల జనార్దనరావు మీకు బాగా తెలుసా? "సాహిత్యం అతని వూపిరి" అని మీరు "కవిహృదయం"లో అన్నారు.

చలం: అవును రచనల కోసం అందరు రచయితల దగ్గరకూ కాళ్ళకు బలపాలు కట్టుకొని తిరిగే వాడతను. ఒకసారి విశ్వనాథ దగ్గరకు రచనల కోసం వెళితే, పాత 'ఉదయిని' పుచ్చుకొని "ఇందులో ఈ చలంగాడి పేజీలు చించేస్తేనే నీకు రాస్తాను" అన్నాట్ట. ఎలాగో బతిమాలి బామాలి అతని రచన పట్టుకుని జనార్థనరావు నా దగ్గర కొచ్చాడు. అవన్నీ నాతో చెప్పాడు. నేను లైటుగానే తీసుకున్నా.

కొంపెల్ల సాహిత్యం కోసమే బతికాడు, అందు కోసమే చనిపోయాడు. నిజంగా అతను మనిషి. ఉత్తమ రచనల కోసం, ప్రమాణాల కోసం తన సర్వస్వం అర్పిం చేశాడు. ఒకసారి నేను కనిగిరి ట్రాన్స్‌ఫరయా. నానా అవస్థపడి సరిగ్గా భోజనాల వేళ జనార్థనరావు నా దగ్గర కొచ్చాడు. "మీరు బ్రాహ్మలా? ఇక్కడ వెజిటేరియన్ దొరకదు" అన్నా. యెలాగో అవస్థపడి వెజిటేరియన్ యెక్కడి నుండో తెప్పించా. నేను చేపలు, మాంసం, రొయ్యలు తెగతింటూంటే, నా యెదురుగా కూర్చుని యేమీ యిబ్బెట్టు లేకుండా వెజిటేరియన్ తిన్నాడు.

ఆ తర్వాత బెజవాడలో వోసారి మాయింటి కొచ్చాడు కొంపెల్ల, అతని ముఖం లో గొప్ప రేడియన్స్ కనిపించింది. యెంత వెలుగు! కానీ, తర్వాత తెలిసింది. టీబీ కాజ్‌డ్ దట్ రేడియన్స్ అని. మెడ్రాస్ వెళ్ళినప్పుడు మంచం పట్టాడనితెల్సి, మల్లం పల్లి యింటికెళ్ళాను 'మల్లంపల్లి' యింటిల్లిపాదీ అతనికి సపర్యలు చేశారు. శ్రీశ్రీ సరేసరి అతని కాళ్ళ దగ్గరే కూర్చొనేవాడు. ఆ రోజుల్లో టీబీ అంటే అమడ దూరం పరిగెత్తేవాళ్ళు. అలాంటిది మల్లంపల్లి యింట్లో యెంత ప్రేమగా చూశారు!

నేను వెంటనే బెజవాడవచ్చి ఒక పెద్ద తోటకొని, అందులో ఒక పాకవేసి కొంపెల్లకు సేవలు చేద్దామనుకున్నా, ముఖ్యంగా అతన్ని మల్లంపల్లి యింట్లో నుంచి బయటకు తేవాలి- వాళ్ళింట్లో అందరూ టీబీ వాతపడకుండా, ఓతోట బేరంకూడా చేశా. కానీ యింతలో కొంపెల్ల పోయాడు.

ప్రశ్న: మీరు కొన్ని సోషల్ ఈవిల్స్ మీద తిరగపడ్డారు. వాటిని తెగ నాడారు. ఆ ఈవిల్స్ యింకా అలాగే కొనసాగుతున్నాయి. ఒప్పుకుంటారా?

చలం: అవును అలాగేవున్నాయి.

ప్రశ్న: సమసమాజం రావాలనీ, ఆ ఈవిల్స్ పోవాలనీ కోరుకుంటున్నారా?

చలం: చాలా బలంగా.

ప్రశ్న: ఐలైక్ చలంమైనస్ ఈశ్వరుడు. యిలా అన్నానని మీకు కోపమా?

చలం: యేం కోపంలేదు. మీనమ్మకం మీ యిష్టంమీది. నా భావాలు మీమీద రుద్దాలనే తాపత్రియం నాకు లేదు. మీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గౌరవిస్తాను.

చలసాని: "అచ్ఛా స్వేచ్ఛాజీవీ! చర్చకు చోటిచ్చావ్," అన్నాడు శ్రీశ్రీ వోసారి. అయితే సెలవ్.

(18-5-79 'ఈనాడు' సౌజన్యంతో)

చలంతో ఇంటర్వ్యూ : నవీన్

దశాబ్దం క్రితం చలం - సృజన

1968 మేలో సృజన చలం సాహిత్య సమాలోచన సంచికగా వెలువడింది. ఆ సంచిక కోసం సందేశం పంపమని చలంగారికి రాస్తే, 'సందేశం ఏమివ్వను, ఏవైనా ప్రశ్నలు అడగండి, జవాబులు చెప్తాను- జవాబుల రూపంలో కాకున్నా మ్యూజింగ్స్‌గానయినా' అని రాసారు. ఆ మాటే గొప్ప ఉత్తేజంగా ప్రశ్నలు రాసి పంపాడు నవీన్. ఆ ప్రశ్నలు చాల exciting గా వున్నాయని, సంవత్సరం తర్వాత ఆయనచేత రాయించేలా చేసినవని చలంగారే అన్నారు. ఆ ఇంటర్వ్యూలో అత్యధిక భాగాన్ని యిక్కడ మళ్ళీ ప్రచురిస్తున్నాం. — 'సాహితీ మిత్రులు,

ప్రశ్న: మీ నిజజీవితంలోని సంఘటనలుగాని, వ్యక్తులుగాని, మీరురాసిన కథలకిగాని, నవలలకిగాని ఆధారాలైన కొన్ని ఉదాహరణలు చెప్తారా?

జ: నా రచనల సంఘటనలకి అబలల ఆర్తి ఆధారం. సంఘ బహిష్కృతులైన స్త్రీలు నాలో confied చేసుకున్న చరిత్రలు నా రచనలకి ఆధారం.

ప్రశ్న: మీమీద ముఖ్యమైన Influences-both Western and Indian- యేవి?

జ: Indian writers రవీంద్రనాథ్ టాగూర్ Foreign మొపాసా, మాఘం, బెర్నార్డ్‌షా ఇంతే జ్ఞాపకం.

ప్రశ్న: మీరు తెలుగు సాహిత్యంలో ప్రవేశించేటప్పుడు తెలుగు సాహిత్యం యేస్థితిలో ఉంది? ఉదాహరణకి మీరు "తెలుగు నవల" అనే వ్యంగ్య రచన వొకటి రాశారు. మీరు నవలలు రాసేముందు తెలుగు నవల స్థితి మీరా Satire లో సూచించినట్లే ఉందా?

జ: తెలుగు సాహిత్యంతో నాకేనాడూ సంబంధం లేదు. నేను రాస్తున్నప్పుడు ఓ తెలుగు సాహిత్యం వుందని తెలీదు. కథలకోసం పుస్తకాలు చదివాను చిన్నప్పుడు.

వ్యవహారిక భాషావాదం వుందని అసలు తెలీదు. చాలా పుస్తకాలు రాసిందాకా నా పుస్తకాలు తెలుగు సాహిత్యమనే విషయమే ఎరగను. నాకీ నాటికీ తెలుగు సాహిత్యాన్ని మార్చాలని కాని improve చెయ్యాలనికాని ఉద్దేశ్యమే లేదు.

'తెలుగు నవల'లో నేను Caricature చేసిన, నవల నేను పాఠం చెప్పాల్సి వొచ్చింది. అది 1927 ప్రాంతాలలో, కాని అంతకన్న మంచి నవలలు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలైన వారివి చిన్నప్పుడు చదివాను.

ప్రశ్న: మొదటినుండి మీసాహిత్యాన్ని seriousగా చదివినవాళ్ళకి ఇవాళ్ళ మీరు 'రమణాశ్రమం'లో ఉండటం ఆశ్చర్యం కల్గించదు. మీరు రాసిన నవలలు 'అమీనా' 'అరుణ' 'జీవితాదర్శం' మొదలైన నవలల్లో ఇప్పటి మీ ఆధ్యాత్మిక జీవనపు Potentialities కన్పిస్తాయి. ఈ విషయాన్ని గూర్చి మీ అభిప్రాయం ఏమిటి? మీ నవలల్లో కల్లా ముఖ్యమైన ఆ మూడు నవలల గూర్చి (అమీనా, అరుణ, జీవితాదర్శం) ఇప్పటి మీ అభిప్రాయం తెలియజేస్తారా?

జ: ఆ మూడు నవలలోనే కాదు. నా Serious రచనలన్నిటిలో—స్త్రీ అనే పుస్తకంలో Musings లో ప్రేమలేఖల్లో ఏదో దూరాన నా కళ్ళకందని, పేరులేని దేనికోసమో, ఎడతెగని నిర్నిద్ర అన్వేషణ కనపడుతుంది.

ఆ మూడు నవలలూ రాయగలిగాననని గర్వపడుతున్నాను.

ప్రశ్న: 'మైదానం' అనే నవల రాయటంలో మీ ముఖ్యోద్దేశం అనాటి Middle class Moral Values ని Shock చెయ్యటం—అంటే మీరు ఒప్పుకుంటారా?

జ: Shock చెయ్యాలనే గుణం, నా మొదటి పుస్తకాలన్నిటిలోనూ వుంది.

మైదానంలో Shocking గుణం చాలా Secondary నా దృష్టిలో అది ఒక Artistic Piece.

స్త్రీ హృదయపు లోతుల్ని చాలా గాఢంగా చిత్రించాను. నా పుస్తకాలన్నిటిలో ఎక్కువ ముద్రణలు పడ్డది స్త్రీ.

రెండోది మైదానం.

ప్రశ్న: మీరు 'రమణాశ్రమం'లో చేరక పూర్వం తెలుగు యువతరాన్ని ఎంతగానో Influence చేసిన మీ భావాలు-స్త్రీ స్వాతంత్ర్యం, సెక్సు స్వాతంత్ర్యం, శృంగార జీవనం, ప్రకృతితో తాదాత్మ్యం, కృత్రిమ లౌకిక విలువలపై యేవగింపు- ఈ భావాలు మీరు రమణాశ్రమం వెళ్ళాక యేమైనా మారాయా?

జ: అణుమాత్రం మారలేదు. పైగా "కృత్రిమ లౌకిక విలువలపై ఏవగింపు మరింత ఎక్కువయింది. (ముఖ్యం నాలో ఇంకా మిగిలివున్న వాటిపైన).

నేను ఏది రాస్తున్నానో వాటి న్యాయం, సత్యం నాకు ఆనాడే స్పష్టం. కాని నేను నా రాతలలో వాటికోసం ఎందుకు యుద్ధం చేస్తున్నానో ఆనాడు తెలీదు. అది నా స్వభావం. నేనట్లా పుట్టాను అనుకున్నాను ఈనాడు నాకు ఈశ్వరానుగ్రహం వల్ల గోచరమైన కాంతిలో, నా జీవితాన్ని ఉడికించిన భావాల సత్యం, న్యాయం, అవసరం గోచరమైనాయి. నా రచనలు నా జీవిత సమరాన్నే ప్రతిబింబించాయి. నా యత్నం సంఘాన్ని సంస్కరించడానికి కాదు, నన్ను సంస్కరించుకోడానికి.

ప్రశ్న: మీరు "మహా ప్రస్థానాని"కి రాసిన "యోగ్యతా పత్రం" చాలా ప్రఖ్యాతివహించింది. మీరు ఆ కావ్యానికి అంత గొప్ప ఆవేశంతో "యోగ్యతా పత్రం" రాయటం కొంత ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. 'మహా ప్రస్థానం' లో శ్రీశ్రీ చూపించిన "Socialism" అనే లక్ష్యాన్ని మీరెన్నడూ అంగీకరించ లేదనుకుంటాను మీకు వ్యక్తి స్వాతంత్ర్యం, వ్యక్తి తనంతట తాను చేసుకునే సంస్కారం ముఖ్యం. అంతేకాకుండా మీలో మొదటినుండి Mysticism వైపు మొగ్గు కనిపిస్తుంది. ఇలాంటి మీకు, Socialist & Materialist అయిన శ్రీశ్రీకి భావైక్యత లేదు. అందువల్ల మీరు మహా ప్రస్థానానికి అంత గొప్ప ఆవేశంతో 'యోగ్యతా పత్రం' రాయటానికి కారణం ఏమిటంటారు? ఆ కావ్యంలోని 'శైలి, మిమ్మల్ని Move చేసిందా? ఒకవేళ 'శైలి' కారణమైతే భావంతో విడివడిన శైలి వేరేలేదన్న మీ వాదాన్ని ఎలా సమర్థిస్తారు?

జ: 'యోగ్యతా పత్రం' అనే మాట ఎట్లా వొచ్చిందో కానినేను రాసింది మహా ప్రస్థానానికి జోహార్లు అంటాను. నాకు చాలా గౌరవం. నాకా పుస్తకంలో ఏ 'ఇజం' కనిపించలేదు. ఓ Great Poet, Heart నించి వొచ్చిన out pouring తప్ప.

నేను నా INTRO రాసేనాటికి శ్రీశ్రీ ఇంకా తన స్థానాన్ని వెతుక్కుంటున్నాడు. అతను తల ఎత్తాడో లేదో సాహిత్య రాబందులు గుర్తించాయి— ఓ గొప్ప

నూతన స్వరం వినవొస్తోందని మురికి ముక్కులతో అతన్ని చించడం ప్రారంభించాయి.

ఇదే సమయమని వాళ్ళను చెండాడాను ఆ పీఠికలో। కావ్యంలోని శైలిని విడిగా నేను చూడనేలేదే! ఎందుకట్లా అంటారు?

నేను Intro రాసిన పదేళ్ళకి అది అచ్చయింది. తరువాత ఓ 5 ఏళ్ళకి చదివాను దాన్ని. అప్పుడు నాకు ఆశ్చర్యం కలిగింది. నా Intro లో తెలుగు భాష ఎంత గొప్పగా ధ్వనించిందని. అప్పటికీ ఆ ధ్వని నా ఆవేశం వల్లనే అంటాను.

ఏ 'ఇజం' లేని ఓ మహాకవిని, తమ వైరంతో ఈర్ష్యతో స్వరక్షణకోసం ఓ 'ఇజం' లోకి తోసింది అనాటికి ఈనాటికి తెలుగు సారస్వతాన్ని ఏలుతున్నది ఈ అసూయా ప్రభువులు.

శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని 'ఆధ్యాత్మిక అభినివేశాలు' అనే వ్యాసం నేను రాయకుండానే ఉండిపోయింది.

ప్రశ్న: మొదటినుండి మీ వ్యక్తిత్వంలోను, మీ సాహిత్యంలోను మూడు ముఖ్యమైనTrends కన్పిస్తాయి. అవి

1. సంఘ సంస్కరణాభిలాష - (Reforming Zeal)

2. గొప్ప కళాభినివేశం (Strong Artistic temperment)

3. Mysticism వైపు మొగ్గు (Leanings towards Mysticism) ఈ Analysis తో మీరెంతవరకు అంగీకరిస్తారు?

జ: (1) నాకు సంఘ సంస్కరణాభిలాష చాలా తక్కువ. మనుషులు (ముఖ్యం నేను) వ్యక్తిగతంగా ఉన్నతులు కావాలనే నా దేవులాట.

2-3) మీతో ఏకీభవిస్తున్నాను.

ప్రశ్న: (1) మీ దృష్టిలో వొక రచయిత Personal life కి, అతని రచనలకి ఎలాంటి సంబంధం ఉండాలంటారు?

(2) రెండు వేరువేరు రంగాలంటారా? లేక వొకదానితో విడివడి మరొకటి లేదంటారా?

(3) తను తన నిజజీవితంలో ఆచరించలేని విలువల్ని Preach చేసే అధికారం రచయిత కుందంటారా? లేదంటారా?

(4) మిమ్మల్నే ఉదాహరణగా తీసుకుంటే– మీ వ్యక్తిగత జీవనానికి, మీ రచనలకి ఎలాంటి సంబంధ ముండేది?

(5) మీరు మీ రచనల ద్వారా చెప్పిన Values ని మీ నిజజీవితంలో ఆచరించారని చెప్పగలరా?

జ: 1-2. రచయితా, రచనా అనేది పెద్ద విషయం. ఇక్కడ స్థలంచాలదు దాన్ని చర్చించడానికి.

3. అధికారం ఏమాత్రమూ లేదు. అది పుత్ర చౌర్యం.

4. నా రచనల్లో చూపిన ఆదర్శాల్ని నా చాతనయినంతవరకు నా జీవితంలో అనుష్ఠించాలని యత్నించాను. నా జీవితంలో అనుష్ఠించిన వాటినే నా రచనల్లో రాశాను.

5. External గా సాధించగలిగాను కాని, నా లోపల పరివర్తన ఎంత యత్నించినా, నాకు తృప్తిగా కలగలేదు.

ప్రశ్న: మీరు రాస్తున్నప్పటికీ, ఇప్పటికి మీ దృష్టిలో తెలుగు సాహిత్యంలో వచ్చిన ముఖ్యమైన మార్పులేమిటి?

జ: నేను రాసే కాలంలో చాలామంది సాహిత్యంపైని ప్రేమతో రాసేవారు. ఇప్పుడు రేడియోకి, సినిమాకి, ఎకాడమీలకి ఎక్కాలని రాస్తున్నారు.

ప్రశ్న: మీ సాహిత్యంద్వారా మీరు తలపెట్టిన సాంఘిక విప్లవాన్ని – భావ విప్లవాన్ని–తెలుగు దేశంలో కొంతవరకైనా సాధించానన్న తృప్తి మీకుందా?

జ: నేనే సంఘ విప్లవాన్ని తలపెట్టలేదు. మనుషులు మారాలని ఆశించాను.

నేను ఆశించింది ఏదీ నెరవేరలేదుకదా, నేను కోరినదానికెంత దూరమో ఈనాటి తెలుగు ప్రజ.

ప్రశ్న: (1) మీరిప్పుడు తెలుగుదేశానికి దూరంగా ఉంటున్నారు కాబట్టి ఇప్పటి తెలుగుదేశాన్ని గూర్చి మీ అభిప్రాయం ఏమిటి?

(2) మీరు తెలుగుదేశంలో నివసించినప్పుడు తెలుగుదేశం మీకు అన్యాయం చేసిందని భావిస్తారా లేక ఆదరణని చూపించిందంటారా?

జ: (1) నాకేం తెలీదు.

(2) నా రచనల్ని తెలుగు దేశం Good Humourతో తీసుకుంది. ఇంకో దేశమైతే నన్ను యింకా హింసపెట్టేది. గొంతు నొక్కేది.

నా రచనల్ని తగినంత appreciate చెయ్యలేదంటే దబ్బా మోతల్ని తప్ప. నిజమైన కళని అర్థంచేసుకునే యోగ్యత లేదు ఆ ప్రజకి! ఏంచేస్తారు?

కాని నన్ను హింసించింది నా జీవిత పద్ధతికీ, వారి మన్ననల్ని, ఆగ్రహాన్ని వెలిని, నేను లక్ష్యపెట్ట లేదని, వారిని దేనికీ నేను అర్థించలేదని. కాని నావంటి వాణ్ణి ఏదేశమైనా సహించి వుండదు. అంతమాత్రం ఎంతో ఓర్పుతో, నన్ను నాతోవన వొదిలింది. అదొక్క తెలుగుదేశంలోనే సంభవం।

ప్రశ్న: ఈనాడు రాస్తున్న తెలుగు యువ రచయితలకి, రచయిత్రిలకి మీ రిచ్చే సందేశం యేమిటి?

జ: హృదయంలో కలం ముంచి రాయమని సందేశ మిద్దామను కున్నాను. కాని హృదయాలు చిరగని గట్టి పదతలకింద పాతుకు పోయినాయి. అందుకని నా సందేశం పూర్తిగా వృథా_అని తెలుసు నాకు।

చలాన్ని తలచుకున్నప్పుడల్లా ఆయన బ్రతుకు గురించి కాదుగాని, చావు గురించి బాధాకరమైన విషయం తోస్తూ వుంటుంది. సంఘాన్ని, కాలాన్ని గడగడలాడించి, అనేకమంది కలల్లో సైతం కనపడుతూ తుఫానులా విజృంభించిన ఒకనాటి చలం చివరికి ఎవరూ ఏమీ అనుకోకుండా.... మౌనంగ అసువులు వదుల్తాడా అని? పోతే పోయాడు! పోయినందువల్ల ఒరిగిన నష్టమేమీ లేదు। అన్న ధీమా ఈ సంఘానికి కలుగజేస్తుందా ఆయన మృత్యువు?

సురమౌళి - సృజన మే 68

రెబెల్ చలానికి విరసం వరంగల్ జోహార్లు

మే 4న తన 85వ ఏట అరుణాచలంలో మరణించిన గుడిపాటి వెంకట చలం గురించి మే 6 ఆదివారం సాయంత్రం వరంగల్ విరసం యూనిట్ ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ, చలం తన తొలి జీవితంలో స్త్రీ సమస్యల గురించి, పిల్లల భవిష్యత్తు గురించి, విద్యావిధానం గురించి, స్వేచ్ఛ గురించి తపన చెంది సంచలనాత్మక సాహిత్యం సృష్టించాడని అయితే ఈ అన్ని సమస్యలకూ ఆయన సామాజిక చైతన్యంతో శాస్త్రీయ పరిష్కారాల కోసం ప్రయత్నించకపోవడం వల్లనే ఈశ్వరాశీర్వాదాలతో రాజీపడ్డాడని అభిప్రాయపడినాడు. చలం సాహిత్యమంతా శ్మశానప్రాయమనడం పూర్తిగా నెగెటివ్ దృష్టి. అట్లాగే చలాన్ని మార్క్సిస్టుగా ఎస్టాబ్లిష్ చేయాలనుకోవడం వెర్రితనం. ఆయన జడప్రాయమైపోయిన తెలుగు సాహిత్యానికి, సమాజానికి ఒక కుదుపు ఇచ్చాడు. తన అనితరసాధ్యమైన వచన శైలితో వాడుక భాషా ఉద్యమానికి ఊపిర్లు పోసాడు. నేనాయన వస్తువు నుంచి శైలిని వేరు చేయకుండానే, ఆయన గొప్ప స్టైలిస్ట్ అంటున్నాను-' అని ముగించారు శ్రీశ్రీ.

చలంపై ఫ్రెంచి విప్లవకాలం నాటి నినాదాల ప్రభావం గాఢంగా వుందని, ఆయన ఆలోచనలు రూసో బ్యాక్ టు నేచర్ సిద్ధాంతానికి దగ్గరగావుంటాయని ఆయన వ్యవస్థకు, క్రమశిక్షణకు వ్యతిరేకి అని అంటూ అయితే ఫ్యూడల్ శిథిల భావాల కుళ్ళులో మురుగుతున్న తెలుగు సాహిత్యంలోకి స్వేచ్ఛ సమానత్వం వంటి పురోగామి బూర్జువా భావాలను తెచ్చి చలం యువతరాన్ని కొత్త లోకాల్లోకి కదిలించాడని, చలం అంచనా చారిత్రిక భౌతికవాద దృష్టితో గతితార్కికంగా చెయ్యాల్సి వుంటుందని వరవరరావు అన్నాడు.

విడిగా చూసినపుడు చలం స్త్రీల గురించి, విద్య గురించి, స్వేచ్ఛ గురించి చెప్పిన భావాలు ఎంతో విప్లవాత్మకంగా కనిపించినా మైదానంలాంటి నవలల్లో ఆయన ప్రతిపాదించిన స్త్రీ స్వేచ్ఛగాని, ఫ్రీ లవ్‌గాని మార్క్సిస్టు ఆలోచనలకు వ్యతిరేకమైనవేనని, అయితే చలం మార్క్సిస్టు అవునా కాదా అనే చర్చకన్న చలం సాహిత్యంలో గుణాంశ, రుణాంశాలను నిశిత పరిశీలనతో విశ్లేషించాలని లోచన్ వివరించాడు.

సమాజంలో తాను ఎదుర్కొంటున్న సమస్యలకు వయ్యక్తిక పరిష్కారాలు వెతికిన చలం సమాజం విసిరిన సవాళ్ళు ఎదుర్కోలేక ఎస్కేపిస్టు అయి రమణమహర్షి దగ్గరికి చేరుకున్నాడని, కాని చలం లేవనెత్తిన సమాజంలోని సమస్యలను నిలిచి ఎదుర్కొంటున్న యువతరం విప్లవంవైపుకు ఆకర్షింపబడ్డారని కృష్ణ అన్నాడు.

సభలో నుంచి వచ్చిన అనేక ప్రశ్నలకు శ్రీశ్రీ, వరవరరావు సమాధానాలు యిచ్చారు.

చర్చలో ఇంకా శ్రీయుతులు టి. వి. సుబ్బారావు, డాక్టర్ హరగోపాల్, వినయ్ మొదలైన వాళ్ళు పాల్గొన్నారు.

తొలుత విరసం కన్వీనర్ ఇ. ఎల్. నరసింహయ్య చలంగురించి మాట్లాడుతు తను నమ్మిన ఆదర్శం కోసం, దానితో మనం ఏకీభవించినా లేకున్నా, జీవితాంతం నిజాయితీతో పోరాడిన రెబెల్‌గా ఆయనను అభివర్ణించాడు. సభ నరసింహయ్య ప్రతిపాదించిన సంతాప తీర్మానంతో ముగిసింది.

తీర్మానం

స్త్రీ విముక్తి గురించి, పిల్లల భవిష్యత్తు గురించి, విద్య గురించి, స్వేచ్ఛ గురించి తీవ్రమైన తపన చెంది, తన నిజాయితీతో కూడిన ఆరాటాన్నే అగ్ని సదృశమైన రచనలుగా వెలువరించిన చలం తన ఎనభై అయిదవ ఏట మొన్న రమణాస్థాన్‌లో మరణించారు. సమాజంలోని రుగ్మతల కన్నింటికీ, అందులోనే భాగమైన స్త్రీ దాస్యానికి శాస్త్రీయమైన దృక్పథంతో పరిష్కారాలు వెతుకలేక పోయినా ఫ్యూడల్ విలువలతో కుళ్ళి పోయిన తెలుగు సాహిత్యంలోకి సమానత్వం, స్వేచ్ఛలాంటి బూర్జువా భావాలనైనా ప్రవేశపెట్టి ఆలోచింప చేసినవాడు, సంచలనం సృష్టించినవాడు చలం. చలం రెండవ దశయైన రమణాశ్రమ జీవితం ఆయన వ్యక్తికే సంబంధించింది. ఆధునిక తెలుగు సాహిత్యంపైగానీ, యువతరంపైగానీ దానికేమీ ప్రభావం లేదు. చలం రెవల్యూషనరీ కాకపోవచ్చు. కాని రెబెల్. ఆయన సాహిత్యంలోని, జీవితంలోని తిరుగుబాటు తత్వాన్ని, చారిత్రిక దృష్టితో విరసం విశ్లేషించి తెలుగుఆధునిక సాహిత్యానికి ఆయన అనుకూలమైన దోహదాన్ని గుర్తిస్తుంది.

తన కమిట్‌మెంట్ మనం ఏకీభవించేదైనా, కానిదైనా దానికోసం జీవితాంతం నిలిచి ఆయనే అన్నట్లు అంతర్ బహిర్ యుద్ధరావమే సాహిత్యంగా నిండు జీవితాన్ని గడిపిన చలం నుంచి నేర్చుకోవాల్సింది నిర్భయమూ, నికార్సయిన నిజాయితీ.

చలం మరణంపట్ల విరసం వరంగల్ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది.

6-5-79

వచ్చే సంచికలో.... "మార్క్స్ దృష్టిలో సాహిత్యం"

ఆర్. ఎస్. సుదర్శనం

వక్రీకరణకు సమాధానం

త్రిపురనేని మధుసూదనరావు

"తెలుగులో కవితా విప్లవాల స్వరూపం"

వేల్చేరు నారాయణరావు గ్రంథంపై

ఎస్. వి. ఎస్. రావు సమీక్షా వ్యాసం

మాండలికం కాకుండా మానవీయం కాజాలదు

సృజన (మే' 79) లో రామమోహనరాజుగారు ("రచన - భాష" వ్యాసం) మాండలిక భాషలో రచనల గురించి ఒక ముఖ్యమయిన విషయాన్ని స్పష్టంచెయ్యలేదు. మాండలిక భాషలో రచనలు లిఖిత రూపంలో వస్తున్నా వాటిలో నిరక్షరాస్యులకి చదివి వినిపించదగ్గ విలువఉంది. వంగపండు పాటలు తెలంగాణా ప్రాంతంలో చదువరులకు, సామాన్య ప్రజానీకానికీ అర్థంకాక పోవచ్చు. అలాగే గద్దర్ పాటలు శ్రీకాకుళం ప్రాంతం వారు అర్థం చేసుకోలేకపోవచ్చు- కాని ఆయా ప్రాంతాలలో చదువురానివారిని పట్టగల శక్తి వాటికుంది. అలాగే అల్లం రాజయ్యగారి కథలు కూడా, చదివి వినిపించవచ్చు.

ఈ రకం రచనలవల్ల "ప్రాంతీయకవులు- రచయితలుగా ఉండిపోయే అవకాశం ఉన్నది" నివారివాదన. ఏ రచయితయినా అనివార్యంగా ఏదోఒక ప్రాంతానికి- కాలానికి చెంది ఉంటాడు. అయితే ఈ "సంకుచితం" పాఠకుల, శ్రోతల వైశాల్యం లోగానీ రచయిత చైతన్యంలో కాదు. చైతన్యం ప్రాంతానికీ కాలానికీకాక మొత్తం సమాజానికి ప్రపంచానికి చెందిఉంటుంది. ఈకారణంగా మాండలికభాషలో సాహిత్యం అవసరమే. 'కళలో వస్తువు సామ్యవాదం (స్వభావం) గా, రూపం జాతీయం (స్వరూపం) గా వుండాలి'- స్టాలిన్.

"మధ్య తరగతి వారికోసం చాలినంత సాహిత్యాన్ని ఇంకా సృజించకముందే మాండలిక భాషా సమస్యను తెచ్చిపెట్టడం కీలకమైన" ప్రశ్నే. అయితే ఇక్కడ సాహిత్యాన్ని పాలిస్తున్న వ్యాపార నాగరికత మధ్యతరగతి కళలని ప్రభావితం చేసినంతగా కింది తరగతివాళ్ళ కళారూపాల్ని చేసినట్టుతోచదు. ప్రజా వ్యతిరేక సాహిత్య బలం అక్కడ ఎక్కువ కావడం వల్లే మధ్యతరగతిలో చొచ్చుకు పోవడం కష్టం అవుతుందికూడా. ఆమాటకొస్తే కళ కిందితరగతి జీవితంలో భాగం అయినంతగా మధ్యతరగతీ జీవితంలో అయినట్టు అవుపించదు- (పని చేసుకుంటూ పాటలుపాడే మధ్య తరగతి వాళ్ళున్నారా?) చారిత్రికంగా సామాన్య ప్రజలలో వస్తున్న కళారూపాలు (పాటలేకాదు, కథారూపాలు కూడా) స్వీకరించడం ప్రజల్ని "మానసికంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళడానికి" చాలా అవసరం. అది మాండలికం లేకుండా సాధ్యంకాదు.

అలాగని మధ్య తరగతి కోసం రచనలు చెయ్యకూడదనో, తక్కువ చెయ్యాలనో అనడంలేదు. అసలు ఒకే చైతన్యం ఈ రెంటినీ ముడి వేస్తున్నంతకాలం ఒకదానికి మరొకదానికి పోటీలేదు. అంతిమ పరిశీలనలో ఈ రెండు వర్గాల మధ్య వైరుధ్యం శత్రు వైరుధ్యం కాదు.

— ఒక పాఠకుడు

SRJANA Telugu Monthly **June 79** **H/WL-10**
Regd. No. with Registrar of News Papers 10953/67

తుఫాను

తెలుగు దేశాన్ని మళ్ళీ ఒకసారి మే నెల 11, 12 తేదీల్లో సముద్రం సంక్షోభానికి గురి చేసింది. ఈసారి నెల్లూరు, ప్రకాశం జిల్లాలను తుఫాను బీభత్సం చేసింది. వేలాది పేద ప్రాణాలు, లక్షలాది పూరిగుడిసెలు, వందల కోట్ల రూపాయల విలువచేసే సంపద నాశనమయ్యాయి.

ఉప్పెనగానీ, తుఫానుగానీ మన కెప్పుడూ చెప్పకుండారాలేదు. ఎప్పుడూ ఆ ముప్పునుంచి కాపాడడానికి ప్రభుత్వం చేసిందీలేదు.

కాకపోతే ఈసారి తుఫాను చెన్నారెడ్డిగారి పార్టీలో తుఫాను నుంచి ఆయనను కాపాడింది. ఇందిరా ర్యాలీకి మొహం తప్పించి మొరార్జీని మెప్పించడానికి తోడ్పడింది. ముందు జాగ్రత్తలు యుద్ధప్రాతిపదికపై తీసుకున్నాడనే అతిశయోక్తి ప్రచారాలవల్ల వెంగళరావుపై ఒక పాయింటు స్కోరు చేసాడు. అన్నిటికన్నా మించి మంత్రివర్గ, అధికార రాబందులకు, గరత్మంతునికి చేతికీ నోటికీ అందినంత తిండి.

ప్రజాపరంగా తుఫాను కలిగించిన నష్టాలను, కష్టాలను బేరీజు వేసే ప్రజా దృక్పథం గల ప్రత్యక్ష పరిశీలన ఆ ప్రాంతాలను పర్యటించిన వారెవరయినా పంపవలసిందిగా సృజన కోరుతున్నది.

తుఫానులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, కూడు, గూడు కూడ కోల్పోయిన లక్షలాది మంది ప్రజలకు సృజన తన ప్రగాఢమైన సానుభూతిని అందజేస్తున్నది. తక్షణ పునరావాస సౌకర్యాలు, పని, నష్టపరిహారం కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

SRJANA **Rs. 1-50**
Hanumakonda, Warangal 506001